# మూసీ

# MUSI


- Samputi : 27 • Sanchika : 08 • Pages : 64 • Rs. 20
- June 2024

UGC CARE List
Approved Journal




- ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పాట - భాష
- భూమయ్య పరిశోధన - విమర్శ
- అస్తిత్వనదం ఆవలితీరాన - మునిపల్లె రాజు మాజికల్ రియలిజం
- తెలుగు పద్యానికి పచ్చని తోరణం
- వేపూరు హనుమద్దాసు జీవిత విశేషాలు - రచనలు
- పాలమూరు సాహితీ రైతు వల్లపురెడ్డి బుచ్చారెడ్డి
- మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-6
- భారత రత్నం - మన పీ.వీ.





Scanned with OKEN Scanner






# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 8
జూన్ - 2024
'క్రోధి' జ్యేష్ఠ మాసం

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పాట - భాష ... డా. సంగి రమేష్ 7
భూమయ్య పరిశోధన - విమర్శ ... ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు 11
అస్తిత్వనదం ఆవలితీరాన - మునిపల్లె రాజు మాజికల్ రియలిజం ... గొల్లపల్లి వనజ 15
గుంటూరు రచయిత్రుల కథలు - పరిశీలన ... పరుచూరి మౌనిక 19
తెలుగు పద్యానికి పచ్చని తోరణం ... బోళ్ళ ప్రవీణ్ కుమార్ 23
వేపూరు హనుమద్దాసు జీవిత విశేషాలు - రచనలు ... డా. శ్రీవైష్ణవ వేణుగోపాల్ 26
పాలమూరు సాహితీ రైతు వల్లపురెడ్డి బుచ్చారెడ్డి ... మొకరాల స్వర్ణలత 33
ఆనంద రామాయణము - ఒక వివరణ ... ఆమంచర్ల గౌతమ, డా.ఎ. కృపానిధి 36
మహాభారతం:'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-6 ... డా. అట్టెం దత్తయ్య 39
ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు కథలు - సామాజికాంశాలు ... గద్దల అనిల్ 43
నిరంతర సాహితీ మూర్తి - డా. టి. శ్రీరంగస్వామి ... డా. తిరునగరి శరత్‌చంద్ర 49
భారత రత్నం - మన పీ.వీ. ... డా. టంగుటూరి సైదులు 53

### సమీక్షలు

చిక్కటి నవల 'అక్రమ సంతానం' ... ఎం. విప్లవ కుమార్ 55
వైభవంగా ఆవిష్కృతమైన 'శాసన పర్వం' ... డా. మంత్రి శ్రీనివాస్ 58
స్వీకృతి ... 61

### కవితలు

ఏడుకోలల బాయి... ఏనుగు నరసింహారెడ్డి - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; మన 'హనుమ' ... పసుపులేటి నరసింహారావు - 10; కలాయి వాలా ... డా.ఎన్.గోపి - 18; శివశంకరం .. డా. ఒజ్జల శరత్ బాబు - 32; దేనికోసం ... టి. శ్రీవల్లీ రాధిక - 38; కాకి సమయం ... తండ హరీష్ గౌడ్ - 45; నానీలు ... పిప్పి శ్రీలత - 52; కొద్దిసేపు మరణాన్ని భరించు ... జానీ తక్కెడశిల - 60; ప్రాణ ప్రస్తారం ... డా. జ్యోత్స్న - 62;



**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

***Printed, Published and Owned by :***
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం






వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# అంటు

ఏవైనా రెండు లేదా అంతకన్నా ఎక్కువ విషయాల సంగమానికి 'అంటు' అని తెలుగులో పలకడం మన భాషా సంప్రదాయం. మొక్కలకు అంటు కట్టడం అనే పదం వింటుంటాం. ఏవైనా ద్రవాలు లేదా అంటుకునే పదార్థాలు, ఆహార పదార్థాలు చేతిని, శరీరాన్ని పట్టుకుంటే దానిని 'అంటు' అంటాం. అంటుపెట్టడం, అంటుకోవడం, అంట్లు, అంటరానితనం, అంటువ్యాధులు మొదలైన పదాలు నిత్యజీవితంలో వినిపించే మాటలే. ఒకరినుండి మరొకరికి సంక్రమించే వ్యాధులను అంటువ్యాధులని అంటారు. అంటు విధానం అనేక రూపాల్లో మనకు కనిపిస్తుంది.

శరీరానికి అంటుకోవడం, మనస్సుకు అంటుకోవడం అనే అంశాలను మనం ఒకసారి పరిశీలిస్తే.. బాహ్య శరీరానికి అంటుకునే వానిని శుద్ధం చేసుకోవడం సులభం అవుతుంది. దానిలోనూ కొంత జాగ్రత్త అవసరం. అంటుకున్నది వాతావరణంలోని 'దుమ్ము', 'మట్టి' అయితే చిన్న ప్రయత్నంతోనో, ఊదడం వల్లనో అంటు వదులుతుంది. అదే శరీరానికి బురద అంటుకుంటే కడగడానికి కొంత సమయం పడుతుంది. ఇంకా నూనె అంటుకోవడం, రంగులు అంటుకోవడం ద్వారా శుద్ధి చేసుకోవడానికి సమయం అధికమవుతుంది. వేరు వేరు సబ్బులు, లిక్విడ్స్‌ను ఉపయోగించి మాత్రమే ఈ అంటును వదిలించుకోవాలి.

శరీరానికి అంటుకునే మట్టి, నూనె మొదలైన వానిని శుద్ధి చేసుకోవడానికి, ఇంట్లోని వేరు వేరు వస్తువులకు, నేలకు అంటుకునే మలినాలను శ్రద్ధతో వెంటవెంటనే శుద్ధం చేసుకోవడానికి వేరు వేరు మార్గాలుంటాయి. మరి వేరు వేరు విషయాలు మనని ఆలోచింపజేస్తుంటాయి కదా! అవి మన మనస్సును అంటుకుంటాయి. మన చుట్టూ ఉండే చుట్టాలు, బంధంతో కూడుకున్న బంధువులు, బంధనాలు, ఉద్యోగాలు, మిత్రులు, విషయాలు మనని బాగా అంటుకుంటూనే ఉంటాయి. ఇవి అంటుకోకుండా ఉండాలన్నా, అంటుకున్నవి వదిలించుకోవాలన్నా కొంత జ్ఞానం కావాలి. ప్రయత్నమూ తీవ్రం కావాలి. దాన ధర్మాదులు పెరగాలి. జ్ఞానంతోనే అంటుకోకుండా ఉండడానికి తగిన ప్రయత్నం జరుగుతుంది. ఒకసారి అంటుకుంటే మాత్రం దాని బరువు పెరుగుతుంది, అది శుద్ధమైనంతవరకు ఈ లోకంలోకి రావడం, పోవడం తప్పనిసరి అవుతుంది. చూసిన, విన్న, రుచి చూసిన అంశాలతో పాటు, వేరే వాళ్ళు చెప్పడం ద్వారా కొన్ని అంశాలు మన మనస్సును అంటుకుంటాయి. బలీయమైన అంశాలు మనస్సును అంటుకుంటుంటే మానవుని ప్రగతి చాల కుంటుబడుతుంది. భయం, ద్వేషం, కోసం మొదలైన అంశాలన్నీ ఈ అంటుల వల్లనే ఏర్పడుతుంటాయి. ఆ భావాలుగా మనం తయారు అవుతుంటాం.

అంటిన అంట్లను వదిలించుకోవడానికే మనం ఈ లోకానికి వచ్చింది. ఎన్నో బంధాలు, అంట్లు మనం ఈ లోకానికి కట్టుకొని వస్తున్నాం. అమ్మ, నాన్న, అక్క, చెల్లి, అన్నదమ్ములు, బంధువులు, ఉద్యోగాదులు అన్నీ కూడా ఆ అంట్లలోని భాగాలే. వాటిని వదిలించుకోవాలంటే నొప్పి తప్పదు. వాటి గూర్చిన తగిన అవగాహన, జ్ఞానం వస్తే చైతన్యం లాగా, ఆత్మ లాగా నిరంతరం శక్తిగా మారే అవకాశం కలుగుతుంది. మనకు వచ్చే ఆలోచనలన్నీ దాదాపుగా అంటు విషయాలే. శ్రమతో వాటిని దూరం చేసుకోవాలి. ఆలోచనలు అధికంగా చేయకుండా బహుముఖ ఆలోచనలను, ఏకముఖంగా మార్చుకోవడానికి నిరంతర జపధ్యానాదుల అవసరం ఉంటుంది. అంటు వదిలించుకోవడమే శుద్ధి. దేహానికైనా, మనస్సుకైనా. అంటు వదిలిన మనస్సునే చైతన్యం అంటాం. ఏ అంటూ లేని మనస్సే పూర్ణ శక్తి. ఆ శక్తి స్వరూపంగా నిరంతరం చేసేదే ప్రయత్నం.

జరుగుతున్న పనులు జరగవద్దని చెప్పి
అధికారులను పంపి ఆపమనుట
లబ్ధిదారుడు వచ్చి లబలబా మొతుకుంటె
అధికారులదె తప్పు అంటు అరిచి
చట్టాల పరిధిలో జరిగేటి పనులను
తప్పించి తనవైపు తిప్పుకొనుట
ప్రజముందు ఒక మాట ప్రైవేటుగా ఓటి
అధికారులకు జెప్పి ఆగపరచు
చేయవద్దంటె ఒకసారి చేయుమనుట
చేయమని అంటె ఒకసారి చేయవద్దు
అనెడు అర్థాలు సృష్టించి అటుగ నిటుగ
మాయగాడాయె ఈరోజు నాయకుండు

మాయమాటల హామీల మర్మమెరిగి
గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా ఒర్లుబోతు!
ఒక్కమాటన్న వినవార! తిక్కలోడ!


ఎంపీలు వెళుతుండె ఎర్రబస్సులనెక్కి
పియ్యేలు అను మాట తియ్యకుండ
సభలోకి ఎమ్మెల్లె సైకిలెక్కొస్తుండె
తను కూడ మామూలు మనిషిననియె
ఇపుడొచ్చుఎమ్మెల్లె ఇవరమే దొరకదు
కారు జీపుల గుంపు బారులోన
ఎటులొచ్చునో ఎంపి ఎవ్వరూహిస్తారు
తీరైన కాన్వాయి తీరులోన
ప్రజల సొమ్ముకు బాధ్యతే పట్టదెట్ల
ఎంత పని చేస్తె ఫలమొచ్చు ఎంతకెంత
అనుచు విచికిత్స చేయుట అసలులేదు
కాన మునిగేను జనసామ్యమనెడు పడవ

మాయమాటల హామీల మర్మమెరిగి
గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా ఒర్లుబోతు!
ఒక్కమాటన్న వినవార! తిక్కలోడ!

# ఏడు కోలల బాయి







**ఏనుగు నరసింహారెడ్డి**
ఫోన్ : 897 886 9183

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 8 (6) హైదరాబాద్ జూన్ : 2024

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. ఉపోద్ఘాతం : ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. విషయం : పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. ముగింపు : పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
5. ఉపయుక్తగ్రంథసూచి : ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

మంచి మాటలు వినవే ఓ..మనసా
మారు మాటలాడకుమే ఓ...మనసా
మొండి వాసనల మైలను వీడి
దండి దైవము వితల చెంత చేరుమా

క్రోధము నిను అంధకారములో ద్రోయ
కొంప ముంచుకోకుమో మనసా
కామము నీ కనురెప్పలు మూయగ
పశువోలే వర్తింతువేల మనసా!
బృందావని రాజ చందనమును ధరియించి
మది మైల కడుగుకోవే మనసా

తలపై కన్నులు, మంచి వీడిన మాటలు
నాది నాకు నేననుచు మునగకు
ముల్లె వెనక ముడిగట్టి మెలుగకు
తల్లి హరిని వీడి తగవుల దిగకు
పరుల సొమ్ముల గోరి పలుచన బడకు
పంచుకొని తినుట పరమ సుఖమది గనుము

తుకా పలుకులవి వినుకో మనసా
సత్యశోధనలోన మనవే మనసా
లోకనాథుడి లీల తెలుసుకో మనసా
పాదురంగ విభు పదము పాడవే మనసా




అనువాదం :

డా॥ మంత్రి శ్రీనివాస్

ఫోన్ : 83283 33720

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 8 హైదరాబాద్ జూన్ : 2024


# ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పాట – భాష

డా. సంగి రమేష్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహేశ్వరం. ఫోన్ : 9440447737

భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల కన్నా తెలంగాణ నేల మీదే ఎక్కువ ప్రతిభావంతమైన పాటలు పురుడుపోసుకున్నాయి. పాట ఇక్కడి ప్రజల జీవన విధానంలో ఒక భాగం. జనబాహుళ్యంలోకి చొచ్చుకుపోయే జనరంజకమైన బాణీలు, అభివ్యక్తిలో కొత్తదనం, తెలంగాణ అస్తిత్వ ప్రకటనలో, నిర్మాణంలో, సంస్కృతిని వ్యక్తం చేసే బలమైన ప్రక్రియగా పాట విశిష్ట స్థానాన్ని పొందింది. సాహిత్యం సమాజానికి ఉపనది కాబట్టి తెలంగాణ సమాజ అవసరాలను ఎప్పటికప్పుడు తీర్చడంలో, ప్రజల గొంతుకు వాహికగా నిలబడడంలో అన్ని ప్రక్రియలు కృషి చేశాయి. ఈ పనిని పాట మరింత ఎక్కువగా నెరవేర్చింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష నెరవేర్చడానికి జరిగిన తొలి, మలి దశల ఉద్యమాల్లో కూడా పాట ఎంతో బృహత్తర బాధ్యతను నెత్తికెత్తుకున్నది. గుండె గుండెను ఒరుసుకుంటూ సాగిపోయే పాట మరింత పదునెక్కి ఊరూరా, పల్లె పల్లెకూ ఉద్యమ భావజాల వ్యాప్తిని చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసింది కేవలం పాటేనంటే అతిశయోక్తి కాదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో వెలువడినన్ని పాటలు ఈ మధ్య కాలంలో మరే ఉద్యమంలో వెలువడలేదు. వందలాది మంది పాటకవులు, వాగ్గేయకారులు వేలాది పాటలు రాశారు.

**తొలిదశ (1969 – 1973)**

తొలిదశలో ఉద్యమం కేవలం నగరాలకే పరిమితం కావడం, విద్యార్థులు, విద్యాధికులు మాత్రమే ఉద్యమంలో పాల్గొనడం వలన పాటలు ఎక్కువగా పుట్టలేదు. వచ్చిన కొద్దిపాటలను కూడా ఆయా రచయితలు, గాయకులు సభల్లో పాడి వదిలేశారు కాని రికార్డు చేయలేకపోయారు. భవిష్యత్ తరాల కోసం అందించాలనే సోయి లేకపోవడం, కీర్తికాంక్ష లేకపోవడం వలన ఆనాటి పాటలు చాలా వరకు ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయాయి. తెలంగాణకు జరిగిన అన్యాయంపైనా, అభివృద్ధి నిరోధక పాలన వలన విసిగిపోయి, నిరాశ, నిస్పృహలకు లోనైన ఆనాటి యువత అప్పుడే కొత్తగా వస్తోన్న నక్సలైట్ ఉద్యమం పట్ల ఆకర్షితులు కావడం వల్ల కూడా తొలిదశ ఉద్యమంలో ఎక్కువ ఎరుపు పాటలే పుట్టాయి. లేదా అసలే పుట్టలేదు. 1969లో మొదలైన ఉద్యమాన్ని తొందరగానే అంటే తొమ్మిది నెలల్లోనే అణగదొక్కడం వలన కూడా ఉద్యమ పాటలు, ఇతర ప్రక్రియల్లో సాహిత్యం అంతగా వెలువడలేదు. ఆనాటికి యుక్తవయసులో ఉన్న ఎస్వీ సత్యనారాయణ, అనుముల శ్రీహరి, జి.వి.జగదీశ్వరస్వామి, జి.యాదగిరి, కె.రుక్నుద్దీన్, ననుమాస స్వామి లాంటి వాళ్లు కొన్ని పాటలు, గేయాలు రాసి తమ పుస్తకాల్లో విడుదల చేశారు. మరుగున పడిన 'విప్లవఢంకా', 'విప్లవశంఖం' కవితా సంపుటాలతో పాటు మరిన్ని కవితలను డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, డా. సంగిశెట్టి శ్రీనివాస్‌లు కలిసి '1969–1973 తెలంగాణ ఉద్యమ కవిత్వం' పేర సంకలనం ప్రచురించారు. అందులో కొన్ని తొలిదశనాడు రాసిన, పాడుకున్న పాటలున్నాయి. కాని వాటిలో తెలంగాణకే ప్రత్యేకమైన భాషా సొగసు తక్కువ. ఎక్కువ శాతం సరళ గ్రాంధికంలోనే సాగిన పాటలవి. **'లేవరా సోదరా! లేవవే సోదరీ', 'తెలంగాణ మేల్కొన్నది! తెలంగాణ మేల్కొన్నది!!', 'చాలురా చాలురా కాంగిరేసోడా! చాలా చెప్పొచ్చావు చాలించి పోరా!!'** అన్న రీతిలో సాగిపోయే పాటలు కనిపిస్తాయి. ఈ దశలో వెలువడిన పాటల్లో భాషా సోయి కన్నా ఉద్యమ సోయే ఎక్కువగా కనిపిస్తుంది.




**మలిదశ (1995–2014)**

తెలంగాణ ప్రజా జీవితమే తెలంగాణ పాటకు జవజీవాలను అందించింది. మాయామర్మం తెలియని జానపదుల నుండే వస్తువును, బాణీలను, భాషను స్వీకరించి తెలంగాణ పాట కవులు కొన్ని వేల పాటలను రచించారు. ఆరు దశాబ్దాల సమైక్యపాలనలో రెండున్నర జిల్లాల కోస్తా భాషనే ప్రామాణిక భాష పేర, అధికార భాష పేర పాఠ్యపుస్తకాలలో, సినిమాలలో, టీవీలలో, రేడియోలో, దినపత్రికల్లో రాజ్యమేలింది. దీనివల్ల మూడు తరాల తెలంగాణ పౌరుల నెత్తిమీద సోకాల్డ్ ప్రామాణిక భాషనే రుద్దబడింది. తెలంగాణ భాష మోటు భాష అనీ, నాజూకు భాష కాదని, అన్ని శాస్త్రాలను వ్యక్తీకరించడానికి పనికి రాదనే ఒక ఆత్మన్యూనతలోకి నెట్టివేయ బడింది. క్రమంగా ఎన్నో విలువైన వజ్రాలలాంటి తెలంగాణ పదాలు వ్యవహారం నుండి జారిపోయాయి. అక్షరాస్యుల కన్నా నిరక్షరాస్యులైన మారుమూల గ్రామీణ ప్రజలే ఎంతో కొంత తెలంగాణ భాషకు ఇంకా జీవం పోస్తున్నారు. అచ్చమైన తెలంగాణ తెలుగు భాష పల్లీయుల నాలుకల మీదనే ఇంకా కొంత బతికి ఉంది. ఇంగ్లీష్ భాష తెలుగు భాషను అణగదొక్కినట్లు, ఆంధ్రా తెలుగు తెలంగాణ తెలుగును అణగదొక్కుతున్న విషయాన్ని గమనించిన

తెలంగాణ సాహిత్యకారులు 1970ల నుండే తెలంగాణ తెలుగులో కథలు, నవలలు, కవిత్వం, పాటలు రాయడం మొదలుపెట్టారు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంలో పాటకవులెంతోమంది తెలంగాణ తెలుగుకు జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ప్రయత్నించారు. తెలంగాణ ప్రాంత గోసను, వేదనను, సోయిని తెలంగాణ తెలుగు భాషలో చెప్తేనే ఆ పాటలకు సజీవత్వం, సహజత్వం, తడి ఉంటా యని భావించిన కవులు ఉద్యమ పాటలను కావాలనే తెలంగాణ తెలుగులో రాసి పాడారు. ఉద్యమానికి మరింత భాషా బలాన్ని భావ వ్యాప్తిని సమకూర్చారు. తెలంగాణ తెలుగును జంధ్యాల పాపయ్యశాస్త్రిలాంటి ఆంధ్రా కవులు **'తౌరక్యాంధ్రం'** అని ఎద్దేవా చేస్తే దాన్ని తిప్పికొట్టడానికి తెలంగాణ కవులు, పాటకవులు కొన్ని వేల ఉద్యమ పాటలను తెలంగాణ తెలుగులోనే రాసి ఆయనకు సమాధానమిచ్చారు. తెలంగాణ తెలుగులో ఉన్నట్లుగానే ఆంధ్ర భాషలో కూడా ఉర్దూ భాష మిళితమైందని ప్రొ. కె. జయశంకర్‌లాంటి వారు కరుణశ్రీకి వివరించి నిరూపించారు. ఉద్యమం మొదలైనప్పటి నుంచి కనీసం ఆరవై సంవత్సరాల పాటు తెలంగాణలోని ప్రతిమూలమలుపులో, ఏ సమస్యను ఎత్తిచూపడానికైనా తెలంగాణ పాట కవులు తెలంగాణ తెలుగులోనే అనేక పాటలు రాసి వారు అనుకున్న భావజాలాన్ని సామాన్య ప్రజల గుండెల్లోకి నేరుగా ప్రవహించేట్లు చేశారు. ఏ నేలలో పుట్టిన కవికైనా తాను మనసులో అనుకున్న భావాన్ని వ్యక్తీకరించడానికి తన ప్రాంతీయ భాష తోడ్పడినంతగా మరే భాషా ఉపయోగపడదు. ఈ విషయం తెలిసిన తెలంగాణ పాటకవులు తెలంగాణ జీవద్భాషలోనే ఎన్నో పాటలురాసి తెలంగాణ పదజాలాన్ని రికార్డు చేశారు. తెలంగాణ ప్రజల ఆవేదనను, ఆర్తిని ప్రపంచానికి తెలియజేశారు మద్దతు కూడగట్టారు.

**"గజ్జెలు గజ్జెలు రెండు గజ్జెలో... రాజన్న**
**శేనువాయె శెలుకవాయె గజ్జెలో... రాజన్న**
**బతుకువాయె మెతుకువాయె గజ్జెలో... రాజన్న**
**గొడ్డువాయె గోదావాయె గజ్జెలో... రాజన్న**
**వలసవోయి బతుకుడాయె గజ్జెలో... రాజన్న –**

**'రాజిగ ఓరి రాజిగ'**– గూడ అంజయ్య

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తారాస్థాయికి చేరడానికి పాటలు ప్రధాన పాత్ర వహించాయి. ప్రజల బాణీలో, ప్రజల భాషలో ఎంతో మంది ప్రజాకవులు రాష్ట్ర ఉద్యమాన్ని పల్లెపల్లెకు విస్తరింపజేశారు. ఉద్యమ ఆవశ్యకతను ప్రచారం చేయడంతోపాటు పల్లె ప్రజలకు తొందరగా చేరడానికి ఆనాటి కవులు విరివిగా వాడుకున్నది ప్రజల భాషనే. తెలంగాణ సామెతలను, నుడికారాన్ని, ఉచ్చారణ తీరును, ఊనికను బలంగా వాడుకొని ఉద్యమాన్ని నలుదిశలా వ్యాపింప జేశారు. అలా రాసిన పాటలే ప్రజల మన్ననలను పొందాయని చెప్పవచ్చు. ఈ పాటలో కూడా **'పుడితొక్కటి సత్తె రెండు', 'సచ్చినోని లగ్గానికి వచ్చిందే కట్నమనిరి', 'కాకులను కొడుతుండ్రు, గద్దలకు పంచుతుండ్రు' 'అందరు శాకాహారులే మరి రొయ్యల ముల్లేడవాయె'** లాంటి సామెతలను ఉపయోగించి తెలంగాణకు వివిధ రంగాలలో జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టాడు కవి. **'సుక్కపొద్దు', 'కాశెవోసి', 'ముందమోపె', పబ్బం', 'కొలువు'** లాంటి పదాలు పాటను మరింత పదునెక్కించాయి. ఉద్యమం జోరుగా సాగుతున్న కాలంలో ఈ **'రాజిగ.. ఓరి రాజిగ'** అనే పాట పాదరసంలాగా గుండె గుండెకు చేరి ఎంతో సంచలనాన్ని, కదలికను సృష్టించింది. ఏ వేదిక మీద విన్నా ఈ పాట వినిపించకుండా ఉండలేని కాలం అది.

**"ఊరుగాచె తల్లి ఉరిమి సూడంగ**
**బువ్వలేని తల్లి బోనమొండింది**
**బువ్వలేని తల్లి బోనమొండింది**
**సేనుకొచ్చిన పురుగు సెరిగి పోసిందా**
**బోనాల పండుగ నా తెలంగాణ నా తెలంగాణ**
**శివసత్తుల ఆట నా తెలంగాణ నా తెలంగాణ"**

–'నాగేటి సాళ్లల్ల'–డా॥ నందిని సిధారెడ్డి

**'నాగేటి సాళ్లల్ల నా తెలంగాణ'** అనే ఈ పాట ఆనాడు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని గ్రామగ్రామాన, ప్రతి ఉద్యమ వేదిక మీద చాటి చెప్పింది. బాణీతో పాటు ఈ పాటలో వాడిన ప్రతి పదం ప్రజల భాష నుంచి తీసుకున్నదే. తెలంగాణ సంస్కృతిని, ప్రజా జీవితాన్ని, తెలంగాణ అస్తిత్వాన్ని అణువణువునా పుణికి పుచ్చుకున్న ఈ పాట ఆనాడు ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. **'పానాదులు', 'పునాస', 'తంగేడు పువ్వు', 'జడకొప్పు', 'వాగు', 'అలాయి బలాయి', 'జంబి', 'బోనం', 'దట్టిగట్టుట', 'పీరీలు' 'ఒగ్గు' 'బురుజు', 'గోరుకొయ్యలు'** మొదలైన పదాలు తెలంగాణ మట్టి పరిమళాన్ని వెదజల్లుతూ పాటకు తెలంగాణ సౌందర్యాన్ని ఆపాదించి పెట్టాయి. పాటలోని ప్రతిపదం తెలంగాణ తెలుగు పదమే కావడం మూలంగా పాటకు ఒక ఔన్నత్యం, ఒక తెలంగాణతనం వచ్చాయి.

**"దూపగొన్న బిడ్డల దేహమవిసిపోయె**
**ఎక్కెక్కి ఏడ్చింది గోదావరి.. తాను**
**ఒంటరి దుఃఖమై గోదావరి**
**విడిదిచేసే చోట విసిరిసిరి కొట్టారు**
**నడిసొచ్చె దారుల్ల నిలదీసి తరిమారు**
**కువ్వారం పట్టింద్రు కుట్రలు చేసింద్రు"**

–'అందని స్తన్యమై గోదావరి' – కాసుల లింగారెడ్డి

ఈ పాటలో కవి **'కడగండ్లు', 'తల్లడిల్లు', 'వలపోత', 'దూప', 'కువ్వారం', 'తండ్లాట', 'తకరారు' 'ఉరుకు'** లాంటి తెలంగాణ పదాలతో గోదావరి నది ఆవేదనను ఎంతో బలంగా చిత్రీకరించాడు. జీవధారగా పారే గోదావరి తెలంగాణ ప్రజల, పేదరైతుల కష్టాలను తీర్చకుండా ఎక్కడికో తరలి పోతుందని, కన్నీటి కాలువలతో ఎక్కెక్కి

ఏడుస్తుందని వర్ణించాడు. కాలాలు మారినా, రాజ్యాలు కూలినా తెలంగాణ నెత్తుటి గాయం మాత్రం నిరంతరం రగిలిపోతూనే ఉందని చెప్తాడు. ఇక్కడ బీడువడ్డ భూములను చూసి తల్లడిల్లి చివరికి గోదావరి నది కూడా ఉప్పెనై పొంగిందని, పోటెత్తి పోరాటగీత మైందని చెప్పడంలో తెలంగాణ ఉద్యమ స్వరూపం కనిపిస్తుంది.

**"దసర పండుగ దగ్గరుంది దర్జివాళ్లు కుట్టరా అని**
**తమ్మునీకి ప్యాంటు తెస్తం నీకు షర్టు తెస్తమంటే**
**ఏది వొద్దని జిద్దు చేస్తివి అలిగి అన్నం తినకపోతివి**
**తెల్ల ప్యాంటు ఎర్ర షర్టు తెచ్చి కుట్టీ పెట్టినాము**
**మీరు పాలపిట్టై చూసిపోతారా మా బిడ్డలు**
**మీరు జమ్మి ఆకై కలిసిపోతారా మా కూనలు"**

– 'వందనాలమ్మో' – గద్దర్

ఉద్యమంలో అసువులు బాసిన అమరుల త్యాగాలను కన్నపేగు కదిలిపోయేలా పాడి కంట కన్నీరు పెట్టించిన పాట ఇది. ఒక్కొక్కరే నేలకొరిగిపోయి సుక్కల్లో కల్సిపోయిన వీరులను తలుచుకుంటూ తల్లడిల్లిన ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. కావుకావుమని కాకి అరిచినా, ఊరపిచ్చుక గుడ్డు పెట్టినా వాటిలో ఆ కన్న పిల్లలను చూసుకునే తల్లిదండ్రుల గోస చెప్పరానిది. ఈ పాటలో తెలంగాణ అస్తిత్వాన్ని పట్టి చూపే ఎన్నో పదాలు సందర్భానుసారంగా వాడడం వల్ల పాట నేరుగా ప్రజల్లోకి కరుణ రస సంద్రమై చొచ్చుకుపోయింది. పాట ముగింపులో తెలంగాణ యువకుల మొండితనాన్ని, పోరు స్వభావాన్ని పాడి మన చేతికి కూడా ఎర్ర జెండా ఇస్తాడు కవి.

**"ఆడుదాం డప్పుల్ల దరువెయ్‌రా**
**పల్లె తెలంగాణ పాట పాడరా**
**కోలాటమూ జెడ కొప్పెయ్‌రా**
**దూలంటూ అలావ్‌పై దుంకులాడరా...**
**.......................................**
**బాలసంతు గంటల్ల మోతలేవిరా**
**సుప్రభాతమంటూ రోజు సోదాయెరా**
**కంటినిండ పంటజూసి పొలిజెయ్యరా**
**ఓలంటూ బంతికాడ గొంతెత్తరా**
**బతుకమ్మా మన బతుకు ఆటేగదరా**
**జాజిరాద జమగూడి పోదాం పదరా..."**

–'ఆడుదాం' – మిత్ర

కాలక్రమంలో తెలంగాణ సంస్కృతి ఎలా తెర్లుతెర్లు అవుతుందో ఈ పాట కళ్ళకు కడుతుంది. టీవీలు ఇంటింటికి వచ్చిన తరువాత ఎన్నో జానపద పాటలు, ఆటలు, పండగలు కాలగర్భంలో కలిసిపోయిన తీరును వర్ణిస్తూనే కవి ఆనాటి ఆట, పాటలను, సంస్కృతి సంప్రదాయాలను తవ్విపోస్తాడు. మన భాష, యాస సినిమాల్లో విలన్లకు వాడడాన్ని, గ్రామీణ ప్రాంతాల్లోని భాగోతాలన్నీ మాయమై పోయి పట్నం సినిమోళ్ల వశం ఎలా అయిందో చెప్తాడు కవి.

ఉద్యమ కాలంలో వెలువడిన ప్రతిపాటలో ఎన్నో విలువైన రత్నాల్లాంటి తెలంగాణ పదాలు పరుచుకొని ఉన్నాయి. ఉద్యమ తీవ్రతను, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించడంలో ఇక్కడి పాటకవులు ఎంతో ఒడుపుగా తెలంగాణ భాషను వాడుకున్నారు. ప్రజల్లో ఉద్యమ వాడి వేడిని, నెత్తురు మండే ఉద్యమ తారాస్థాయిని వర్ణించడానికి ప్రజల నాలుకల మీదున్న తెనెలాంటి పదాలను చాల సందర్భోచితంగా వినియోగించి పాటలకు ఒక భాస్వరపు స్వభావాన్ని అద్దారు. అందెశ్రీ, గోరటి వెంకన్న, అంబటి వెంకన్న, నేర్నాల కిశోర్, కోదాటి శ్రీను, ఏపూరి సోమన్న, గిద్దె రాంనర్సయ్య, దరువు ఎల్లన్న, యశ్‌పాల్, పయిలం సంతోష్, సుద్దాల అశోక్‌తేజ, వరంగల్ శ్రీను, కందికొండ, నిస్సార్, యోచన, సాయిచంద్, మాస్టార్జీ, జయరాజ్, మిట్టపల్లి సురేందర్, పసునూరి రవీందర్‌లాంటి కొన్ని వందల మంది వాగ్గేయకారులు ఉద్యమ సమయంలో ఊరూరు తిరిగి పాటలు పాడి ఉద్యమ భావజాల వ్యాప్తిని చేశారు. ఈ పాటల్లో కొన్ని వేల తెలంగాణ తెలుగు పదాలు దొర్లిపోయాయి. ఎన్నో కొత్త కొత్త ప్రయోగాలు కూడా చేశారు ఆయా కవులు. **పొక్కిలి, మత్తడి, మునుం, బలగం, లొల్లి, గోస, గుంజుకునుడు, ఆగం, ఒర్రెలు, బుగులు, యాది, పొలివాడు, జమీను, దండోరా, బాతకాని** లాంటి కొన్ని వేల పదాలు తెలంగాణ నేల గోసను విప్పి చెప్పడానికి ప్రయత్నించాయి. కెతావత్ సోమ్లాల్ లాంటి కవులు బంజార భాషలో తెలంగాణ ఉద్యమాన్ని తండాలకు చేరేలా చేస్తే, సురా, రూప్‌కుమార్ డబ్బీకార్ లాంటి కవులు హిందీలో పాటలు రాసి ఉద్యమాన్ని హైద్రాబాద్ పాతనగరంలో, తెలంగాణ అంతటా, మిగతా ఉత్తర భారతదేశ ప్రజలు కూడా ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి, విస్తరించడానికి ప్రయత్నించారు.

తెలంగాణ తెలుగు పదాలు వ్యవహారం నుండి జారిపోతున్నాయనే సోయితోని మన కవులు మొదటి నుంచి ఒక సోయితోనే మన భాషలోని మారుమూల పదాలను వెతికి పట్టుకొని ఆయా రచనల్లో వాడుతుండడం గమనార్హం. ఈ పదాలనన్నీ సేకరించి ఒక నిఘంటువును తయారు చేసే బాధ్యత ఇప్పటి తరాల మీద ఉన్నది. ఆ దిశగా అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సాహితీ సంస్థలు పూనుకోవాల్సి ఉన్నది. పాఠ్యపుస్తకాల్లో కూడా తెలంగాణ అసలైన తెలుగును ప్రవేశపెడితే రాబోయే తరాలకు మన తెలంగాణ తెలుగు భాష సునాయాసంగా వస్తుంది. ఆ దిశగా ఇంకా చర్యలు తీసుకోవాల్సి ఉన్నది.

**ఆధార గ్రంథాలు**

నిప్పుల వాగు – సం. అందెశ్రీ
నూటొక్క పాట – సం. జయధీర్ తిరుమలరావు
తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర – తెలుగు అకాడమి

# మన 'హనుమ'



హనుమ యనుచు పిలచు అంజనీ పుత్రుండు
వాయుపుత్రుడనుచు వాసికెక్కె
ఈశ అంశ తోడ శిశువుగా పుట్టేను
వింత చేష్ట చేయు కోతి కాదు

తోక జేజి యనుచు తూలనాడ వలదు
దానితోనె లంక దహన చేసె
మూతి ఉబ్బుయనుచు వింతగా జూడకు
వజ్ర ఆయుధంబు బలమునద్దె

పూజలెన్నొ చేతు అంజనీ పుత్రున్కి
పవను పుత్ర కొలిచి పరవసింతు
హనుమ మెడను వేయ అప్పాల దండను
ఆదుకొనగవయ్య ఆంజనేయ

రామభక్త నీవు రారాజు వయ్యావు
దూకి, కడలి దాటి లంక జేరి
తోక కాల్చబోవ లంకను దహియించి
సీతజాడ తెలప సీత పతికి

చిక్కె వరము బతక చిరకాల జీవిగా,
ఇపుడు ఎచట దాగె ఎరుక గాదె
ఎకడ భజన యున్న అకడ హనుమ యుండి
భక్త కోటికెపుడు బలము నిచ్చు

హనుమ శక్తి ఎంతొ అతనికి తెలియదు
ఎదుటివారు చెప్ప ఎరుకగలడు
లంకజేరు నపుడు లంఘించ సాగరం
ఎరుక పరచినంత ఎగిరి వెళ్ళె

లక్ష్మణుండు యుద్ధ రంగాన మూర్ఛిల్ల
తెలివి తెచ్చు మూలికలను తేవ
అంజి తెచ్చినాడు సంజీవనీ కొండ
కొండ మోయ ఉండె కండ దండి

శరణు రక్ష కొరకు శపథంబు చేపట్టి
రామ ఎదురు నిలిచె రణము జేయ
రామభక్తి ముందు రామ బాణము ఓడె
హనుమ భక్తి శక్తి అదియె కాద

రామ భజన వినగ రంకె వేయుచు నుండు
రామనామ స్మరణ రామ సేవ
రెండు తప్ప వేరు అడుగు వేయక నుండు
రామ మాట వీన్కి రాచబాట

వ్రాసె తులసిదాసు వాక్యాలు నలుబది
వాని పఠన జేసి నిను కొలుతురె
భక్తబృందమంత భజనతో స్తుతియించ
రామనామ మన్న ప్రేమ నీకు

శక్తి, యుక్తులున్న భక్త శిఖామణి
ధర్మజ్ఞానమందు ధనికుడితడు
ఎల్ల కళలయందు ఎదురులేని ఘనుడు
భక్తితడ గడుపు బ్రహ్మచారి

హనుమ జన్మదినము అందరూ జరపంగ
వాడవాడలందు వాని కొలువ
నలుదిశ వినిపించ చాలీస శ్రవణము
భజనలెన్నొ చేసి పూజ జేయ

అభయమిచ్చునట్టి అంజనీ పుత్రుడా
వరములిచ్చునట్టి వానరుండ
బలములిచ్చునట్టి పవను పుత్ర హనుమ
అందుకొనగవయ్య వందనాలు

❖ ❖ ❖ ❖ ❖

**పసుపులేటి నరసింహారావు**
ఫోన్ : 9840 856 206

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 8 (11) హైదరాబాద్ జూన్ : 2024

# భూమయ్య పరిశోధన – విమర్శ

**ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు,** తెలుగు శాఖాధ్యక్షులు, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9441330511



పద్యకవిగా భూమయ్య ప్రసిద్ధుడు. విమర్శకునిగా భూమయ్య కవి భూమయ్యకంటే ప్రసిద్ధుడు కాదు. విమర్శ రంగంలో భూమయ్య ప్రతిపాదనలుగా చెప్పదగినవి కొన్ని ఉన్నాయి. కాని వాటికి రావలసినంత పేరు రాలేదు.

సమీక్ష, విమర్శ, పరిశోధన – ఈ మూడూ ఉత్తరోత్తరం బలీయమైనవి. సమీక్షలు, రివ్యూలు విమర్శస్థాయివి కావు. ఒక పుస్తకంలో ఏముందో చెప్పటమే వీటి ఉద్దేశం. ఆ చెప్పటంలో ఒక విహంగ వీక్షణంలా ఆ పుస్తక గుణాన్ని చెపుతూ అది చదవదగిందనో కాదనో వంటి సూచనలు చేసి వదిలేయటం కనిసిస్తుంది. ఇవి నిజమైన విమర్శలంత విజ్ఞానమయంగా, బరువుగా చదువరులకు అనిపించవు. సమీక్షలు పత్రికలకోసం రాసేవి. కళాత్మక సృజనను అందరికీ అర్థమయ్యేలా చేస్తూ కళాస్వాదనశక్తిని పెంచేవి విమర్శలు. నూతన సత్యాన్ని కనుక్కోవటానికి లేదా నూతన సిద్ధాంత ప్రతిపాదనకు శాస్త్రీయంగా చేసే గాఢమైన అన్వేషణ లేదా పరిశీలను పరిశోధన అంటాం.

పరిశోధనకు పట్టాలనిచ్చే విశ్వవిద్యాలయాల అండ ఉంది. ఈ అండదండలతో నిమిత్తం లేకుండానే పూర్వం ఏ పట్టాలు పొందని విమర్శకులు చేసిన కొన్ని రచనలు సిద్ధాంత వ్యాసాలకంటే ప్రామాణికంగా పరిగణించబడ్డాయి. ఖ్యాతినీ తెచ్చుకున్నాయి. రాళ్లపల్లి, విశ్వనాథ, వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి వాళ్లకు పిహెచ్.డి. డిగ్రీలు లేవు.

పరిశోధనకు, విమర్శకు గల అవినాభావ సంబంధం సాహిత్య సంబంధి పరిశోధనలలో స్పష్టంగా కనిపిస్తుంది. మన పరిశోధనలన్నీ ఎక్కువ విశ్లేషణాత్మకంగా లేదా శాస్త్ర విషయ సమన్వయాత్మకంగానే ఉంటాయి. కాబట్టి విమర్శ ప్రవృత్తి పరిశోధనలో అపరిహార్యమైన అంశం. అనుశీలనం, తత్త్వదర్శనం, సమన్వయం, సిద్ధాంత ప్రతిపాదనం వంటి వివేచనతో చేసే పరిశోధనలో విమర్శ వెన్నెముకగా నిలుస్తుంది.

ఆచార్య అనుమాండ్ల భూమయ్యగారు డిగ్రీల కోసం పరిశోధన చేశారు. వివేచనతో వివేకాన్ని పెంపొందించేందుకు విమర్శ రాశారు. సమీక్షాత్మక రచనలూ చేశారు. ఒక కావ్యపు విలువను తెలిసికొని, వివేచించి, అందులోని గుణగణాలను సత్యాలను, బలాబలాలను నిరూపిస్తూ ప్రక్రియా స్వరూప స్వభావాల్ని ప్రకటిస్తూ భూమయ్యగారు పరిశోధనను, విమర్శను, సమీక్షను సుసంపన్నం చేశారు. ఎం.ఫిల్., పిహెచ్.డి. విమర్శన గ్రంథాలుగానీ, సమీక్షాత్మక రచనలు గాని భూమయ్యను అభిరుచి విమర్శకునిగా నిరూపిస్తాయి. ఏవో మొక్కుబడిగా చేసిన అవసరనైవేద్యాలుగా అనిపించవు. ఏదో ఒక కొత్త ప్రతిపాదనలేకుండా విమర్శ రాయలేదని ఆయన చేసిన రచనలు చూస్తేతెలుస్తుంది.

## కొఱవి గోపరాజు : సాహిత్య విశ్లేషణ

ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 1976లో ఎం.ఫిల్ పట్టాకోసం సమర్పించిన లఘుసిద్ధాంత గ్రంథ రచన. పర్యవేక్షకులు సుప్రసన్నగారు. సాహిత్య వ్యాసరచన చేయటం భూమయ్య గారికదే మొదలు. 1973లో ఎం.ఏ. పూర్తి చేశాక, సింహాసన ద్వాత్రింశికపై పరిశోధనకు ప్రేరణ కలిగించింది పాటిబండ మాధవశర్మగారని భూమయ్యగారు చెప్పుకున్నారు. (కృతజ్ఞతలు, పుట 5). ఇది 1975 నాటి రచనగా చెప్పుకోవచ్చు.

సాధారణంగా ఎం.ఏ పూర్తి కాగానే పరిశోధనకు పూనుకునే విద్యార్థులలో ఉత్సాహమైతే నిండుగా ఉంటుందిగాని అవసరమైనంత పరిణతి ఉండదనేది అందరి అనుభవంలోని విషయమే. నాటి రచన ఇప్పుడు నాకు తృప్తినివ్వటం లేదు' అని 1983లోనే భూమయ్య గారు చెప్పుకున్నారు. ఇది పరిశోధన చేసిన అందరూ అనుకునేదే! డిగ్రీ కోసం ఏదో కష్టపడి చేస్తాం! ఆ తరువాత వయసు, జీవితమిచ్చే అనుభవంతో పాటు పెరిగిన మన అవగాహన కూడా ఆ రచన పట్ల మనకున్న అభిప్రాయాన్ని మారుస్తుంది. బహుశా దాని ఫలితమేనేమో **'ఇందూరు కవిరాజు కొఱవి గోపరాజు'** అని 2017లో మళ్ళీ గోపరాజు గురించి భూమయ్యగారు రాయటం.

1983లో తొలిముద్రణ, 2007లో మలిముద్రణ పొందిన ఈ సిద్ధాంత గ్రంథంలో ఎనిమిది అధ్యాయాలు ఉన్నాయి. 99 పుటల అచ్చు గ్రంథమిది. మొదటి అధ్యాయం అవతారిక. ఇందులో గోపరాజు స్థలకాలాదుల్ని చర్చించి నిరూపించటం కనిపిస్తుంది. గోపరాజు వేముగల్లును వర్ణించిన నైసర్గికస్థితికి 'భీంగల్' నైసర్గికస్థితి సరిపోవటం, గోపరాజు పెద్ద

తాతగారైన పెద్దిరాజు నివాస స్థలమైన పల్లికొండ భీంగల్‌కు సమీపంలో ఉండటం, గోపరాజు అత్యంతాసక్తితో వర్ణించిన ధర్మపురి ఈ ప్రాంతంలోనే ఉండటం వలన గోపరాజు తన నివాస స్థానంగా చెప్పుకున్న వేముగల్లు, నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ తాలూకాలోనున్న నేటి భీంగల్ యేనని నిర్ధారించి చెప్పారు. 'ఇప్పటికి లభించిన ఆధారాన్ని బట్టి కాలం క్రీ.శ. 1410 – 1480 సం॥లుగా తీర్మానించి చెప్పారు.

రెండవ అధ్యాయం తెలుగులో కథాకావ్యం. సింహాసన ద్వాత్రింశికకు ముందు వెనుకలు వచ్చిన అన్ని కథాకావ్యాలను పరామర్శించి, శ్రీనాథయుగంలోనే కథా కావ్యాలు అత్యధికంగా రావటానికి గల కారణాల్ని ఊహించి చెప్పారు. అవి ఆనాటి సామాజిక సాహిత్య స్పృహకు సజీవ శిల్పాలని, వినోద ప్రధానంగా తెలుగు సాహిత్యభిరుచిని పెంపొందించే ఉద్దేశం ప్రధానమై యుంటుందని భూమయ్యగారు చెప్పారు.

మూడవ అధ్యాయం **అనువాద విధానానికి** సంబంధించింది. సంస్కృత విక్రమార్క చరిత్రను అనువదించటంలో

1. అమూలకమైన కథలు జోడించి చెప్పటం 2. మూల ప్రపంచనం 3. మూలాన్ని కుదించటం 4. వదలివేసినవి 5. కల్పించినభావనలు 6. వర్ణనలు 7. అన్యధా కల్పనలు 8. అలంకారాలు 9. యథాతథానువాదం 10. నామకరణాలు అనే పద్ధతులు పాటించాడని సోదాహరణంగా వివరించారు.

మూల గ్రంథంలో లేని వర్ణనలు చేయటం కాకుండా, అవి అలంకారికులు చెప్పిన అష్టాదశ వర్ణనలలతో కూడా లేనివని భూమయ్యగారు సోదాహరణంగా వివరించాడు. మూలంలో 'కశ్చిద్' కో..పి కుత్రాపి వంటి పద ప్రయోగాలుంటే, గోపరాజు వాటికి పేర్లు పెట్టారు.

ఉదాహరణకు :

**కిమపియజ్ఞం (మూలం) అశ్వమేధము (2.150)**

**కశ్చిద్రాక్షసః (మూలం) గుర్బురుడు**

**కుత్రాపి రాజకార్యే పరీక్షాధికారి (3.52)**

సింహాసన ద్వాత్రింశిక మూలగ్రంథం శిశిర ఋతువులోని ఉద్యానవనం వంటిదైతే, ద్వాత్రింశిక వసంతర్తువులోని ఉద్యానవనం వంటిదనవచ్చు (పుట. 12) అని చెప్పటాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

నాల్గవ అధ్యాయం **'కథా నిర్మాణ మార్మికత'** ఈ కావ్య నిర్మాణంలో మొత్తం మీద కథా కథనానికే ప్రాధాన్యముంది. కొన్ని కథల్లో సంవాదాలు, వర్ణనలు ప్రాధాన్యం వహించకపోలేదు. ఈ లక్షణాలు కొన్ని తరువాతి కాలంలో వచ్చే కథాకావ్యాలకు మార్గదర్శకాలుగా వెలిశాయి (పుట. 42).

అయిదవ అధ్యాయం **'అంగాంగి రసవివేకం'** అంగిరసం వీరంగా పేర్కొంటూనే వీరరసభేదాన్ని భరతుని నుండి వివిధ లాక్షణికులు పేర్కొన్న భేదాల్ని చెప్పి చివరగా అచ్యుతరాయలు సాహిత్యసారంలో చెప్పిన 21 వీర భేదాల్ని పేర్కొని, వాటిని సమన్వయించి చూపటం ప్రధానాంశం. 'వీరరసము యొక్క అన్ని భేదాల్ని చూపిన కావ్యాలు అరుదు. వీరరసము యొక్క విరాట్స్వరూపాన్ని ఈ కావ్యంలో గోపరాజు చిత్రించాడని, ఈ భేదాల్ని కథానాయకుడైన విక్రమాదిత్యుని ఆశ్రయించి ఉన్నాయని నిరూపించాడు భూమయ్య.

ఏడవ అధ్యాయంలో **కవితా విశ్లేషణ.** గోపరాజు కవిత్వాన్ని గురించి అంటే ముఖ్యంగా కావ్య భాష, రసభావాలు, సంప్రదాయం – వీటిని గురించి తన అభిప్రాయాలను గోపరాజు అవతారికలో ఏమి చెప్పాడో వివరించాడు. గోపరాజును ఉభయకవి వర్గానికి చెందుతాడని పేర్కొంటాడు భూమయ్య.

**కవితావిశ్లేషణ – 2** అనే విభాగంలో గోపరాజు రాసిన అచ్చ తెనుగు పద్యాలతోపాటు, లోకోక్తుల్ని, నీతి పద్యాల్ని (దాదాపు 110) రాశిపోసి చూపించాడు.

ఎనిమిదవ అధ్యాయం **హరిహరనాథుడు.** తిక్కన నుండి ఏయే కవులు హరిహరనాథునిని ఏమని కీర్తించారో వివరంగా చెపుతూనే తిక్కన తరువాత కవుల హరిహరనాథోపాసన తిక్కనకున్నంత ఉదాత్తస్థితిలో లేరని (పుట. 93) చెపుతారు. కేవల రూప వర్ణన తప్ప తాత్త్విక దశను చేరుకోలేదని చెపుతారు.

ఈ పరిశోధన విశిష్టత ఏమంటే –

1. భోజరాజీయ కావ్యంలోని కథలు భోజరాజుకు చెందినవి కావని చెప్పటం 2. కథాకావ్య ప్రణాళిక గొప్పదనాన్ని చెప్పటం 3. గోపరాజు కల్పనలోని మార్మికతను విశ్లేషించటం 4. అంగిరసంగా చెప్పిన వీరాన్ని, అందులోని 21 భేదాల్ని విక్రమార్కుని పరంగా సమన్వయించటం. 5. ద్వాత్రింశికలో 110 నీతి పద్యరత్నాలను వెలికితీసి నీతి పద్య కోశాన్ని శాస్త్రంగా చూపటం. 6. హరిహరనాథ తత్త్వ నిరూపణలో తిక్కనను ఎవరూ అధిగమించలేరని నిరూపించటం.

## నాయని సుబ్బారావు కృతులు – పరిశీలన :

సుప్రసన్నగారి పర్యవేక్షణలో 1980లో పిహెచ్.డి. పట్టాకోసం కాకతీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంతవ్యాసం ఇది.

కాల్పనికోద్యమపు కవులలో ఏ పరిచయమూ అవసరంలేని, ఏ బిరుదాలూ పొందని విలక్షణ నాయని సుబ్బారావు గారు. కవిగా ఆయన చేసిన తొలి రచనలు సౌభద్రుని ప్రణయయాత్ర, మాతృగీతాలు, వేదనావాసుదేవము, భాగ్యనగర కోకిల, విషాదమోహనము, జన్మభూమి జీవితపు మలిసంధ్యలోని రచనలు. తొలి రచనల సౌకుమార్యం, మలి రచనల ప్రౌఢిమ గమనిస్తే వారి రచనలలోని పరిణతి స్పష్టంగా తెలుస్తుంది.

భావకవిత్వం పాశ్చాత్య దేశాలలో ముందుగా రూపుకట్టి ఒక్కో దేశంలో ఒక్కో లక్షణంతో కొనసాగింది. కాని తెలుగులో అనుకరణలో భాగంగా మొదలయింది. స్వాతంత్రోద్యమకాలమది. ఆ ఉద్యమ కేంద్రకంగా పరిఢవిల్లవలసిన కవిత్వం దానికి భిన్నంగా ఆత్మాశ్రయంగా, వ్యక్తినిష్ఠంగా రావటమే ఆశ్చర్యకరమైన విషయం. కాల్పనికోద్యమ కవులలో అందరికీ పత్యక్షంగానో పరోక్షంగానో స్వాతంత్ర్య సమరంతో సంబంధాలున్నాయి. నాయనిగారు కూడా అలాంటివారే. అచ్చమైన దేశీయతా కవి. భావకవిత్వంలో కులపాలికా ప్రణయాన్ని ప్రవేశపెట్టినవారు విశ్వనాథ అని ప్రచారంలో ఉంది. కాని గిరికుమారుని ప్రేమగీతాలకంటే ముందే సౌభద్రుని ప్రణయయాత్ర వెలువడింది. 1920లో ప్రారంభించబడిన గిరికుమారుని ప్రేమగీతాలు 1928లో ముగిస్తే, 1922లో ఆరంభమైన ప్రణయగీతాలు 1928లో ముగించబడ్డాయి. ఫలశృతి 1926లో రచించారు. మొట్టమొదట సౌభద్రుని ప్రణయయాత్ర 1935లో ప్రచురితమైంది. గిరికుమారుని ప్రేమగీతాలు ఆ పిదపనే వెలువడ్డాయి. దీనిని బట్టి కులపాలికా ప్రణయాన్ని చిత్రించిన కావ్యశాఖకు నాయనివారే ప్రథములని భూమయ్యగారు నిరూపించారు. నాయని రచనలను చూస్తే అచ్చమైన దేశీయతా ముద్ర కనిపిస్తుంది.

ఈ పరిశోధన గ్రంథంలో మొదటి అధ్యాయం నాయని సుబ్బారావుగారి జీవన రేఖల్ని స్పష్టంగా సంపూర్ణంగా వివరించేది. పొదిలెలో జన్మించి పి.వి. ఆర్ హిందూ సెకండరీ స్కూల్‌లో థర్డ్‌ఫారం వరకు చదువుకోవటం, ఏ.బి.ఎం. హైస్కూల్‌లో నాలుగు నుండి ఆరవ ఫారం వరకు చదువుకోవటం, బందర్‌లోని నోబుల్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేయటం, అక్కడే బి.ఏ. చదువుతూ విశ్వనాథ, రాయప్రోలు, కాటూరి, పింగళి, నండూరి, అడివి బాపిరాజు, కృష్ణశాస్త్రి వంటి కవుల పరిచయం, సహాయ నిరాకణోద్యమంలో పాల్గొనడం, సౌభద్రుని ప్రణయయాత్ర వత్సలవలపు, మాతృగీతాలు, చేసిన ఉద్యోగాలు, వేదనా వాసుదేవం విషాదమోహనము, జన్మభూమి రచనలు చేయటం, రేడియోలో ఉద్యోగం, చివరికి వైకుంఠ ప్రాప్తి జరిగేవరకు సమస్త విషయాలను వదలకుండా ఈ గ్రంథంలో వివరించారు.

రెండవ అధ్యాయం **ప్రణయవాహిని.** ప్రణయభావభూమిక, అమలినశృంగారం, స్వేచ్ఛాప్రణయం, కులపాలికా ప్రణయం వంటి భావనల్ని విపులంగా చర్చిస్తూ సౌభద్రుని ప్రణయయాత్ర విశిష్టతను, అందులోని దివ్య ప్రణయాన్ని సమన్వయించి చెప్పారు.

మూడవ అధ్యాయం **'విషాదతరంగిణి'.** ఇది నాయనివారి విషాదకావ్యాల విశ్లేషణకు సంబంధించింది. తొలుత మృత్యువిచారం చేసి, తెలుగు స్మృతి కావ్యాల వికాసాన్ని వివరించి మాతృగీతాలను గురించి ఇతర కవుల విషాద కావ్యాలతో పోల్చి పరిశీలించారు. ఆర్తి – కరుణం – శాంతి వీటి క్రమవికాసం విషాదమోహనంలోలాగా



మాతృగీతాలలో స్పష్టంగా వర్ణించబడలేదని (పుట– 65) భూమయ్య ఈ రెండు కావ్యాల మధ్యగల భేదాన్ని వివరించారు. విషాదమోహనం లో దుఃఖతీవ్రత, స్మృతి దుఃఖం, ఆత్మకైవల్య ప్రాప్త్యాకాంక్ష ఎలా వర్ణించబడ్డాయో వివరించారు. రాయప్రోలు వారి 'నందా' కావ్యంతో విషాద మోహనాన్ని పోల్చి సామ్యవైషమ్యాలను చర్చించారు.

నాల్గవ అధ్యాయం **'వేదనావాసుదేవము'** – ఉద్యోగాన్ని విరమించాక నాయనివారు రాసిన కావ్యమిది. ప్రణయయాత్ర, ఫలశ్రుతి, సౌందర్యలహరి – గ్రంథాల తరువాత దాదాపు 35 సంవత్సరాలకు చేసిన రచన. జీవితానుభవం ఫలితంగా కలిగిన ఆవేదన వాసుదేవాత్మకమైన పరదేవతాన్వేషణగా రూపుకట్టిన కావ్యమిది. మకుటనియమంలేని శతకమిది. 108 పద్యాలున్న ఈ శతకం తొమ్మిదేసి పద్యాలకొకటి చొప్పున 12 సమ విభాగాలుగా చేయబడింది. ఈ పన్నెండు సంఖ్య **'ఓం నమో భగవతే వాసుదేవాయ'** అనే వాసుదేవద్వాదశాక్షరి మంత్రంలోని అక్షర సంఖ్యకు, ఒక్కొక్క విభాగంలోని తొమ్మిది పద్యాలు నవ విధభక్తిమార్గాలకు సంకేతమని భూమయ్య భావించి వైష్ణవ సంప్రదాయవేదాంతంతో సమన్వయించి, శతక సాహిత్యంలో వేదనా వాసుదేవాన్ని 'కౌస్తుభమణి' వంటిదని పేర్కొన్నారు.

అయిదవ అధ్యాయం **'జన్మభూమి'.** ఈ అధ్యాయంలో జన్మభూమి కావ్య స్వరూపాన్ని వివరించి అది ఏ ప్రక్రియకు చెందుతుందో చేసిన చర్చ విలువైంది. ఆ కావ్య ప్రక్రియను గురించి పూర్వ విమర్శకులు చెప్పిన లక్షణాలు తగవని దీనిని క్షేత్రమాహాత్మ్య గ్రంథంగా తీర్మానించారు. కథాకథన పద్ధతిని, అవతార కథల్ని – భక్తుల కథల్ని – లౌకిక కథల్ని – కథన ఘటకం (జానపద కథా నిర్మాణరీతి) – ప్రకృతి వర్ణనలు గురించి ప్రత్యేకంగా చేసిన విశ్లేషణలు, వివరణలు ఉన్నాయి. ఈ జన్మభూమిలోని ఈ కథలను జానపద పరిశోధన దృష్టితో భూమయ్యగారు పరిశీలించడానికి బహుశా నాయని కృష్ణకుమారిగారి జానపద పరిశోధన ప్రభావమై ఉండవచ్చు. ఇందులో స్వాతంత్ర్యోద్యమ చిత్రణతో పాటు నేతాజీ, పటేల్ వంటి

నాయకులకు స్మృత్యంజలి ఘటించటం నాయనివారి జాతీయాభిమానంగా భూమయ్యగారు పేర్కొన్నారు.

ఆరవ అధ్యాయం **నాయనివారి పరిశిష్ట రచనల్ని** గురించి చర్చించేది. ఇందులో సౌందర్యలహరి, ముక్తకములు, భాగ్య నగర కోకిల, కార్టూన్ కవిత్వం, వేదనా వాసుదేవం – 2 ఆయా రచనల కాలక్రమాన్ని అనుసరించి, విశ్లేషించి చూపారు. నాయనివారు కార్టూన్ కవిత్వం కూడా రాశారని చాలా మందికి తెలియదు. ఒక ఆర్థిక మంత్రి **"ఇప్పుడు కూడా ఎన్.జీ.వోలను కష్టపడి పనిచేయ మనండి. వారిని పొగడటానికి సిద్ధంగానే ఉన్నాం"** అని చేసిన ప్రకటనకు –

**.... నీకు ఆకలి అయితే అయిందిలే**
**నీ ఆలికి కోక లేకపోతే పోయిందిలే**
**చిరుతిండ్ల క్యాంటీన్ల జోలికి పోకుండా**
**చెట్లక్రింద సిగరెట్ల దమ్ములు లేకుండా**
**కష్టపడి పని చేసుకో**
**అన్నింటికీ ఆయనే అనుకో** ( నాం.గ. జీవస్తోత్రం)

అని రాసిన వివిధ కార్టూన్ కవితలతోపాటు, రేడియో నాటికల్ని, వివిధ వచన రచనల్ని పరిచయాత్మకంగా వివరించారు.

ఏడవ అధ్యాయం **'కవితానుశీలన'**. ఇది నాయనివారి కవితా విభూతిని గురించి అనుభూతి నికషం మీద వివేచించింది. నాయని కవిత్వంలోని శబ్ద చిత్రాలను, భావచిత్రాలను, రూప చిత్రాలను పట్టి చూపించిన ఈ అధ్యాయం భూమయ్యగారి కవితా హృదయాన్ని కూడా ఆవిష్కరింపచేస్తుంది.

అనుబంధంలో నాయని సుబ్బారావుగారిని, వారి శ్రీమతి హనుమయమ్మగారిని, దుహిత నాయని కృష్ణకుమారి గారిని, నాయని సుబ్బారావుగారి విద్యార్థి అక్కిరాజు రమాపతిరావు గారిని, కుందుర్తి ఆంజనేయులు గారిని, నాయని సత్యనారాయణరావు గారిని, జువ్వాడి గౌతమరావు గారిని, చేకూరి రామారావు గారిని, సుప్రసన్నగారిని చేసిన ఇంటర్వ్యూలను, సుబ్బారావుగారికి సి.నా.రె, శేషేంద్ర వంటి ప్రముఖులు రాసిన లేఖలను జతచేయటం పరిశోధనకు మరింత విలువ సమకూరింది. కులపాలిక ప్రణయానికి నాయనివారే ఆద్యులని చెప్పటం.

ఈ పరిశోధన విశిష్టత యేమంటే –

1. నాయని కావ్యాలలో కనిపించే విషయాలకు ఆధ్యాత్మిక మూలాల నుండి వివరణనీయటం. 2. సుబ్బారావుగారి జీవితంలో తారసపడ్డ ఏయే అనుభవాలు, రచనలో కళారూపాన్ని పొందాయో వివరించటం. 3. జన్మభూమి వంటి కావ్యాల ప్రక్రియను నిర్ణయించి చెప్పటం. 4. రసాస్వాదానుకూలంగా పరిశోధన సాగటం.

❖ ❖ ❖ ❖ ❖ **(సశేషం)**

---

శ్రీరామ నామమ్ము శ్రేయమ్ములొనగూర్చు
పలికిన వారికి పలికినంత!
శ్రీరామ గానమ్ము శ్రేయమ్ము నందించు
పాడిన వారికి పాడినంత!
శ్రీరామ కథనమ్ము శ్రేయమ్ములొసగును
చెప్పిన వారికి చెప్పినంత!
శ్రీరామ రచనమ్ము శ్రేయమ్ము కురిపించు
వ్రాసిన వారికి వ్రాసినంత!
రామ! సాకేత పురరామ! రామ రామ!
రామ! రఘుకుల సోమ! శ్రీరామ రామ!
రామ! శ్రీరామ! జయరామ! రామరామ!
యనుచు భజియింప తరియింతు రవని జనులు!!

వాల్మీకి వలె రాదు వర్ణనాత్మక శైలి
విరచించి యందించ వేల్పుగాథ!
విశ్వనాథను గాను వేవేల భావాల
రచియించి పలికించ రామ గాథ!
మొల్లమ్మనా! కాదు ముదమార వివరించ
రమ్య శిల్పమ్మగు రమణి గాథ!
బుద్ధ భూపపతి వోలె పూర్ణశక్తియె లేదు
రమణీయముగ బల్క రామగాథ!

భాస్కరాది కవుల భాసుర దీప్తియు
లేదు నాకు తండ్రి! లేదు రామ!
నీదు పదము మ్రొక్కి నిత్యత్వమొందగా
వ్రాయబూనినాదు 'రామ' కథను

ఏల వ్రాసెదవని యెవరైన ప్రశ్నించ
నీవె కలమునందు నిఖిల మనెద!
ఎందు కిప్పుడనుచు నెవరైన ప్రశ్నించ
నిపుడు గాకింకెప్పుడిది యనియెద!
ఎవరికోసమనుచు నెవరైన ప్రశ్నించ
పుడమి నీ పాదాన పుష్పమనెద!
ఏమి ఫలితమని యెవరైన ప్రశ్నించ
చలువయౌ నీ చూపు చాలుననెద!
ముదము తోడ దలచి ముక్తి కాంక్షను సేసి
యుక్తితోడ నిన్ను భక్తి గొలిచి
శక్తి దాల్చి హృదిని, సాహసమును జేసి,
కదలినాను రామ! కలము నడుపు!!

**(అవుసుల భానుప్రకాశ్ .. శ్రీరామాయణ భానువు, పద్య కావ్యం నుండి)**

❖ ❖ ❖ ❖ ❖

# అస్విత్వనదం ఆవలి తీరాన – మునిపల్లె రాజు మాజికల్ రియలిజం

గొల్లపల్లి వనజ, ఫోన్ : 95501 43497

**వ్యాస సంగ్రహం**

తెలుగు కథాసాహిత్యంలో తనదైన ప్రత్యేకతను చాటిన కథాసాహితీవేత్త మునిపల్లెరాజు. ఈయన మాజిక్ రియలిజం కథన పద్ధతిలో రచించిన కథాసంపుటి **'అస్తిత్వనదం ఆవలితీరాన'.** మాజిక్ రియలిజం కథనంలో సాగిన ఈ కథాసంపుటి కథలలోని కథావస్తువును పరిచయం చేసి, కథలలోని మాజికల్ రియలిజాన్ని పరిశీలించడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం. ఉపోద్ఘాతం, రచయిత పరిచయం, మాజికల్ రియలిజం, అస్తిత్వనదం ఆవలి తీరాన–కథావస్తువు, అస్తిత్వనదం ఆవలి తీరాన–మాజికల్ రియలిజం, ముగింపు, ఉపయుక్త గ్రంథసూచి క్రమానుగతంగా ఈ వ్యాసం సాగింది.


Keywords : మాజికల్ రియలిజం, కథలు, కథా వస్తువు, కథనం, అస్తిత్వనదం ఆవలి తీరాన.

**ఉపోద్ఘాతం :**

తెలుగు ఆధునిక సాహిత్యంలో పాఠకుడికి, సమాజానికి అత్యంత చేరువైనది కథాసాహిత్యం. సాహిత్యంలో కథా సాహిత్యం ఒక ఎత్తైతే ఆ కథాసాహిత్యం వివిధ కథనాలతో సాగడం మరో ఎత్తు. కథ అనే మాట చెప్పడానికి సుదీర్ఘ సుపరిచితమైన రెండక్షరాల సులభమైన పదమే అయినా ఆ కథా రచనా నిర్మాణంలో వైవిధ్యాన్ని సంతరించుకుంది. కథా రచయిత తన ఆలోచనలను, సందేశాన్ని, భావాలను పాఠకుడికి, సమాజానికి అందించే క్రమంలో ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిలో తమదైన ముద్రను వేశారు. కథలో వస్తువు, పాత్రలు, సంఘటనలు, సంఘర్షణలు ఎంత ముఖ్యమైనవో కథాకథనం అంతకంటే ముఖ్యమైనది. ఒక కథలో కథాకథన సమన్వయం పాటించలేదు అంటే అది కథగా రూపుదిద్దుకోదు. వాస్తవికత అవుతుంది. కథా సాహిత్యంలో కథలు చాలావరకు ఊహా కల్పన కథనంలోనే నడుస్తాయి. రావిశాస్త్రి వంటి వారు అంతరార్థ కథనం, శ్రీశ్రీ వంటి వారు చైతన్య ప్రవంతి కథనంలో కథలను నడిపిస్తే, మునిపల్లె రాజు వారికి భిన్నంగా, అత్యంత ప్రత్యేకమైన, అరుదైన కథనమైన మాజికల్ రియలిజం కథనంలో కథలను రచించి తెలుగు కథా సాహిత్యంలో చెరగని ముద్రను వేశారు.

**రచయిత పరిచయం**

తెలుగు కథాసాహిత్యంలో తనదైన ప్రత్యేక ముద్రను వేసిన గొప్ప కథకుడు మునిపల్లెరాజు. ఈయన 1925 మార్చి16న గుంటూరు జిల్లా బాపట్ల తాలూకలోని గరికపాడులో మునిపల్లె శారదాంబా,






మునిపల్లె హనుమంతరావు దంపతులకు జన్మించారు. 2018 ఫిబ్రవరి 24న స్వర్గస్థులయ్యారు. మునిపల్లెరాజు అసలు పేరు మునిపల్లె బక్కరాజు. ఈయన **'అస్తిత్వనదం ఆవలి తీరాన', 'దివోస్వప్నాలతో ముఖాముఖి', 'పుష్పాలు–ప్రేమికులు–పశువులు', 'మునిపల్లెరాజు కథలు'** వంటి కథాసంపుటాలు; **'జర్నలిజంలో సృజన రాగాలు', 'సాహితీ మంత్ర నగరిలో సుస్వరాలు'** అనే వ్యాస సంకలనాలు; **'అలసిపోయినవాడి అరణ్యకాలు', 'వేరొక ఆకాశం వేరెన్నో నక్షత్రాలు'** వంటి కవితా సంపుటాలను రచించాడు. తెలుగు కథాసాహిత్యంలో మాజిక్ రియలిజం అంటే మునిపల్లెరాజు అనే విధంగా ప్రత్యేక కథనరీతితో కథా సాహిత్యంలో గౌరవాన్ని దక్కించుకున్నారు. మునిపల్లెరాజు మాజిక్ రియలిజం కథనంలో రచించిన **'అస్తిత్వనదం ఆవలితీరాన'** అనే కథాసంపుటానికి 2006వ సంవత్సరంలో కేంద్రసాహిత్య అకాడెమీ బహుమతి దక్కింది. ఇదే కథా సంపుటం 2004లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం పొందింది. ఇంకా గోపీచంద్ పురస్కారం, రావిశాస్త్రి స్మారక సాహిత్య పురస్కారం, పులుపుల వెంకటశివయ్య సాహితీ పురస్కారం, పులికంటి సాహితీ సాహితీ సత్కృతి పురస్కారం వంటి అరుదైన గౌరవాలను పొందిన గొప్ప కథకుడు మునిపల్లెరాజు.

**మాజికల్ రియలిజం**

తెలుగు కథాసాహిత్యంలో మ్యాజికల్ రియలిజం కథనం ఒక ప్రత్యేక స్థానాన్ని పొందినది. కథాకథనంలో మాజికల్ రియలిజం ఒక కథన పద్ధతి. కథలో కథావస్తువు వాస్తవికంగా ఉండి, కథనం కల్పితం లేదా అవాస్తవికంగా, అద్భుత రస ప్రధానంగా ఉండటాన్ని మాజికల్ రియలిజం అంటారు. **"మాజిక్ రియలిజంలో కాలం యొక్క ఆద్యంతాలు వర్తులాకారంలో కలసిపోతాయి. గతంలో జరిగిన**

**సంఘటనల్ని చూపించడానికి 'ఫ్లాష్ బాక్' చేయటం కూడా ఉండదు. గతం, వర్తమానం కథనంలో ఒకటిగా కలసిపోతాయి. సమకాలీన కథనం సహజంగా కాక ఉత్ప్రేక్ష ప్రధానంగా, అద్భుతరస ప్రధానంగా సాగుతుంది"** (కథాశిల్పం, పుట:73) అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య మాజిక్ రియలిజం గురించి చెప్పారు.

**అస్తిత్వనదం ఆవలితీరాన కథావస్తువు**

**'నిష్క్రమణ ద్వారం'** కథలో పట్టాభి ప్రధాన పాత్ర. పట్టాభి చిన్నప్పుడే తల్లిదండ్రులను పోగొట్టుకుని అనేక కష్టాలను ఎదుర్కొంటాడు. పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, భర్త అమానుష కార్యానికి నిత్యం బలవుతూ కూడా తనను ఆదరించే చిట్టెమ్మ, గుడిలో అంజన్న తాత ఆ గ్రామంలో పట్టాభికి ఆప్తులు. వారు కూడా దూరం అవడంతో అనుకోకుండా బైరాగులతో కలసిపోతాడు. బైరాగులతో హిమాలయాల దర్శనం, మానస సరోవర యాత్ర చేస్తాడు. మానస సరోవర యాత్రలో స్వామి ప్రణవానంద ఉంటాడు. ఎన్నో భాషలను నేర్చుకుంటాడు. అక్కడ కూడా తాంత్రికుల చేతిలో త్రిశూల ఘాతాలు తింటాడు. కానీ తనకు సన్యాసాశ్రమం ఇప్పించమని పెద్ద స్వాములను ఎంత బతిమాలిన అంగీకరించరు. దాని తర్వాత అక్కడినుండి భారత సైన్యంలో చేరుతాడు. భారతదేశానికి సేవ చేసినందుకు పట్టాభి ఎన్నో ప్రమోషన్లు, అవార్డులు అందుకుంటాడు. పాకిస్తాన్ నుంచి అనాథగా వచ్చిన దమయంతి అనే ఉపాధ్యాయినిని పెళ్లి చేసుకుంటాడు. ఒక అనాథ బాలుడిని దత్తత తీసుకుంటాడు. ఎంతోమంది అనాథలకు సేవలందిస్తాడు. పట్టాభి మరణానికి దగ్గరలో ఉన్నప్పుడు కూడా **"శాంతి ధామానికి పారిపోవటమా? భారతదేశమనే ఈ అగ్ని గుండాన్ని సంస్కరించే పూనిక చేయటమా?"** అని దేశ అభివృద్ధి గురించే ఆలోచిస్తాడు.

**'సప్తతి మహోత్సవం'** కథలో సీతారాం పాత్ర అభ్యుదయ కోణంలో నడుస్తుంది. ఎన్నో సంఘ సంస్కరణలు, సేవా కార్యక్రమాలు చేసిన సీతారాం బాగా కలిగిన కుటుంబంలో పుట్టిన అభ్యుదయ దృక్పథం గలవాడు. జన తిరస్కృతులుగా పరిచ్యుతులుగా బ్రతుకు వెళ్ళదీస్తున్న యానాదులను సంస్కరించడానికి కంకణం కట్టుకుంటాడు. వారికి ఆత్మగౌరవం నేర్పిస్తాడు. గాంధీవాదిగా గ్రామీణ పరిశ్రమల్లో తేనె పట్టులు పెంచడం, బుట్టలు, తట్టలు అల్లి అమ్మించడం, కూరనారలు పండించడం వైపు వారి దృష్టిని మళ్ళిస్తాడు. యానాది బాల బాలికల ఆశ్రమ పాఠశాల నెలకొల్పి కొత్త దీపాలు వెలిగిస్తాడు. చివరికి ఒక దుష్టుడు మానభంగం చేసిన చంద్రికను పెళ్లి చేసుకుంటాడు. సీతారాం చంద్రికలు యానాదులలో కళ్యాణి అనే ఒక కుష్టు అమ్మాయిని పెంచుకుంటారు. బంగారు పళ్లెంలో పాయసం తినాలనే చంద్రిక చివరి కోరికను తీరుస్తాడు. ఇవన్నీ చూసిన ఈ కథలో కథకుడు అయిన గౌరీపతి ఆ ఊరిలో తరతరాలుగా వస్తున్న గుడిమాన్యం, భవనం, దానిని అనుసరించి ఉన్న భూములు యానాది సేవా సమితికి అంకితం చేస్తాడు.

**'నా ఇంటర్వ్యూ పోయింది'** కథలో కథకుడు జిల్లా పోలీసు సూపరింటెంట్ పదవికి పరీక్షలో నెగ్గి ఇంటర్వ్యూ కోసం ఢిల్లీ వెళ్తాడు. గ్రామీణ రాజకీయాలను ప్రక్కదోవ పట్టించడానికి తను ఇంటర్వ్యూలో పాస్ అయినా కూడా **"నా ఇంటర్వ్యూ పోయింది"** అని ఢిల్లీ నుండి ఇంటికి తంతి ఇస్తాడు. ఇంటర్వ్యూలో కథకుడిని **"నువ్వు పోలీసు సర్వీసులోనే ఎందుకు చేరదలిచావు? ఐఏఎస్ కు ఎందుకు ప్రిఫరెన్సు ఇవ్వలేదు?"** అనే ప్రశ్న వేయగా **"ఒక విల్లు, మూడు బాణాలు, ముగ్గురు మనుషులు ఒకచోట కనిపించినాయ్. మరుక్షణంలో ఒక బాణము, ఒక మనిషి మాయమైనాయ్. దీని భావమేమి తిరుమలేశా?"** (అస్తిత్వనదం ఆవలితీరాన, పుట:54) అనే ఒక పొడుపు కథను వేస్తాడు. దానికి ఆఫీసర్లు ఎవరు సమాధానం చెప్పక పోగా తన గ్రామంలో జరిగిన రాజకీయాలను, దుర్మార్గాలను గతంలో జరిగిన విషయాలన్నీ చెప్తాడు. చివరికి ధర్మ రక్షణ కోసం ఈ ఉద్యోగం తనకు కావాలనే అంతరార్థాన్ని ఆఫీసర్లకు తెలియజేస్తాడు.

**"నిశబ్దం ఒక పదం కాదు"** కథలో రావుగారు ప్రధానపాత్ర. సంసారిక జీవితంలో భార్య, కొడుకులు, కూతుర్లు, కోడళ్ళు, మనవళ్ళతో అలసిపోయిన రావుగారు ఆశ్రమ నివాసిగా ఉంటూ, తోటి వృద్ధులకు చేతనైనంత సేవ చేస్తూ ఒక మహాఋషిగా జీవించి బ్రహ్మైక్యం చెందడం ఈ కథలోని వస్తువు.

**'నైమిశారణ్యంలో సత్రయాగం'** కథలో చక్రి, కమల అనే అమ్మాయి ప్రేమించుకుంటారు. కమల కొన్నాళ్లకు చక్రిని వదిలించుకుని డబ్బున్న, కార్లలో తిప్పగల కామేశాన్ని వివాహం చేసుకుంటుంది. దీన్ని భరించలేని చక్రి సన్యాసంలో చేరిపోతాడు. కొన్నాళ్లకు నైమిశారణ్యంలో అమావాస్య నాడు నైమిష పీఠాధీశ్వర్ శ్రీమద్ జగదాచార్య ఆధ్వర్యంలో సన్యాస దీక్ష తీసుకుని ఆనంద గోస్వామిగా నామకరణం పొందుతాడు. అలా కొన్ని సంవత్సరాలుగా అవధూతగా జీవితాన్ని గడుపుతున్న గోస్వామి దగ్గరకు మిల్కీ అనే కుక్క **"కమల అంత్య దశలో ఉన్నది. తమ దర్శనం కోసం తుది శ్వాస నిలుపుకుంటున్నది"** అని రాసి ఉన్న ఉత్తరాన్ని గోస్వామికి అందిస్తుంది. నారద ఆశ్రమం దాటి మలుపులు తిరిగి ఒక కుటీరం ముందు మిల్కీ నిలిచిపోతుంది. ఆ కుటీరంలో కమల **"నేను... కమలను... స్వామి...."** అంటుంది. **"కమలా? ఆ చక్రి లేడు గదా ఇక్కడ"** అని గోస్వామి అంటాడు. కొద్దిసేపు తర్వాత ఆమె శ్వాస ఆగిపోతుంది.

**'అస్తిత్వ నదం ఆవలి తీరాన'** కథలో బైరాగి ప్రధాన పాత్రధారుడు. బైరాగి ఆధ్యాత్మిక చైతన్యానికి ఎంతో దూరంగా ఉన్నా అతనికి ఆధ్యాత్మిక మధుర గీతాలు వినబడుతూనే ఉంటాయి. ఏ గమ్యం

తెలియని బైరాగి బైరాగుల మఠంలో నివసిస్తూ ఉంటాడు. ఒకనాడు చిదానంద స్వామి మహా నిర్యాణమనే మహాదృశ్యాన్ని చూస్తాడు. అక్కడ భక్తుల ఆరాధన, ఆర్భాటం చూసి ఆశ్చర్యపోయి తీవ్ర జ్వరానికి గురవుతాడు. జ్వరంతో సొమ్మసిల్లి బాధపడుతున్న బైరాగిని మార్వాడి వర్తకులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్తారు. డాక్టర్ సచ్చిదానందం బైరాగిని చూసి ఆశ్చర్యంతో 'రఘు' గా గుర్తుపడతాడు. **"రఘు చూడు లావణ్య మన ఆసుపత్రిలోనే ఉంది"** అని స్ట్రెచ్చర్ని లావణ్య దగ్గరికి తీసుకెళ్లి స్ట్రెచ్చర్ మీద ఉన్న గుడ్డని తీసి చూడగా ఎవరు ఉండరు. **"ఈ కథ ఇలా సందిగ్ధంగా ముగిసిపోవడాన్ని అది మూడో ప్రపంచపు ఆత్మ భావనని వ్యక్తీకరిస్తుంది అని రష్దీ అంటాడు"** అని విహారి **'కథా ఋషులు ఒకరిద్దరిలో ఒకరైన మునిపల్లె రాజు మ్యాజికల్ రియలిజం'** అనే వ్యాసంలో చెప్పారు (సుజనరంజిని అంతర్జాల సాహితీ పొదరిల్లు).

**అస్తిత్వనదం ఆవలి తీరాన – మాజికల్ రియలిజం**

ఈ కథా సంపుటిలో **'నైమిశారణ్యంలో సత్రయాగం, నిష్క్రమణ ద్వారం, సప్తతి మహోత్సవం, అస్తిత్వనదం ఆవలితీరాన, మహాబోధి ఛాయలో'** అనే కథలు మాజికల్ రియలిజం కథనంలో నడుస్తాయి.

**"గోమతి కిరుపక్కలా ప్రాచీన పుణ్యస్థలాలు. దేవతలందరూ కలసి స్థాపన చేసిన దేవదేవేశ్వర్, లంకావిజయం నుండి తిరిగివస్తూ మర్యాదా పురుషుడు శ్రీరాముడు స్థాపించిన సేతు బంధేశ్వర్‌ల గంభీర నీరవ తేజశ్శాంతిలో ఐక్యం కావటం అలవడింది"** (నైమిశారణ్యంలో సత్రయాగం, పుట : 29) ఇందులో రచయిత ప్రస్తుత కథాంశాన్ని ఎక్కడా విడిచి పెట్టకుండా పురాణ అంశాలను, స్థలాలను, కాలాన్ని చెప్తూ అద్భుత రసంతో సాగిపోతుంది.

**"అవధూత గోస్వామి పన్నెండేళ్ల తర్వాత మళ్ళీ చింతాక్రాంతుడై, పాండేగారితో హిమాలయ దర్శనానికి ప్రయాణ సన్నద్ధుడవుతున్నాడు. బదరికావనం నుండి....**(నైమిశారణ్యంలో సత్రయాగం, పుట: 31).

**"నడుస్తున్న మంచం ఒక ద్వారం సమీపాన స్తంభించిపోయింది. ఆ ద్వారం తలుపులు ఓరగా తెరిచి ఉన్న భావన. ద్వారబంధం మీద ఎర్రని అక్షరాలు "బయటకు పోవు దారి" హఠాత్తుగా ప్రత్యక్షం. "పాకిస్తాన్ నుంచి అనాథ బాలిక వచ్చి కురుక్షేత్రంలో ఎదిగిన దమయంతి అనే ఉపాధ్యాయిని పెండ్లాడాడు......"**,(నిష్క్రమణ ద్వారం, పుట : 33). ఇలా అద్భుత రసంతో అసలు కథను విడిచిపెట్టకుండా పాఠకుడ్ని వేరేలోకంలోకి తీసుకెళ్తాడు రచయిత.

**"బాబు, వచ్చావా? త్రేతాయుగం గడిచింది. ద్వాపరం జారిపోయింది, కలిపాదాల భూమి యిది. మీ మూడు తరాలవారు నాకు తెలుసు...".**(సప్తతి మహోత్సవం, పుట : 45)

**"చితిమీద యోగీశ్వరుడు ఆజానుబాహువుగా తోచాడు. కైలాసగిరి ధవళ సదృశమైన నిడుపాటి గడ్డం. భువనమోహంగా కనబడీ కనబడని చిరునవ్వు. నిష్పందమైన శరీరంమీద కాషాయ వస్త్రాలు. మూతబడి వున్న స్థిమితంగా లోచనాలు. ఎవరీ చిదానంద మూర్తి! ఒక మృణ్మయ శరీరం నుండి ఈ చిన్మయ శరీరం ఎట్లా రూపుదిద్దు కొన్నది?.....".."డాక్టర్ లావణ్య వచ్చి దుప్పటి తొలగించింది. ఆ దుప్పటికింద ఏ రోగీ లేదు. ఏ రఘూ లేదు"** (అస్తిత్వనదం ఆవలి తీరాన, పుట: 86). ఇలా ఈ కథ పాఠకుడికి ఒక అద్భుతంగా, ఊహకు అందని విధంగా, మాయగా ముగించాడు రచయిత.

**ముగింపు**

**'అస్తిత్వనదం ఆవలి తీరాన'** కథా సంపుటిలో మునిపల్లె రాజు సందేశాత్మకమైన, అద్భుత రస ప్రధానమైన మాజిక్ రియలిజం కథలను అందించారు. ఇందులోని కథలు కొంత వాస్తవికత, కొంత కాల్పనికత, కొంత సమకాలీనత, కొంత గతంతో కూడి అద్భుతరస ప్రాధాన్యతతో కొనసాగినా చివరికి పాఠకుడికి కథా దృక్పథం బోధపడుతుంది. ఈ కథలలో పాత్రల వేదనలు, సంఘర్షణలు, అనుభవాలు, బాధలను ఎదుర్కొని తమ అస్తిత్వాన్ని తెలుసుకోవడానికి పయనిస్తాయి.

**ఉపయుక్త గ్రంథ సూచి**


1. చెంచయ్య, వి. సాహిత్యంలో వస్తు రూప శిల్పాలు, తిరుపతి: అభినవ ప్రచురణలు, 2017. దక్షిణామూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు, హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్, 2009.

2. మధుసూధనరావు, త్రిపురనేని. సాహిత్యంలో వస్తు శిల్పాలు, హైదరాబాదు: పర్స్పెక్టివ్స్ సామాజిక శాస్త్రం/ సాహిత్యం,1977.

3. రాజు, మునిపల్లె. అస్తిత్వనదం ఆవలి తీరాన, హైదరాబాద్, నవోదయ బుక్ హౌస్, 2002.

4. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. కథా శిల్పం.విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2016.

5. శ్రీలక్ష్మి, తాళ్ళ. మునిపల్లె రాజు కథలు మానవ సంబంధాల పరిశీలన, (అముద్రిత సిద్ధాంత వ్యాసం), హైదరాబాద్; హైదరాబాద్ యూనివర్సిటీ, 1996.



# కలాయి వాలా

డా. ఎన్. గోపి, ఫోన్ : 939 102 8496



మళ్లీ ఇన్నాళ్లకు
కనిపించాడు కలాయి వాలా
అతని జ్ఞాపకాలు
ఇప్పటికీ మెరుస్తూనే వున్నాయి.

పల్లెలో అతడొస్తే
పిల్లలందరం చుట్టూ మూగే వాళ్లం
గృహిణులైతే మరీ!
బొసాండ్లు పట్టుకొని
క్యూ కట్టే వారు.

ఓ కూడలిలో చెట్టు కింద
భుజం మీది గోనె సంచి దించుకునేవాడు
నేల మీద ఓ చోట తవ్వి
గుంట చేసి బొగ్గులు వేసేవాడు
చేతి పంకాను ఊపుతూ
నిప్పును రగిల్చే వాడు.


ఆ రోజుల్లో అన్నీ ఇత్తడి పాత్రలే
నవాసారం ఉప్పుతో సాపు చేసే వాడు
తర్వాత ఓ తగరం ముక్కతో
లోపల రాసే వాడు

మ్యాజిక్ అంతా ఆ శకలానిదే.
చిలుము మాయమై
వెండి పూత దండిగా తళ తళ లాడేది
దానిలో మా ముఖాలు ప్రతిఫలించేవి.

కలాయి చేసిన పళ్లెంలో తింటే
రొట్టె రుచి మరింత పెరిగేది.
పాత పాత్రలను
కొత్తగా మార్చే మాంత్రికుడాతడు
పరిసరాల్లోని గాలికి కూడా
నూతన కాంతులు అద్దేవాడు.

మళ్లీ ఇన్నాళ్లకు
అతడు నగరంలో కనిపిస్తే
బహుశా అతని మనుమడు
మా అమ్మను చూడటాని కొచ్చినట్లున్నాడు.


## శిలాక్షరం




(బి.ఎన్. శాస్త్రి సాహిత్యం - సమాలోచన)
ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్. శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.
సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-
సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177


## మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 8 (19) హైదరాబాద్ జూన్ : 2024

# గుంటూరు రచయిత్రుల కథలు – పరిశీలన

**పరుచూరి మౌనిక,** తెలుగు పరిశోధక విద్యార్థిని, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఫోన్ : 98662 00318



**గుంటూరు కథా సంకలనం :**

అచ్చ తెనుగు నుడికారం రుచి చూపించిన మహాకవి తిక్కన పురిటిగడ్డ గుంటూరు. బౌద్ధ ధర్మం తొలి అడుగు వేసింది. ఈ అమరావతి సీమలోనే. అన్ని రంగాలతోపాటు సాహిత్యరంగంలోనూ గుంటూరు సీమ తెలుగునాట అగ్రగామిగా నిలిచింది. సాహిత్య ప్రక్రియలలో ముఖ్యంగా కథా ప్రక్రియలలో గుంటూరు సీమది ప్రత్యేకించి చెప్పుకోదగిన విలక్షణస్థానం. తొలి కథా కాంతులను అందుకోవడంతో పాటు కథా విమర్శ, అనువాద కథలను తెలుగు వారికి మొదటిసారిగా పరిచయం చేశారు. గుంటూరు కథా సంకలనం పెనుగొండ లక్ష్మీనారాయణ సంపాదకత్వంలో 2013 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయిత సంఘం నుండి ప్రచురితమైనది. మూడు తరాల రచయితలు రాసిన 70 కథలు ఇందులో ఉన్నాయి. ఈ కథలో 60 కథలో రచయితలవి, 10 కథలు రచయిత్రులవి. ఈ పరిశోధన వ్యాసం రాయడానికి ప్రధాన కారణం. గుంటూరు కథా సంకలనంలో రచయిత్రులకు ఎంతవరకు ప్రాధాన్యత ఉంది. రచయిత్రులు ఏఏ ఇతివృత్తాలకు ప్రాధాన్యత ఇస్తూ కథలు రాస్తున్నారు అనే ఆలోచనతో గుంటూరు రచయిత్రులు కథలు పరిచయం చేయాలనే ఉద్దేశంతో వ్యాసం రాయడం జరిగింది.

నా పరిశోధన వ్యాస సమాచారం కొరకు వివిధ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయాలు సందర్శించి రచయిత్రులతో చర్చించి, సమాచారాన్ని సేకరించి, విశ్లేషణాత్మక పద్ధతిలో పరిశోధన వ్యాసం రూపుదిద్దుకుంది.

**గుంటూరు కథా సంకలనంలో రచయిత్రుల జీవిత నేపథ్యం :**

గుంటూరు కథా సంకలనంలో కనుపర్తి వరలక్ష్మమ్మ (దీర్ఘసుమంగళభవ), నల్లూరి రుక్మిణి (బీటలెత్తిన బీళ్ళశోకం), వట్టికొండ విశాలాక్షి (రిక్షావాల), ఓల్గా (పురిటి నొప్పులు), వాసిరెడ్డి సీతాదేవి (తరాలు – అంతరాలు), పొత్తూరి విజయలక్ష్మి (సభల సరంభం), సత్యవతి (పెళ్ళి ప్రయాణం), సుజాత (మట్టి మారాజు), లక్ష్మీరఘురామ్ (బంధము) కథలు రాశారు.

**కనుపర్తి వరలక్ష్మమ్మ :**

కనుపర్తి వరలక్ష్మమ్మ 6.10.1896న గుంటూరు జిల్లా బాపట్లలో జన్మించారు. **"ధర్మము నా జీవం, నీతి నా మతం, సతిశ్రేయము నా లక్ష్యం"** అని ప్రకటించి ఈ మూడింటిని సమర్థించుటకు కలం పట్టి రచనలు చేసిన విదుషీమణి. 'లీలావతి' కలం పేరుతో ఆంధ్రపత్రికలో 'మా చెట్టు నీడ ముచ్చట్లు' శీర్షికతో రచనలు చేశారు. గృహలక్ష్మీ స్వర్ణ కంకణం (1934) అవార్డు పొందిన మొదటి రచయిత్రి, గృహలక్ష్మీ పత్రికలో ఈమె రాసిన 'శారదలేఖలు' సుమారు ఆరు సంవత్సరాల పాటు వెలువడినాయి. కన్యాశ్రమం కథా సంపుటి, అపరాధిని, వరదరాజేశ్వరి నవలలు, వసుమతి, ఓటు పురాణం, మహిళ ప్రబోధం, బాలనీతి కథలు రాశారు. 1967వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఉత్తమ రచయిత్రి పురస్కారం, గుడివాడ సప్తతి మహోత్సవ సన్మాన సభలో కవితా ప్రవీణ బిరుదును పొందారు. 1921 సంవత్సరం విజయవాడలో గాంధీజీ కలిసి జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

**పొత్తూరి విజయలక్ష్మి :**

పొత్తూరి విజయలక్ష్మి 18.7.1953న గుంటూరు జిల్లా యాదలి గ్రామంలో జన్మించారు. 1982 సంవత్సరంలో రచనా వ్యాసంగం మొదలు పెట్టి 150 కథలు, 20 నవలలు, 3 సినిమాలకి, 3 టి.వి.సీరియల్స్‌కి, రేడియోకి నాటికలు రాశారు. విజయలక్ష్మి హాస్య కథలు, చంద్రహారం, మా ఇంటి రామాయణం, ఆనందమే ఆనందం కథా సంపుటాలు వెలువరించారు. కొంచెం ఇష్టం కొంచెం కష్టం పుస్తకాన్ని ప్రచురించారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి ధర్మనిధి పురస్కారం, తురగా కృష్ణ మోహనరావు, శేషారత్నం హాస్య కథ పురస్కారం పొందారు.

**వట్టికొండ విశాలాక్షి :**

వట్టికొండ విశాలాక్షి 1920న గుంటూరు జిల్లా చెబ్రోలులో జన్మించారు. 13.2.1943 సంవత్సరం తెనాలిలో జరిగిన ప్రథమాంధ్ర అభ్యుదయ రచయిత సంఘంవారు నిర్వహించిన మహాసభకు హాజరయ్యారు. అభ్యుదయ గీతాలతోపాటు భారతనారి యుగధర్మం, తపోభంగం, ఆత్మ బలం, నిష్కామ యోగి నవలను, భారతనారి దీర్ఘకవితను రాశారు. అరసం నా చిరునామా అని ప్రకటించుకొని స్వయంగా 1999లో విశాలాక్షి కల్చరల్ ట్రస్ట్‌ను గుంటూరులో ఏర్పాటు చేశారు.

**పోపూరి లలితకుమారి (ఓల్గా) :**

ఓల్గా అసలు పేరు పోపూరి లలితకుమారి 27.11.1950న గుంటూరు జిల్లా యడ్లపాడు గ్రామంలో జన్మించారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎం.ఎ., చదివి తెనాలి వి.ఎస్.ఆర్.కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేశారు. ఈమె రాసిన స్వేచ్ఛ నవల అనేక భారతీయ భాషల్లోకి నేషనల్ బుక్ ట్రస్ట్ వారు అనువదించారు. రాజకీయ కథలు, ప్రయోగం, భిన్నసందర్భాలు, మృణ్మయనాదం, విముక్త కథలు, కథా సంపుటాలను, మానవి, సహజ, ఆకాశంలో సగం, కన్నీటి కెరటాలు, వెన్నెల, గులాబీల నవలలు, వాళ్ళు ఆరుగురు చరిత్ర స్వరాలు, నాటికలు రాశారు. మాకు గోడలు లేవు, నీలిమేఘాలు, నూరేళ్ళచలం నవలా మాలతీయం పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. పైగంబర కవులలో ఈమె ఒకరు. 2015 సంవత్సరంలో విముక్త కథా సంపుటి కేంద్ర సాహితి అకాడమీ పురస్కారం పొందారు.

**పి. సుజాత :**

పి.సుజాత 12.12.1955 గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. వీరి మొదటి కథ నవల సప్తభుజంగాలు, సుజాత కథలు, రెప్ప చాటు ఉప్పెన, నెరుసు కథా సంపుటాలుగా వచ్చాయి. మధురాంతకం రాజారాం. స్మారక కథా కోకిల పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని పొందారు. స్త్రీ అంతరంగ తరంగాలు, సుజాత కథలు ప్రసిద్ధి పొందాయి.

**కులవృత్తికి సంబంధించిన కథలు :**

**రిక్షావాలా** :

వట్టికొండ విశాలాక్షి రాసిన రిక్షావాలా కథలో రిక్షా కార్మికుని శ్రామిక జీవనం ఎలా ఉంటుందో, రోజు కూలీ కోసం వాళ్ళుపడే వారి అష్టకష్టాలను వివరించారు.

రోజువారి కూలీ కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటూ పొట్ట నింపుకునే దయనీయమైన జీవితాలు రిక్షావాళ్ళవి. ఎంత కష్టపడినా శ్రమ అధికం, ఫలితం స్వల్పం. అంత దయనీయమైన పరిస్థితి వాళ్ళవి. ఓ మహిళ గుంటూరు నగరంలో బ్రాడీపేట వీధికి వెళ్లడానికి ఓ రిక్షా కార్మికుడిని పిలిచింది. అతడు రాగానే రిక్షాలో ఎక్కి కూర్చుంది. కొంత దూరం రిక్షా లాగాక అలిసిపోతాడు. చెప్పులు ఎందుకు వేసుకోలేదని ఆ మహిళ అడడగా తాను కొత్తగా ప్రారంభించిన ఈ శ్రమ జీవితం ముందుకు పోవాలంటే చెప్పులు లేకుండానే కష్టపడాలని, చెప్పులు కొనుక్కునే పరిస్థితి కూడా లేదని తన జీవిత గాథను ఆమెకు విన్నవిస్తాడు. అతడి పరిస్థితిని చూసి ఆ మహిళ తనను అక్కడే వదిలేసెళ్ళమని కూలీ డబ్బులు ఇచ్చేస్తానని, నేను వేరే జట్కాలో వెళ్లి పోతానని చెప్పినా అతడు వినకుండా చివరికి ఆమె వెళ్ళవలసిన ప్రదేశానికి తీసుకెళ్ళి ఆమెకు అక్కడ దిగబెడతాడు. కూలీ డబ్బులు కూడా ఇంకా ఇంత కావాలని అని అడగని మొహమాటమున్న నిరంతర కష్టజీవి రిక్షావాడు. ఆ మహిళ ఆరు అణాలివ్వగానే నిండు మనస్సుతో సంతృప్తి చెంది ఎంతో ఉత్సాహంతో వెళ్లిపోతాడు.

**మట్టిమారాజు :**

పి. సుజాత రాసిన 'మట్టిమారాజు' కథలో అన్నం విలువ తెలిసిన శ్రామికుడి జీవితాన్ని శ్రమనే నమ్ముకునే కష్టజీవి వ్యక్తిత్వాన్ని తెలియజేశారు.

వెంకటేశంకి కష్టం తప్ప ఇంక ఏమి తెలియదు. శ్రమనే ఆయుధంగా చేసుకుని, తెనాలి మారీస్ పేటలో షెడ్‌లో పని చేస్తుండేవాడు. అందరూ అతన్ని మసోడని పిలిచేవాడు. తన మెకానిక్ జీవితంలో ఎంతో వ్యయప్రయాసతో కష్టపడి తన కొడుకును చదివించాడు. వెంకటేశం కొడుకు అన్నం విలువ తెలిసిన మంచి మనిషి చిన్నప్పుడు బియ్యపుగింజ పారేస్తుంటే వాళ్ళ నాయనమ్మ చెప్పిన మాటలు విని, ప్రతి బియ్యపు గింజ వాళ్ల నాన్న రక్తం నుంచే వచ్చిందని గ్రహించి అన్నం గొప్పతనాన్ని తెలుసు కున్నాడు. బాగా చదివి గొప్ప ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. ఎన్నో కష్టాలుపడిన వాళ్ళ నాన్నకు నలభై ఏళ్లకే నూరేళ్ళు నిండాయి. వాళ్ళ నాన్నమ్మ కూడా చనిపోయింది. అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్ళ అమ్మను ప్రేమగా చూసుకోసాగాడు. పెళ్ళి చేసుకున్నాక అష్ట ఐశ్వర్యాలతో హాయిగా బతుకుతున్నా కాని తన పిల్లల్ని తీసుకొని తన తండ్రి కష్టాలు గుర్తు చేసుకుంటూ తాను వచ్చిన ఆ కింది స్థాయిని తలుచుకుంటూ ఆ మట్టిలోనే అప్పుడప్పుడు కాలక్షేపం చేస్తుంటాడు. అన్నాన్ని ప్రతి రోజు అమృతంగా భావించి తింటుంటాడు.

**స్త్రీ జీవితానికి సంబంధించిన కథలు :**

**పురిటినొప్పులు :**

ఓల్గా రాసిన 'పురిటినొప్పులు' కథలో తరతరాలుగా స్త్రీ జాతికి జరుగుతున్న అన్యాయాన్ని, బాధపడుతున్న వారి మనసులో ప్రశ్నించిన వైనాన్ని తెలియజేశారు.

వందనం, నాగేశు కూలీపని చేసుకుంటూ బతుకుతున్న, భార్యభర్తలు వారికిద్దరు ఆడపిల్లలు, ఈసారి మగపిల్లాడు పుట్టాలని, కోటప్ప కొడుకు ప్రభలు కట్టాలని ఆశలో ఉన్నారు. వందనం తన తోటి కూలీయైన అన్నమ్మకు జరుగుతున్న అన్యాయాన్ని కళ్ళారా చూసింది. అన్నమ్మను భర్త దానియేలు పెట్టే బాధలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స వల్ల అన్నమ్మ పడ్డ చిత్రహింసల్ని చూసింది. ప్రభుత్వం వారు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు ఇచ్చే డబ్బుకోసం నాగేశం, వందనంకు ఆపరేషన్ చేపిస్తాడు. ఒక మగపిల్లాడ్నికనే అవకాశం పోయిందని బాధపడుతుంది. అప్పుడు నాగేశు తాను వేరే పెళ్ళి చేసుకుంటానని సవతితో పిల్లల్ని కంటానని అంటుంటే

తనకు జరిగిన అన్యాయానికి ఎదురు తిరిగి ప్రశ్నిస్తుంది. ఊరి ప్రజలంతా అన్యాయంగా ప్రవర్తిస్తున్న నాగేశువైపు నిలబడితే తోటికూలిలైన అన్నమ్మ, మరియమ్మలు వందనం వైపు నిలబడతారు. తరతరాలుగా స్త్రీ జాతికి సమాజంలో ఎదురయ్యే విషమ పరిస్థితినే పురిటి నొప్పులకంటే ఎక్కువగా ఉన్నాయని వాటిని పరిష్కరించు కోవాలని ఇది స్త్రీజాతికి సరికొత్త జన్మ అని తెలియజేశారు.

**ఆనంది :**

సన్నపనేని రాసిన 'ఆనంది' కథలో ఒంటరి జీవితానికి కృంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిన ఓ అమ్మాయి జీవితాన్ని తెలియజేశారు.

దేవమ్మ అనే మహిళ గుంటూరు శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థను స్థాపించింది. అనాథల కోసం 1992లో హీల్‌ని కూడా ప్రారంభించింది. తన స్నేహితురాలైన సుజాత ద్వారా ఆనంది అనే అమ్మాయి హిల్‌కి వచ్చి చేరుతుంది. ఆనంది చాలా చురుకైనది. చదువులో సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండేది. ఆమె అనాథ అనుకున్న కొన్ని రోజులకే ఆమెకు నాన్న ఆనందరావు ఉన్నాడన్న విషయం రేవతి అనే అంగన్‌వాడి ట్రైనర్ ద్వారా తెలుస్తుంది. వాళ్ళనాన్నను చూడాలన్న కుతూహలపడుతున్న ఆనందిని చూసి రేవతి ద్వారా వాళ్ళ నాన్నకు చెప్పి రమ్మని కబురు పెట్టించింది. దేవమ్మ వాళ్ళనాన్నను చూసి ఎంతో సంతోషపడుతుంది. కొంత కాలానికి ఆనంది వాళ్ళ మేనత్త, బావ వచ్చి ఆమెను తీసుకెళతారు. వాళ్ల మేనత్త కొడుకుని పెళ్ళి చేసుకుంటుంది ఆనంది, పెళ్ళి తర్వాత ఆమె జీవితం కష్టమయవుతుంది. మళ్ళీ కొన్ని రోజులకి హిల్‌కి వచ్చి చేరుతుంది. కాని అక్కడ పిల్లలు తోటి వాళ్ళు ఆమెను సూటిపోటి మాటలతో బాధపడతారు. అప్పుడిక అందరిని విడిచి ఒంటరి జీవితాన్ని గడుపుతూ, ఆత్మవిశ్వాసంతో చదువుకొని గొప్ప స్థాయికి వెళుతుంది. తనను పెంచి పెద్ద చేసిన హిల్ సంస్థకి డబ్బులు కూడా పంపిస్తూ ఉంది.

**సామాజిక సంబంధించిన కథలు :**

**దీర్ఘసుమంగళీభవ :**

కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన 'దీర్ఘసుమంగళీభవ' కథలో చేతిలో ఉన్న అధికారం అండ చూసుకొని అమాయక ప్రజలను కష్టాలకు గురి చేస్తే చివరికి వారు కూడా అదే కష్టాలను అనుభవించవలసి ఉంటుందని తెలియజేస్తున్నది ఈ కథ.

పరశురామయ్య వడ్డీ వ్యాపారి, ఆయనకు నమ్మిన బంటు శివయ్య శాస్త్రి. ప్రజల దగ్గర నుంచి అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా వర్ణ సంకరం చేస్తున్నారని ఆంక్షలు విధించి ప్రాయశ్చిత్తం పేరుతో డబ్బులు వసూలు చేస్తాడు. నియమాల పేరిట విధవరాళ్ళను కూడా వేధిస్తారు.

పరశురామయ్య చిన్న కొడుకు శంకరరావు ఎఫ్.ఎ.పరీక్ష తప్పడంతో తీవ్రంగా కొప్పడతాడు. తండ్రికి గుణపాఠం నేర్పాలని శంకరరావు రాత్రిపూట మద్రాసు రైలు ఎక్కి ఇంట్లోంచి వెళ్ళిపోతాడు. వారం తర్వాత బారిష్టర్ చదువుకోసం ఇంగ్లాండ్ వెళ్తున్నానని ఉత్తరం రాస్తాడు.

శివయ్యశాస్త్రికి పార్వతి ఒక్కతే కూతురు. బి.ఎ.చదువుతున్న వ్యక్తితో పెళ్ళి చేస్తాడు కానీ అతడు కొద్ది రోజులకి చనిపోతాడు. పార్వతి విధవరాలు అవుతుంది. మూడేళ్లకు శంకరరావు బారిష్టరై తిరిగి వస్తాడు. ఇంగ్లాండ్ వెళ్ళి వచ్చిన శంకరరావుని ఇంట్లోకి అనుమతించి శివయ్యశాస్త్రి భార్య అన్నం వడ్డించినందుకు అవమానంతో శివయ్యశాస్త్రి కాశీకి వెళ్ళిపోతాడు.

శంకరరావు పార్వతి పరిస్థితి తెలిసి బాధపడతాడు. ఆమెను చూడడానికి ఇంటికి వెళ్ళి ఆమె కష్టాలు తీర్చడానికి పెళ్ళి చేసుకుంటానంటాడు. ఒకనాటి ఉదయం శివయ్య కుమార్తె కనిపించకుండా పోయింది. రకరకాలుగా అనుకుంటారు ఊరిజనం. శివయ్య బాధపడుతుండగానే రెండు రోజులకు విధవా పునర్వివాహం శాస్త్ర నిషిద్ధం కాదని తెలిసి నేను పెళ్లి చేసుకుంటున్నాను అని ఆమె దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. గుంటూరులో లక్ష్మీనారాయణ పంతులుగారి చేతుల మీదుగా పార్వతీశంకరుల వివాహం జరిగింది. అప్పుడే అక్కడికి వెళ్ళిన శివయ్య విధిలేక 'దీర్ఘసుమంగళీభవ' అని దీవిస్తాడు.

**ముగింపు :**

గుంటూరు కథా సంకలనాల రచయిత్రుల కథల్లో నీటి సమస్యలు, కులవృత్తులు, స్త్రీ జీవితం, హాస్యచతురతకు సంబంధించిన కథలు ప్రధానాంశాలుగా ఉన్నాయి. రచయిత్రల కథల ద్వారా మాండలిక భాష, యాసలు తెలుసుకోవచ్చు. ఆయా కాలంలో వచ్చిన ఉద్యమాలు, సామాజిక వాస్తవాలను తెలుసుకోవచ్చు.

కథా సంకలనాలు, కథా సంపుటాలను కథకు శాశ్వత్వాన్ని కల్పించడానికి ఉపయోగపడతాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి – కథాశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

2. శ్రీరామమూర్తి, కోడూరి – కథలెలరాస్తారు, వ్యాససంకలనం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

3. లక్ష్మీనారాయణ, పెనుగొండ – గుంటూరు కథలు, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరుజిల్లా శాఖ.

4. కనకదుర్గ, జె – తెలుగు సాహిత్యం – మహిళా చైతన్య ప్రస్థానం, తాహెర్ గ్రాఫిక్స్, కొత్తగూడెం.

❖ ❖ ❖ ❖ ❖

## ఆదిత్య హృదయ మహిమ

**“రశ్మిమన్తం సముద్యన్తం దేవాసుర నమస్కృతమ్**
**పూజయస్వ వివస్వన్తం భాస్కరం భువనేశ్వరమ్”**

**రశ్మిమంతుడు :** రశ్మలు అంటే కిరణాలు. ఒక మూలద్రవ్యం నుండి కాంతిరూపంలో చాలాదూరం ప్రసరించే ఒకవిధమైన వెలుగును కిరణం అంటాము. సూర్యునకు సహస్ర కిరణుడు అని పేరు. వేలకొలది కిరణాలు అతనినుండి అన్నివైపులకు వ్యాపిస్తూ ఉంటాయి. అటువంటి రశ్మలు – అంటే వ్యాపనశీలం కలవి – అనంతంగా ఉన్నవాడు రశ్మిమంతుడు. ఈ వ్యాపన శీలం చేత సూర్య భగవానుని లోని విష్ణుత్వాన్ని మనం సంభావించాలి.

రశ్మలు అంటే వెలుగులు అని కూడా అర్థం. విశ్వనాథ వారు శ్రీమద్రామాయణ కల్పవృక్షం సుందరకాండ ఆరంభంలో ఒక అద్భుతమైన పద్యం వ్రాశారు.

వెలుగు మరొక్కపేరఖిల విద్యలకుం బరమార్థ భూతమై;
వెలుగులు తన్నుమించి మరి విశ్వమునందున వేఱుచోటలే;
వలఘుడు శిష్యవత్సలుడు నంబుధి శోషణ దాహమూర్తి,వె
ల్గులనిధికిన్, గురూత్తమునకున్ జగదక్షునకున్ నమస్కృతుల్.
(కల్పవృక్షం – సుందర – పూర్వరాత్ర–3)


వెలుగు అంటే విద్య. అది కూడా పరమార్థ విద్య. వెలుగులు తన గురూత్తముడైన సూర్యుణ్ణి మించి విశ్వంలో మరెక్కడా లేవు. అందువలన ఆయన అలఘుడు. చాలాచాలా గొప్పవాడు. ఊహలందని గొప్పతమే ఆయన. అంతవాడయినా శిష్యులయందు అనంతమైన వాత్సల్యం కలవాడు. ఇక్కడ శిష్యులంటే సర్వజీవకోటినీ గ్రహించాలి. అంబుధి శోషణదాహమూర్తి. సముద్రాలను ఎండగట్టించ గల వేడియే మూర్తి అయినవాడు. జగదక్షుడు – లోకాలన్నింటికీ కన్ను అయినవాడు. ఈ రెండూ ఆయన గొప్ప వాత్సల్యానికి నిరూపకాంశాలు. సముద్రాలను ఎండించటం మేఘాల ఉత్పత్తి ద్వారా సర్వజనులకు అన్నపానాలను సమకూర్చటం కోసం. లోకులందరూ లోకాలనూ, లోకస్థులనూ, లోకేశ్వరులనూ సూర్యుని ద్వారానే చూడ గలుగుతారు. అటువంటి వెలుగుల నిధికి నమస్కారం అన్నాడు. బుద్ధిమంతులలో వరిష్ఠుడయిన ఆంజనేయ స్వామి.

రశ్మిమంతుడయిన కారణంగా ఈ విశిష్టత భాస్కరునికి కలుగుతున్నది అని ప్రకృతార్థ సమన్వయం.

(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి ‘ఆదిత్య హృదయం’ నుండి)

❖ ❖ ❖ ❖ ❖

## సత్సంగం




### స్వేచ్ఛ

ఏది కావాల్సితే దానిని చేయటానికి అందరికీ స్వేచ్ఛ కావాలి. ఏ విధమైన ఆంక్షా లేకుండా ఉండాలి. ఆంక్ష శోకం, స్వేచ్ఛ ఆనందం. కాని పరిపూర్ణమైన స్వేచ్ఛ ఎక్కడా ఉండదు. మన స్వేచ్ఛ ఇతరుల స్వేచ్ఛకి అడ్డు రాకూడదు. మనకి తోచినట్టు చేయకూడదు, మాట్లాడకూడదు.

మన స్వేచ్ఛకి కొన్ని హద్దులున్నాయి. ఇవి మనకీ, మనం ఉండే సమాజానికీ ఉపయోగ పడతాయి. అందరూ సులువుగా వెళ్ళటానికి వీలుగా ఉండేందుకు ట్రాఫిక్ లైట్లు మన వేగాన్ని తాత్కాలికంగా ఆపుతాయి. అట్లాంటివే ఈ హద్దులూను. మన శ్రేయస్సునీ, ఇతరుల శ్రేయస్సునీ దృష్టిలో పెట్టుకొని మనం కొంత స్వేచ్ఛని వదులుకుంటాం.

ఆనందాన్వేషణకీ స్వేచ్ఛ అవసరమనుకుంటాం. మనమొక లక్ష్యాన్ని పెట్టుకొని, ఎన్నో ఆటంకాలని దాటి, దానిని సాధిస్తాం. ఎంతో సంతోషిస్తాం. కాని ఈ సంతోషం ఎంతోకాలం నిలవదు. అందువల్ల మరొక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని కూడా ఎంతో శ్రమపడి సాధిస్తాం. ఈ సంతోషం కూడా కొంతకాలమే ఉంటుంది. దీనికి కారణము మన వెలుపల ఉన్నదేదీ మనకి శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేకపోవటం. అయినా, మన అన్వేషణ కొనసాగుతూనే ఉంటుంది. ఆనందాన్ని వెతుక్కోవడం క్రమేపీ మారి, ఆ వెతుక్కోవడమే ఆనందమవుతుంది.



స్వేచ్ఛగా, సంతోషంగా ఉండాలని మనం కోరుకోవటానికి కారణం స్వేచ్ఛా, సంతోషమూ మన నైజం కాబట్టి, దేనినో అన్వేషించటంలో స్వేచ్ఛలేదు. ఆ అన్వేషకుని మూలమేదో కనుక్కోవటం లోనే ఉంది. అహంకారమున్నంత కాలం స్వేచ్ఛ ఉండదు. మనస్సు నిర్విరామంగా దేనినో వెతుకుతూనే ఉంటుంది. ఒక్క క్షణం విశ్రాంతి ఉండదు. మనస్సు మనని ఇట్లా పీడిస్తున్నంత కాలమూ మనకి అసలైన స్వేచ్ఛ లేనేలేదు. సంపూర్ణమైన స్వేచ్ఛ మనస్సుకు అతీతమైనది. మనస్సులోని వాగుడు లేనప్పుడే, ఏ విధమైన అన్వేషణా ఆఖరికి, స్వేచ్ఛకోసం అన్వేషణ కూడా, లేనప్పుడే అది సిద్ధిస్తుంది.

# తెలంగాణ పద్యానికి పచ్చని తోరణం

**బోర్ల ప్రవీణ్ కుమార్**, తెలుగు అధ్యాపకులు, ఫోన్ : 998 947 5899

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియా వైవిధ్యాలను మనం గమనించవచ్చు. ముఖ్యంగా ఇరవైయవ శతాబ్దంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో సాహిత్యంలో వచ్చిన మార్పులను మనం స్పష్టంగా గమనించవచ్చు. ఆధునికమైన ఆలోచన ధోరణులు, సామాన్యుడి అంతరంగానికి దగ్గర కావాలన్న ఆలోచనలు సృజనాత్మకత, విమర్శనాత్మక రంగాలలో ప్రక్రియా వైవిధ్యానికి కారణాలు. ఇది సాహిత్యానికి విశాలత్వాన్ని అందించింది. అందుకే ఇరవైయవ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో అనేక పరిణామాలను మనం చూడవచ్చు. పరిణామాల ప్రభావం మన సాహిత్యంపై కూడా పడింది. కవితాత్మకంగా కళాత్మకంగా చెప్పే విధానం వివిధ ప్రక్రియల రూపంలో మార్పులు చెందాయి. అందులో ఖండకావ్య ప్రక్రియ కూడా ఒకటి.



ఆధునిక కవిత్వంలో ఖండకావ్య ప్రక్రియ గొప్ప స్థానాన్ని ఏర్పరచుకున్నది. ఖండకావ్య ప్రక్రియ గురించి సాహిత్య ప్రపంచంలో ఎన్నో చర్చలు జరిగాయి. కొందరు ఈ ప్రక్రియ మన ప్రాచీన సాహిత్యంలో ఇదివరకే ఉందని నిరూపించే ప్రయత్నం చేశారు. మరికొందరు పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల వచ్చిందని వాదించారు. ఏది ఏమైనా ఖండకావ్యం ఒక ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో స్థిరపడ్డది మాత్రం ఆధునిక కాలంలోనే.

ఖండకావ్య ప్రక్రియ ఆధునిక కవిత్వ శాఖగా అవతరించిన భావ కవిత్వానికి ఎంతో దోహదం చేసింది. భావకవిత్వంలోని మధురమైన ప్రకృతి వర్ణనలకు, నాయక నాయికల ప్రణయాన్ని చర్చించడానికి, స్త్రీని అపురూపంగా చిత్రించడానికి, దేశభక్తిని నిరూపించుకోడానికి ఖండకావ్య ప్రక్రియ కవులకు ఎంతో ఉపయోగపడింది. మన తొలితరం కవులలో ఎంతోమంది ఖండకావ్య ప్రక్రియను ఉప యోగించి వారి కవిత్వంలో భావుకతను తారాస్థాయికి స్థాయికి తీసుకుపోగలిగారు. ఆధునిక తెలుగు సాహిత్య విస్తృతికి ఖండకావ్య ప్రక్రియ ఎంతో తోడ్పడింది. తెలుగు కవిత్వాన్ని ప్రతీ పాఠకుడి హృదయంలోకి చేర్చిన ప్రక్రియలలో ఖండకావ్య ప్రక్రియ కూడా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

దేవులపల్లి రామానుజరావు పచ్చతోరణం కూడా ఖండకావ్య ప్రక్రియనే. పచ్చతోరణంలో మొత్తం 21 కవితా ఖండికలున్నాయి. ప్రతీ ఖండిక ఒక్కో కళాఖండంగా విలసిల్లుతుంది. ఇది వీరి మొదటి రచన. అయితే పచ్చతోరణం తర్వాత మళ్లీ కావ్యాలను రచించలేదు. ఎన్నో గ్రంథాలను వెలువరించిన ఆయన మరో కావ్యరచన చేయకపోవడం కవితా పాఠకులకు బాధాకరమైన విషయం. అందుకే రాయప్రోలు సుబ్బారావు **"ఈ కవి కావ్య కృషి వదలడం తెలంగాణ తేనే మాగాణికి కొరత కాక తప్పదు"** అని అన్నారు. తెలుగు సాహిత్యంలోని భావ కవిత మాధుర్యాన్ని పచ్చతోరణం మరింత ఎత్తుకు తీసుకుపోయింది. **"తెలంగాణలో భావ కవిత్వం లేదు"** అని విమర్శించిన ఎన్నో నోళ్ళను మూయించి తెలంగాణ భావ కవిత్వానికి పచ్చతోరణం ఒక ప్రతినిధిలా మారింది. పచ్చతోరణం ఉపసేచనిలో రాయప్రోలు సుబ్బారావు గారన్నట్లు **"పచ్చతోరణం అంతా పచ్చగా లేదు. అక్కడక్కడ కట్టెట్లని రేకులున్నవి. అకలంక ధవళములైన పత్రపుష్పాదులును కలవు. కదంబ కల్పనలో ఇలాంటి మిశ్రరూప రామణీయకం తప్పదేమో! ఎందుకంటే, ఆయా వర్తమాన సంనివేశ సంపర్కాలను బట్టి కవికంఠము ఉన్ముక్తమై మోగింది"**. పచ్చతోరణంలో దేవులపల్లి రామానుజరావు సమాజంలోని అనేక కోణాలను స్పృశించారు. ఒక్కోపద్యం ఒక్కో ఆణిముత్యం. అందుకే పచ్చతోరణం ఖండకావ్యం విమర్శకుల ప్రశంసలు పొందింది.

ప్రకృతి వర్ణనలు మనకు ఎన్నో కనిపిస్తాయి. ఈ ఖండకావ్యానికి పచ్చతోరణం అని పేరు పెట్టడంలోనే ఆయన ఉద్దేశ్యం మనకు స్పష్టం అవుతుంది. ప్రకృతిపై ఆయనకున్న మమకారం అర్థమవుతుంది. ప్రేమ గీతములు అనే కవితా ఖండికలో

**"ప్రకృతి సౌందర్య శోభల పాడుచేయ**
**పాప మది యే మొనర్చనే భామ, నీకు?**
**తనదు సొమ్ముల నీ విట్లు తస్కరింప**
**చూడు మా తీవ కన్నీళ్ళు విడుచుచుండె!"**

ప్రకృతి సౌందర్యాన్ని పాడుచేయడానికి నీకు మనసెలా వచ్చిందని ప్రకృతిపై తనకున్న ప్రేమను చాటారు దేవులపల్లి రామానుజరావు.

'ప్రేమ గీతములు' లో మరోచోట,

**"చీర జరియంచు మలినమై చెన్నుదొరగె**
**నుదుట కుంకుమ తిలకంబు చెదరిపోయే**

**మంచి ముత్యాల హారము సంచలించె**
**తెగిపడునో ఏమో భద్రము తీగబోడి!**

**పగలు వెన్నెలగాసిన భాను బింబ**
**యేమి కోపించునో యని యెత్త వాక్కొ?**
**అరిగి తరుగునో యేమొ నీ యలరుమోము**
**వంచి దాచితి వేలనో మించుబోడి!"**

ఆమె అందం వలన పగలే వెన్నెల కాస్తుంటే, సూర్యుడు కోపగించుతాడో ఏమోనని ఆమె తలవంచుకొని దాక్కున్నదని మధురమైన వర్ణన చేసారు దేవులపల్లి రామానుజరావు. ప్రకృతిని ఆరాధన భావంతో చూస్తే ప్రతీది అద్భుతంగానే కనపడుతుంది. ముఖ్యంగా కవుల హృదయాలకు ఒక్కోటి ఒక్కో అద్భుతంగా కనిపించడంలో ఆశ్చర్యమేమీ లేదు.

కవి తనను తాను ప్రకృతిలో భాగంగానే ఊహించుకుంటాడు. ఒక్కోసారి తనను ప్రకృతిలోని అందమైన ఏదో ఒక జీవితో పోల్చుకుని పొంగిపోతాడు.

**"పుట్టనైతిని నేనొక పిట్టనగుచు**
**ఎట్టి బంధంబులును లేక యిచ్చ వచ్చు**
**రీతి కాలంబు గడుపుదు రేయి పవలు**
**ఆట పాటల నా కేరు సాటి లేక"**

ఒక పిట్ట లాగానైనా పుట్టకపోతిని, ఏ బంధములు లేక ఇష్టం వచ్చినట్లు రాత్రనకా పగలనకా ఆటలాడుకుంటూ కాలాన్ని గడుపుదును అని మోసము అను కవితాఖండికలో దేవులపల్లి రామానుజరావు తనలోని స్వేచ్ఛా కోరికలను బయటపెట్టారు. నీరాజనము అను కవితా ఖండికలో రాయప్రోలుని ఉద్దేశించి –

**"కళయు సౌందర్య మారాధకంబు నీకు**
**ప్రకృతి లావణ్యమో నీకు పరమప్రియము"**

అన్న వాక్యాలు సరిగ్గా దేవులపల్లి రామానుజరావుకే అన్వయించి చెప్పవచ్చు.

**"ఇల్లు వెనకనె విలసిల్లు మల్లెతోట**
**విరియబూచిన పూలతో వేడ్కసేయ**
**బీరపాదుల కొక్కింత దూరమందు**
**కొమ్మచిక్కుడు పందిరి న్గూరుచుండి"**

ప్రతీ ఇంటి పరిసరాల్లో ముఖ్యంగా పల్లెల్లో సహజంగా కనిపించే మల్లెతోట, బీరపాదులు, చిక్కుడు పందిర్లను సంక్రాంతి అను కవితలలో అద్భుతంగా వర్ణించారు దేవులపల్లి రామానుజరావు. ఇందులోనే పశువుల మందను దాని చుట్టూ ఉన్న ఒక అందమైన లోకాన్ని ఈ విధంగా ఆవిష్కరించారు...

**"పశులమందను గాచెడు బాలుడొకడు**
**చింతకాయలు గోయగా చెట్టునెక్కి**
**కోడె లేక కొన్ని వెంట రా గోగణంబు**
**జలక మాడగ నేగును చెరువు నందు"**

**"చిన్న లేగల యొడల్ చన్ను జేపగ నాకు**
**చొక్కంపు టావుల చక్కదనము**
**పచ్చని పచ్చికపట్టుల పవళించు**
**ప్రాయంపు టెద్దుల సోయగంబు"**

**"రంకెలు వైచుచు రంపిల్లి పోరాడు**
**కొమ్ములకోడెల క్రుమ్ములాట**
**ఆకుల గుడిసెకు అనతిదూరంబున**
**లీలగా విహరించు లేగ సౌరు"**

తొలకరి అను కవితలో వర్షాన్ని వర్ణించిన తీరు తప్పక తెలుసుకోవాల్సిందే. తొలకరి చినుకులతో ఈ నేల, నేలను నమ్ముకున్న జీవులు ఎంతగా పులకించి పోతాయో మనకందరికీ అనుభవంలోనిదే.

**"హృదయ ముప్పొంగగా నురిమినచో నీకు**
**పూజ యొనర్తుము పొన్న పూల**
**మిరుమిట్లు గొలుపగా మెరసిన నీయ్యదే**
**అరటాకు దొన్నెలో యలరుదేనే**
**చెఱువులు నిండించి స్వీకరింపుము కాన్క**
**దోరబండిన మేలి దోసపండ్లు**
**పైరులు చక్కగా పండిన నిత్తుము**
**పండుటాకులలోన పచ్చివెన్న"**

దేవులపల్లి రామానుజరావుకు ప్రకృతిలోని అందాలు అద్భుతాలే కాదు బాధలు నిస్సహాయతలు కూడా కనపడ్డాయి. ప్రకృతిలో వ్యథలను కూడా చిత్రించారు. బీదకాపు అను కవితా ఖండికలో సగటు బీద రైతు బాధలను మనకు కళ్ళు చెమర్చేలా చిత్రించారు. ముఖ్యంగా సమకాలీన తెలంగాణ రైతులు వర్షాలపై ఎంత ఆధారపడేవారో అర్థమవుతుంది. ఎంతోమంది రైతులు వర్షాలపై ఆధారపడి తమ జీవితాలను సైతం కోల్పోయిన సందర్భాలు తెలంగాణ పల్లెల్లో కోకొల్లలు. బీదకాపు కవితలో ఆ సంఘటనలు ప్రతిబింబిస్తాయి.

**"ఆరిపోయిన చెఱువు కన్నార జూచి**
**పండువారిన తల పాల మెండబారా**
**దీర్ఘనిశ్వాస మొక్కటి తీసి నిల్చి**
**నడువ జాలని యొక కాపు పడుచువాడు**
**నీరు ద్రావగ నొక లేగ నోరు దెరచి**
**చెరవు కడ కేగి జలములు దొరక కపుడు**
**బీదచూపులు తనుజూడ బేల యగుచు**
**కన్నులను నీరు గార్చె నా కాపుబిడ్డ"**

ఆరిపోయిన చెరువు, ఎండిపోతున్న చేతికొచ్చిన పంట, కనీసం చెరువులో లేగ దూడకు తాగడానికి నీళ్ళు దొరకకపోవడం ఇవన్నీ దేవులపల్లి రామానుజరావుకు కవితా వస్తువులయ్యాయి. ఆనాటి తెలంగాణ పరిస్థితులను ఆవిష్కరించాయి.

తెలుగు సాహిత్యంలో మొదటి నుండి కవులు రచయితలు స్త్రీని అనేక కోణాల నుండి దర్శించారు. స్త్రీకి ప్రాచీన సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రాచీన సాహిత్యంలోని అనేక ప్రబంధాలు స్త్రీ వర్ణనల వల్లనే సాహిత్యంలో స్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయి. ప్రబంధాల్లో స్త్రీకి ఎంతటి ప్రాముఖ్యత ఉందో నవ్య కవితా ధోరణుల్లో కూడా అంతే ప్రాముఖ్యతను ఇచ్చారు మన ఆధునిక కవులు. కాల్పనిక కవిత్వంలో స్త్రీ చుట్టూ రచింపబడ్డ అనేక కవితా ఖండికలున్నాయి. స్త్రీ వర్ణనలు భావ కవిత్వానికి అలంకారం లాంటివి. దేవులపల్లి రామానుజరావు పచ్చతోరణంలో కూడా స్త్రీని వర్ణిస్తూ కవితా ఖండికలున్నాయి. ఇవి ప్రబంధ కావ్యాలకు ఏమాత్రం తీసిపోవు. ఆముక్తమాల్యద అను ఖండికలో గోదాదేవిని అపురూపంగా చిత్రించారు దేవులపల్లి...

**"అరుణ రేఖలు తూరుపు నందగింప
నప్పుడే స్నాన మొనరించి యతివ యొర్తు
తెల్ల చీరను ధరియించి నల్లరైక
దొడిగి కొప్పున పూవులు ముడిచికొనుచు
కర్ణాగ్రముల గులుకు గన్నేరు పూవులు
తాటంక శోభతో తగవులాడ
సీమంతచుంచియో శ్రీ చూర్ణ తిలకంబు
సౌందర్యగరిమతో సరసమాడ
గాలి సోకుటచేత కదలెడు ముంగురుల్
కనుబొమ్మలం జీరి గౌగిలింప
చిన్నారి మోమున సిగ్గుల మొగ్గలు
ఉయ్యాల జంపాల లూగుచుండ"**

అంటూ గోదాదేవిని వర్ణిస్తూ, శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద సారాన్ని దేవులపల్లి ఈ ఖండికలో కేవలం 16 పద్యాల్లోనే తన పదలాలిత్యంతో మనోహరంగా చిత్రించారు. ఎన్ని జన్మాల బంధమో అను ఖండికలో...

**"కిలకిల నవ్వ దానిమ్మగింజ లచట
రాలె నను భ్రాంతి ఆ చిల్క వ్రాలెనేమొ!"**


ఆమె కిలకిలా నవ్వితే దానిమ్మ గింజలు రాలాయేమో అనుకుని చిలుకలు అక్కడ వాలినాయట. ఆమె నవ్వినప్పుడు కనిపించే పళ్ల వరుసను దానిమ్మ గింజలతో పోల్చడం ఎంత మధురం! కాపుకన్నె అనే కవితా ఖండికలో **"చురుకు చూపుల తరువాత జూతుగాని"** అన్న వాక్యం చదివితే –

**"చుఱుకు జూపున గాలిన కొఱతనుఱుకు
నుఱుకు జూపులబుట్టించు నెఱుకువారి"** అన్న ధూర్జటి మహాకవి గుర్తొస్తాడు. **"పచ్చతోరణం ఆనాటి కాల్పానిక కవిత్వానికొక ఉదాహరణ. వివరణాత్మక విశ్లేషణ. పచ్చతోరణం ఆ కాలపు కవిత విన్యాసానికి పట్టిన మెరుగుటద్దపు సొగసు"** అన్న ఆచార్య నాయని కృష్ణకుమారి వ్యాఖ్యలు కావ్యహృదయాన్ని చక్కగా ఆవిష్కరిస్తున్నాయి. ప్రాచీన తెలుగు కవుల లక్షణాలన్నీ మనకు దేవులపల్లి కవిత్వంలో కనిపిస్తాయి. ప్రబంధ కావ్యాల పరిమళాలు పచ్చతోరణంలో మనకు పుష్కలంగా కనిపిస్తాయి. సంక్రాంతి అను ఖండికలో...

**"గంప నెత్తినబెట్టి సొంపుగా జూచుచు
జొన్న చేనున కేగు వన్నెలాడి
కొడవలి జేబూని కులుకుచు కులుకుచు
కాశెగడ్డిని గోయు కాపుకన్నె
పసుపుచీరను దాల్చి బంతిపూవులమాల
లందంబుగా గ్రుచ్చు సుందరాంగి
కమ్మ సంపంగితోట చెమ్మచెక్కలనాడు
చిన్నారి పొన్నారి చెలులగుంపు"**

అంటూ గంపనెత్తిన పెట్టుకుని చేనుకు వెళుతున్న వన్నెలాడిని, కొడవలి పట్టుకుని కాశెగడ్డిని కోసే కాపుకన్నెను, బంతిపూల దండను గుచ్చుతున్న సుందరాంగిని, చెమ్మచెక్కలను ఆడుతున్న చిన్నారి పొన్నారి చెలులగుంపును మనోహరంగా వర్ణించాడు. ఓరుగల్లు అనే కవితా ఖండికలో పుట్టిన గడ్డపై మమకారాన్ని, మహాత్ముడు అనే కవితా ఖండికలో దేశభక్తిని చాటాడు దేవులపల్లి రామానుజరావు.

కృష్ణా పత్రిక 14/02/1953 రోజున పచ్చతోరణం గురించి తన అభిప్రాయాన్ని కింది విధంగా ప్రచురించింది. **"పచ్చతోరణం. ఇది చక్కని ఖండ కావ్యముల తోరణం. సుమారు ఇరువది రేకలు పూవులు గుదిగూర్చబడ్డాయి ఈ తోరణంలో. ఆచార్య రాయప్రోలు సుబ్బారావు గారి పరిచయ వాక్యం ఉంది, తోరణం అందచందాలను లవమాత్రంగా నిరూపించి పఠితలకు ఆసక్తి కలిగించేందుకు. రామానుజరావు గారు సుప్రసిద్ధులగు తెలంగాణ కవులు. స్వయం ప్రకాశమైన ప్రతిభగల కవిపుంగవులు. మృదువులైన పదములతో ఒయ్యారముగా నడిచింది మధురాతి మధురమైన వీధి కవిత కుమారి. ఈ పచ్చ తోరణంలో అంతయు పచ్చయే కాదు వివిధ రంగుల పుష్పాలు వివిధములగు సువాసనలతో రసిక హృదయయులకు ఆహ్లాదం కూర్చునది. రసపిపాసులు చదివి ఆనందించండి".**



ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 8 (26) హైదరాబాద్ జూన్ : 2024

# వేపూరు హనుమద్దాసు జీవిత విశేషాలు – రచనలు

**డా. శ్రీవైష్ణవ వేణుగోపాల్,** ఫోన్ : 98487 07978

**వ్యాస సంగ్రహం**

తెలుగు సాహిత్యంలో కవిత్రయంవలె పాలమూరు జిల్లాలో ముగ్గురు వాగ్గేయకారులు "దాస త్రయం"గా ప్రసిద్ధులు. వీరిలో రాకమచర్ల వెంకటదాసు పాలమూరు జిల్లా తూర్పు భాగం చివర జన్మించగా, మన్నెంకొండ హనుమద్దాసు పాలమూరు పశ్చిమ భాగంలో పుట్టాడు. వేపూరు హనుమద్దాసు పాలమూరు జిల్లా మధ్య భాగంలో జన్మించాడు. జ్యేష్ట బహుళ అష్టమి రోజు వేపూరు హనుమద్దాసు 77వ ఆరాధన మహోత్సవం సందర్భంగా వేపూరు హనుమద్దాసు జీవిత విశేషాలు వారి రచనల గురించి సంక్షిప్తంగా పరిచయం చేయటం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం.

**ముఖ్య పదాలు**

వేపూరు హనుమద్దాసు, పాలమూరు జిల్లా వాగ్గేయకారులు, శారద రామాయణం, బొబ్బిలి పాటలు, సీతా కల్యాణము, వాలి వధ, బతుకమ్మ పాటలు, సంకీర్తన సాహిత్యం, కృష్ణలీలలు.

**హనుమద్దాసు పూర్వీకులు**

హనుమద్దాసు పూర్వీకులు కల్వకుర్తికి సమీపంలోని 'పంజుగల్' గ్రామవాసులు. ఈ 'పంజుగల్' మొదటి పేరు 'పంచకుల' పూర్వం కడపజిల్లాలోని 'నెరవెట్ల' అనే గ్రామం నుండి ఒక రెడ్డి, ఒక ముత్తరాసి, ఒక చాకలి ఇంకా ఎవరో ఇద్దరు కలిసి ప్రస్తుతమున్న 'పంజుగల్' స్థానంలో గుడిసెలు వేసుకొని నివసించారట. వారు అయిదుమంది ఐదుకులాల వాళ్లు కాబట్టి ఆ స్థలాన్ని అపుడు 'పంచకుల' అని పిలిచారు. అది రానురాను పంచకుల' – 'పంజుగల్'గా మార్పు చెందింది. అక్కడికి వచ్చినవాళ్ళు ఒంటిమిట్ట కోదండరామస్వామి భక్తులు. అక్కడి రామాలయం ఎంతో ప్రసిద్ధి. ఎందుకిదంతా చెప్పాల్సి వచ్చిందంటే హనుమద్దాసు తన కీర్తనల్లో (నెం.302) "ఒంటిమిట్ట రాముని బంట్లము, మేము ఒంటి మిట్ట రాముని బంట్లము" అని చెప్పుకొన్నాడు. అందుకే తన కీర్తనలకు రామకీర్తనలు అనే పేరు పెట్టుకొన్నారు.

**హనుమద్దాసు జననం, బాల్యం**

హనుమద్దాసుగారి తాత రామన్నగారు నాగర్‌కర్నూల్ జిల్లాలోని పాలెం గ్రామ నివాసి. ఆయన భార్య పేరు పుల్లమ్మ. ఈ దంపతులకు కుమారుడు అచ్చన్నగారు. ఆయన భార్య పేరు బారెమ్మ. ఈ దంపతులకు హనుమంతు, సంజన్న, వెంకట్రాములు, నారాయణ అనే నలుగురు కొడుకులు నలుగురు ఆడపిల్లలు సంతానం కలిగారు. వారిలో హనుమంతుకు రాములు కొడుకు జన్మించాడు. హనుమంతును హనుమయ్య అనికూడా పిలిచేవారు. పెద్దవాడై, భక్తుడై, సంకీర్తనాకారుడు, కవియైన తర్వాత హనుమయ్య హనుమద్దాసుగా ప్రసిద్ధి పొందినాడు.

**వేపూరుతో హనుమద్దాసుకు గల అనుబంధం**

మేడిపూర్ గంగాపురంవారు అనే స్మార్తులున్నారు. వీరు మంచి విద్యావంతులు, నృసింహోపాసకులు. వీరు ఆ చుట్టుపక్కల ఇతర వర్ణాలలో గల బాలురను చాలా మందిని చదివించి విద్యావంతులుగా చేశారు. మేడిపూర్ సమీపంలోగల వేపూరులో ఈ వంశానికి చెందిన పాపయ్యగారు ఒకసారి పాలెంలోని అచ్చన్న కొడుకు హన్మంతున్ని చూసి పిల్లవాడు తెలిగివిగా, చురుకుగా కనిపిస్తున్నాడని వారి తండ్రిగారిని అడిగి తీసుకెళ్ళి విద్యావంతుణ్ణి చేయడం వల్ల అతనికి వేపూరుతో సంబంధం కలిగింది. ఆ తర్వాత వేపూరులోనే స్థిరపడ్డాడు.

**హనుమద్దాసు గారి ఆధ్యాత్మిక జీవనం**

హనుమంతుకు బాల్యం నుండే భక్తి భావం కలిగింది. దానికి తాతగారి సంగీతజ్ఞానం తోడై బాల్యంలోనే చక్కగా పాడటం నేర్చుకున్నాడు. పాపయ్యగారు నేర్పిన చదువుతో అంతవరకే హనుమద్దాసులో సంకీర్తనా ధోరణి ఉంది కాబట్టి అతనిలో ఉన్న కవితాకళ వికసించడం మొదలు పెట్టింది. కవిత్వానికి, పాండిత్యానికి ఏ సంబంధం ఉండదు. కవిత్వం అనేది ఒక సహజాతం, పాండిత్యం అలా కాకుండా శ్రమ సాధ్యం. అది గురువుల సాన్నిధ్యం వల్ల కలుగుతుంది. అది కవిత్వానికి తోడైతే ఆ కవిత్వం రాణించి ఆ వ్యక్తి శుక్రతారగా ప్రకాశిస్తాడు. వేపూరి హనుమద్దాసు గారు పాలమూరు జిల్లాలో అటువంటి ధగద్ధగాయమానమైన సంకీర్తనాతార. ఆ కాలంలో యక్షగానాలు ఎక్కువ. పాపయ్యగారికి యక్షగానాలపై బాగా మక్కువ ఉండేది. ఆయన శిష్యుడైన హనుమద్దాసును యక్షగానాల్లో రాధా, సత్యభామ పాత్రలు వేయించి తాను పాడుతూ దాసుతో నాట్యం చేయించేవారు. ఇదోరకంగా హనుమద్దాసును మదురభక్తిలో ప్రవేశపెట్టింది. హనుమద్దాసు ఎల్లప్పుడూ తోటల వెంబడి, ఆవుల వెంబడిపడి తిరుగుతూ ఏకాంతం కోరుతుండేవాడు. బహుశా! ఆయన కవిత్వం అంతగా ప్రజల్ని ఆకట్టుకోవడానికి ఈ ఏకాంత వనవిహారంతో కలిగిన ప్రకృతి తాదాత్మ్యం కారణం కావచ్చు.

**హనుమద్దాసుగారి వైవాహిక జీవితం**

మానవునికి భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు పుట్టుకతో రావల్సినవే గాని, ఒకరు చెప్తే వచ్చేవి కావు. జిల్లాలో అలా సంసారం అనే చీకటి

నుండి బయటకి వచ్చిన వారిలో రాకమచర్ల వేంకటదాసు, వేపూరు హనుమద్దాసు అనే ఇద్దరు సంకీర్తనకారులు ముఖ్యులు. వీరికి పుట్టుకతో వైరాగ్యం కలిగింది. కానీ తల్లిదండ్రులు తమ సంతానానికి తగిన వయస్సు వచ్చిన తర్వాత వివాహం కాకుంటే అదొక న్యూనతగా భావిస్తారు. హనుమద్దాసుకు తల్లిదండ్రులు బలవంతంగా నాగనూలు నుండి లక్ష్మమ్మ అనే కన్యను తెచ్చివివాహం చేశారు. హనుమద్దాసు ఇతరుల ఒత్తిడికి తలొగ్గి వివాహం చేసుకున్నారు. సంసార బంధంలో తగుల్కొన్న వాళ్ళను ఆయన బాగా గమనించాడు. **"ఆహాహా! సంసార ఆపద తంటా!! వోహెూహెూ ప్రతివాణ్ణి వదలదదింటింటా"** అని సామాన్యులు సంసారస్థితిని చక్కగా తన కవిత్వంలో కళ్లకు కట్టినట్లు వెంట వెంట రెండు కీర్తనలు చెప్పాడు.


### హనుమద్దాసుకు గురువులతో గల అనుబంధం


మానవుని పుణ్యవంశంగా కలిగిన జ్ఞానవైరాగ్యాలకు తగిన గురువు లభిస్తే అతడు మేరు శిఖరాలకు చేరుకొంటారు. అట్లాంటి అదృష్టం వేంకటదాసు గారికి కలిగింది. కాని హనుమద్దాసుకు లభించలేదు. ఒకసారి సంగమేశ్వరంలోని గోష్టిలో నూకల చంద్రయ్య, సాతాపురం సింహయ్య, వేపూరు హనుమద్దాసును కలుసుకున్నారు. అప్పుడు చంద్రయ్య గారు హనుమద్దాసు ధోరణి చూసి నీవు గురుపాదం పట్టలేదు, ఎంత సాధన కల్గినా గురువు లేనిది అది సార్థకం కాదు అన్నాడు. కాని దాన్ని హనుమద్దాసు గారు అంగీకరించలేదు. గురువుల సేవ పేరుతో శిష్యులతో తమకు కావల్సిన చాకిరి అంతా చేయించుకొంటారు అని ఆయన గురువుల జోలికి పోకుండా విద్యా గురువును మాత్రమే గురువుగా పెట్టుకొని గురుపుత్రుల గోష్ఠులతోనే వేదాంత జ్ఞానాన్ని సంపాదించుకున్నాడు.

### హనుమద్దాసుగారి మహిమలు

హనుమద్దాసు గురించిన అనేక కథలు, గాథలూ ప్రచారంలో ఉన్నాయి. ఒకసారి ఊళ్లలో విషజ్వరం ఏదో ప్రబలింది. ఊళ్ళు ఊళ్ళు జ్వరం వాతపడి జనం హడలి పోతున్నారు. అప్పుడు హనుమద్దాసు యోగ సమాధిలో కూర్చొని ధ్యానం చేసి ఒక కాషాయం జెండా తీసుకెళ్ళి ఊరి పొలిమేరలో పాతి విషజ్వరాన్ని ఈ జెండా దాటి రావడానికి వీల్లేదని ఆజ్ఞాపించారట. అంతే ఆ నాటినుండి జ్వరం వస్తే ఒట్టు.

మరొక సంఘటన భక్తులంతా ఆలయంలో గుండ్రంగా కూర్చున్నారు. మధ్యలో హనుమద్దాసు గారు రామనామ సంకీర్తన జరుగుతోంది. హనుమద్దాసు గారు యోగ నిద్రలోకి వెళ్ళిపోయారు. భజన జరుగుతోంది. మెల్లిమెల్లిగా హనుమద్దాసు పద్మాసనం వేసుకొని ఉండగానే శరీరం మెల్లిగా గాల్లోకి లేవడం ప్రారంభించింది. భక్తులు సంభ్రమాశ్చర్యంతో చూస్తున్నారు. హారతి ఇచ్చి గంట వాయించారు. మెల్లిమెల్లిగా గాల్లోకెళ్ళిన హనుమద్దాసు గారి శరీరం కిందికి దిగింది.




భక్తులంతా పాదాలమీద పడ్డంతో హనుమద్దాసు లేచి మందహాసం చేసుకుంటూ మెల్లిగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

### హనుమద్దాసు గారి చివరి జీవితం

చివరిదశలో ఈయనకు మూత్రకృచ్ఛ్రవ్యాధి సంభవించింది. అందుకొరకు నవాబ్‌పేటలో ఒక ఫాదర్ ఉండగా చికిత్స కోసం వెళ్ళి చెన్నదాసు అనే శిష్యుని ఇంటిలో ఉన్నాడు. హనుమద్దాసు 95 సం. జీవించి 13 మే 1947 సర్వజిత్తు జ్యేష్ట బహుళ అష్టమి మంగళవారంనాడు స్థూల శరీరం వదిలి పెట్టారు.

### వేపూరు హనుమద్దాసు రచనల పరిచయం

హనుమద్దాసుగారి రచనలు చిన్నవి, పెద్దవి కలిపి 13 దాకా ఉన్నాయి. శ్రీ వేపూరు హనుమమద్దాసు 'శ్రీరామ కీర్తనలు', 'వేపూరు శారద రామాయణం', 'వేపూరు హనుమమద్దాసు బతుకమ్మ పాటలు' 'బహద్దూరు వేపూరు రామమూర్తి శతకము', 'వేపూరు హనుమద్దాసు బొబ్బిలి పాటలు', 'సీతా కల్యాణము', 'వాలి వధ', 'వేపూరు హనుమద్దాసు వేపూరు కృష్ణలీల' ఇవి ముద్రిత రచనలు. యయాతి చరిత్ర, పుత్ర కామేష్టి అముద్రితము.

### 1. వేపూరు హనుమమద్దాసు శ్రీరామ కీర్తనలు

హనుమద్దాసు రచనలన్నింటిలో కీర్తనలే బాగా ప్రసిద్ధి పొంది పలుసార్లు ముద్రింపబడ్డాయి. వీరి కీర్తనలు శాలివాహనశకం 1884 అంగీరస నామ సంవత్సరం చైత్ర బహుళ చవితి (11-08-1932) నాటి తేదీతో మొదటిసారిగా గద్వాల మహారాణి ఆదిలక్ష్మిదేవి సహాయంతో అచ్చువేసినట్లు 482 కీర్తన ద్వారా తెలుస్తుంది.

పల్లవి : అచ్చు గ్రంథమూగా జేసి రాహా హాహా కీర్తనల్
లక్షణంబు గాను సీతరామ కరుణ మేల్ మేల్
॥ అచ్చు ॥

1. అంగీరస సంవత్సర చైత్ర బహుళ చవితిన్
రంగు మీరగాను రఘురాము నీ కృపా క్షితిన్
॥ అచ్చు ॥

2. యెలమి పద్దెనిమిది నూటయాభై నాల్గో శకమున్
దరలు శాలివాహన నీ గద్వాలలో నమ్ముదమునన్
॥ అచ్చు ॥

3. ధర వేపూరు హనుమద్దాసు దైవ కృప గోరగా
అరయ ఆదిలక్ష్మీ దేవమ్మయు మహారాణిగా
॥ అచ్చు ॥

హనుమద్దాసు కీర్తనలను గద్వాల రాణీ లక్ష్మీదేవమ్మ ముద్రించినందుకు కృతజ్ఞతగా మొదటి పుటలో వారిని గురించి హనుమద్దాసు పేర్కొన్నాడు. **"గద్వాల సంస్థానాధీశ్వరులగు శ్రీమంత మహారాణి శ్రీశ్రీశ్రీ ఆదిలక్ష్మీ దేవమ్మ బహద్దరు గారి యాజ్ఞానుసారముగా బ్ర.వే. భాస్కరం సుబ్బావధానుల వారి స్వకీయ శ్రీ లక్ష్మీ ముద్రాక్షరశాల యందు ముద్రింపించి ప్రచురించబడియె"** అని చెప్పుకొన్నారు. ఈ ముద్రణ విషయం గురించి ఆనాటి నైజాం ప్రభుత్వాన్ని పుస్తక ప్రచురణకు అనుమతి తీసుకున్నట్లు తేదీలతో సహా పుస్తకం ముందు పుటల్లో ఉన్నది. గద్వాల మహారాణి సహాయంతో ముద్రించిన తర్వాత చాలాకాలం నుంచి శ్రీ సిద్ధేశ్వర పబ్లికేషన్స్ హైదరాబాద్ వారు ప్రచురించారు. వీరు ప్రచురించిన పుస్తకానికి ముందుమాటలు రాసిన వారు బ్రహ్మశ్రీ పరాంకుశశర్మ, బ్రహ్మశ్రీ వేపూరు అనంతరామయ్య, మరాశ్రీ కప్పెట రాంచంద్రారెడ్డి దేశముఖ్, పట్వారి తుమ్మల సూగూరు వెంకటేశ్వరరావు, పట్వారి వేపూరు బుగ్గయ్య గార్లు. ఈ పుస్తకంలో 478 కీర్తనలు ఉన్నాయి. 2021లో వేపూరు హనుమద్దాసు శిష్యబృందం దాయపంతులపల్లి, వేపూరు వారు అకారాది క్రమంలో వేపూరు హనుమద్దాసు కీర్తనలను శ్రీరామ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, మహబూబ్ నగర్ వారిచే ప్రచురించారు ఇందులో 490 కీర్తనలు ఉన్నాయి. ఈ పుస్తకానికి పల్లెర్ల రామమోహనరావు, డా.పి. భాస్కరయోగి గార్లు ముందుమాటలు రాశారు.

మన్నెంకొండకు వెళ్లి తపస్సు చేస్తే శ్రీరాముడు ప్రత్యక్షమై కీర్తనలు రాయమని ఆదేశించారని, దాంతో హనుమద్దాసులో సంకీర్తన రచనాశక్తి జాగృతమైందని ఆయన జీవితం వల్ల తెలుస్తుంది. హనుమద్దాసు కీర్తనలో లోకంలో ఎన్నో భావాలు భావస్ఫూర్తితో తొంగి చూస్తుంటాయి. హనుమద్దాసు భక్తకవే గాక వేదాంతి కూడా. అయితే ఇతనిలో భక్తిపాలే ఎక్కువ. ఇతని కీర్తనల్లో 243 వరకు పై విధంగా వివిధ భావాలతో పరుగులు పెట్టి ఆ తర్వాత 294 వరకు అనగా 52 కీర్తనలు తాత్త్విక విచారంలో నడిచి, అక్కడి నుంచి 478 వరకు మళ్ళీ భక్తి ప్రపూరితంగా కన్పిస్తాయి. చివరగా 490 వ దిగ్బంధన కీర్తన రచించారు. హనుమద్దాసు గారిది దేశీయమైనశైలి. హనుమద్దాసు కీర్తనల్లో అచ్చమైన పాలమూరు పలుకుబడులు కనిపిస్తాయి.

హనుమద్దాసు రామకీర్తనలు భక్తిరస పూరితమై తెలుగు రాష్ట్రాల్లో అంతటనూ అనగా కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కృష్ణ, కాకినాడ, బందరు, మద్రాసు మొదలగు జిల్లాలో నైజాం రాష్ట్రంలో శ్రీ భద్రాచలాది పుణ్యక్షేత్రాదుల యందు కూడా వ్యాపించి వన్నెకెక్కినవి. ఇప్పటికీ వీరి కీర్తనలు తెలుగు రాష్ట్రాలలో పల్లెటూర్లలో రాత్రి భజన సమయంలో పాడుతూ ఉంటారు.

**వేపురు హనుమద్దాసు ప్రసిద్ధ కీర్తనలు**

1. ఆటలాడుదామా రాముని పాట బాడుదమా – 78
2. ఎవరు దగ్గర దీతురు నన్నెవరూ మన్నన సేతురు – 145
3. రామా నీ దయ రాక పాయెనా నన్ను – 207
4. బూటకుందు – శివపూజ చేసిన బుద్ధిమంతుడగునా – 272
5. ఎందుకు జన్మించితి కలియుగమూనా – 303

**2. వేపూరు శారద రామాయణం**

వేపూరు శారద రామాయణం హనుమద్దాసు రచనల్లో ఇది చెప్పుకోదగ్గది. వాగ్దేవి పింటర్స్ హైదరాబాద్ వారు సెప్టెంబర్ 2007లో 69 పుటల్లో ప్రచురించారు. ఇందులో అంత్యప్రాసలతో సుదీర్ఘ పాదాలతో నడిచే గేయాలు ఉన్నాయి లెక్కలేనన్ని చరణాలు ఉన్న పల్లవి మాత్రం ఒకటే ఉంది. ఈ శారద రామాయణంలో హనుమంతుడు శ్రీరాముడు సీతను వెతకాలని చెప్పడంతో కథ ప్రారంభమవుతుంది. అంతకంటే ముందు సరస్వతిని, గణపతిని, త్రిమూర్తులను ఆదిశేషుని రూపమైన లక్ష్మణుడిని, వ్యాస, నారదులను, పోతనాది కవులను, విద్యాగురువు పరాంకుశశర్మను ప్రస్తుతించి మొదలుపెట్టాడు. శారద రామాయణం శారదకాండ్ర పాటలాగా రచించాడు. మొదట రామాయణ లక్షణము శీర్షికతో అయోధ్య నగర వర్ణన నుండి సుగ్రీవునితో రామమైత్రి వరకు ఒకే పాటలు ప్రస్తావించి ఆ తర్వాత నేరుగా సుందరాకాండతో శారద రామాయణం ప్రారంభం చేశాడు.

అంగ దారులు సీతను వెదుకుట, వానరులు లవణాబ్ధి గని చింతిల్లుట, హనుమానుడు వనధి లంఘించుట, ఆంజనేయులు లంకను వర్ణించుట, లంఖిణి వధ, ఆంజనేయులు సీతను వెదుకుట, శృంగారవనము, రావణుడు సీత సన్నిధిజేరుట, రాముడు సీతను జంపనుకించుట, దానవులు సీతతో బలుకుట, దానవులు సీతను వెరపించుట, సీత రాముని దలచి శోకించుట, మారుతి వృక్షంబు నుండి సీతతో భాషింపుట, మారుతి పలుకులకు సీత యోచించుట, సీత మారుతిని సన్నిధికి బిలుచుట, హనుమానుడు వృక్షంబు దిగుట, సీత వుంగరము గని దుఃఖించుట, సీత మారుతిని మెచ్చుకొనుట, సీత రాముని గూర్చి శోకించుట, మారుతి సీతకు నిజరూపు జూపుట, ఆంజనేయుడు వనము విరచుట, మారుతిచే వనపాలకులు మడియుట, దానవులు రావణునకు మారుతి సంగతి దెలుపుట,

రక్కసులు మారుతిని దేనుబోవుట, హనుమంతుచే రక్కసులు మడియుట, గతశేషులు రావణునితో వచించుట, రావణుడు జంబుమాలిననుపుట, రావణుడు చింతిల్లుట, రావణుడు ఇంద్రజిత్తుననుపుట, దానవులు మారుతిని బట్టి తెచ్చుట, రావణ – హనుమ సంవాదం, రావణుడు మారుతిని దునుమ బోవుట, విభీషణ వాక్యం, దానవులు హనుమానుని వాలము దగిలించుట, మారుతి కోపించుట, మారుతి లంకను దగిలించుట, దానవులశోకము, సముద్రుని వాక్యం, మారుతి తిరుగా సీత కడకేగుట, హనుమంతుడు కపుల సన్నిధి జేరుట, వానరులు సుగ్రీవుని తోటకు వేగుట, వానరులు శ్రీరాముని జేరుట, రామునకు మారుతి సీత సంగతిని దెలుపుట, ఈవిధంగా చిన్న శీర్షికలతో వేపూరు శారదా రామాయణము సుందరకాండ రచించారు.


తర్వాత యుద్ధకాండను ప్రారంభించాడు. ఇందులో విభీషణుడు రావణునకు నీతినిదెల్పుట, విభీషణుడు శ్రీరామునిజేరుట, వానరులు వార్ధి గట్టుట, కపులు శుకచారిణుల బాధించుట, అంగదుడు రావణునితో భాషించుట, వానరులకు దానవులకు ప్రథమ యుద్ధము, వానరులు రక్కసుల దునుముట, రామరావణుల ప్రథమ యుద్ధము, కుంభకర్ణుడు యుద్ధము కేగుట, కుంభకర్ణవధ, ఇంద్రజిత్తు ద్వితీయ యుద్ధము, ఇంద్రజిత్తు మాయ సీతను దునుముట, ఇంద్రజిత్తువధ, లక్ష్మణమూర్ఛ, రాముడు లక్ష్మణునకు వగచుట, మారుతి సంజీవికేగుట, పాతాలహోమ విఘ్నము, రామరావణుల తృతీయ యుద్ధము, రావణవధ, మండోదరి మొదలగు సతులు రావణుని జేరుట, విభీషణ పట్టాభిషేకం, విభీషణుడు సీతను రాముని కడ గొనిపోవుట, సీత అగ్ని ప్రవేశమగుట, అనలుని వాక్యం, దశరథుడు రామునితో దర్పు, ఇంద్రుడు మృతవానరుల లేపుట, రాముడు మారుతిని భరతునికడకు అనుపుట, శత్రఘ్నుడు అయోధ్య నలంకరించుట, భరతాదులు రామునకెదురేగుట, రామాదులు నందిగ్రామం ప్రవేశించుట, రామాదులు అయోధ్యకేగుట, శ్రీరాముని పట్టాభిషేకము. శ్రీరాముని సభ, రామరాజ్యము, చివరగా మంగళహారతితో యుద్ధకాండతో వేపూరు శారదరామాయణం పూర్తి అవుతుంది.

హనుమద్దాసు గారు గ్రామీణ ప్రాంతాల్లో సంచరించాడు కాబట్టి అక్కడి జానపదులకు అర్థమయ్యే రీతిలో శారదరామాయణం రచించాడు. ఇందులో ఎన్నో దేశీయ పదాలు, పాలమూరు ప్రాంతంలోని పలుకుబడులు, మాండలికాలు మనకు కనిపిస్తాయి.

### 3. వేపూరు హనుమద్దామ బతుకమ్మ పాటలు

వేపూరు హనుమమద్దాసు బతుకమ్మ పాటలు అనే 14 పుటల చిన్న పుస్తకాన్ని బెక్కర గ్రామానికి చెందిన వడ్లపల్లి పర్వత్ రెడ్డి ఆర్థిక సహకారంతో ద్రావ్యా గ్రాఫిక్స్ హైదరాబాద్ వారు 2008లో




ప్రచురించారు. రామాయణంలో చదివిన ఘట్టాలను లేదా తెలిసిన ఘట్టాలను బతుకమ్మ పాటగా రచించారు. ఈ పుస్తకం పుట 9లో తేది 28-8-1945 నాడు అని పేర్కొని, **"వేపూరు బతుకమ్మ పాటలు హన్మద్దాసులవారు వ్రాసిరి సొంతం"** అని ఉంది. తెలంగాణలో హనుమద్దాసు రచించిన రామాయణ బతుకమ్మ ద్వితీయ స్థానంలో నిలుస్తుంది. ఇందులో కొంతభాగం ఉయ్యాలో అనీ, మరికొంతభాగం వలలో అని సాగింది. ఇందులో రామాయణం మొత్తం చెప్పకుండా పుత్రకామేష్టి ప్రారంభం, విశ్వామిత్ర యాగరక్షణ, తాటకి వధ, క్రతువారంభం, యజ్ఞ వైరుల కథ, రాముడు ధనువెత్తుట, దశరథుల మిథిల ప్రవేశము, వొప్పగింతలు, దశరథుడయోధ్య కేగుట, పరశు రామగర్వశాంతి వరకు రాసి నేరుగా ఉత్తరరామాయణంలోకి ప్రవేశించాడు. దీనిలో కుశలవకథ, వాల్మీకి సీతను దర్శించుట, వాల్మీకి లవసుతుని జేయుట, శ్రీరాములు అశ్వమేధ యాగము జేయుట, కుశుని దుఃఖము, శ్రీరాముడు కుశలవులచే మూర్ఛిల్లుట, చివరిగా మంగళహారతితో ఈ రచన పూర్తి అవుతుంది. హనుమద్దాసు బతుకమ్మ పాటకు మంగళహారతి రచించడం మరొక విశేషం.

**"అంతు లేని ప్రేమ ఉయ్యాలో, వరహనుమద్దాసు ఉయ్యాలో, పాలింపబూనితి వలలో, ప్రఖ్యాతిగనినావు ఉయ్యాలో, సీతమ్మవారికి ఉయ్యాలో, శ్రీరామమూర్తికి ఉయ్యాలో, భూమిజ చెలియలకు ఉ య్యాలో, రామానుజులకు ఉయ్యాలో, హరిదసవరులకు ఉయ్యాలో, ఆంజనేయులకు ఉయ్యాలో, జయజయ మంగళం ఉయ్యాలో, జయశుభ మంగళం, ఉయ్యాలో"**

### 4. బహద్దూరు వేపూరు రామమూర్తి శతకము

బహద్దూరు వేపూరు రామమూర్తి శతకాన్ని బెక్కర గ్రామానికి చెందిన చాకలి తిరుపతయ్య, బాసెమోని లచ్చన్న, తోటపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి వేమారెడ్డి, పసుల మల్లారెడ్డి ఆర్థిక సహకారంతో ద్రావ్యా గ్రాఫిక్స్ హైద్రాబాద్ వారు 30 పుటల పుస్తకాన్ని 2008లో ముద్రించారు. ఈ పుస్తకాన్ని బెక్కర గ్రామానికి చెందిన శ్రీ దామోదర్‌రెడ్డి గారు పరిష్కరించారు. ఇందులో 115 సీసపద్యాలు

– పూర్వ ధర్మము, దైవ స్తుతి, దైవ సహాయము, శక్తి స్థవము, దైవబలం, దాత, కొడుకు, రాజులు, ధర్మ, చుప్పనాతి, చింత, పెండ్లి, సీతాఫలము, గొంగడి, చోర్ కుత్త, సినిమా, పొగబండి, కరణము, బ్రాహ్మణుడు, పరబ్రహ్మస్తవము, శీర్షికలతో ఉన్నాయి. ఈ శతకం కూడా అంత్య ప్రాసలతో, మధ్యమధ్యలో పాలమూరు పలుకుబళ్లతో సాగిందని చెప్పవచ్చు.

**5. వేపూరు హనుమద్దాసు బొబ్బిలి పాటలు**

వేపూరు హనుమద్దాసు బొబ్బిలి పాటలను శ్రీ సాయి లక్ష్మి రైస్ ఇండస్ట్రీస్, మిసెస్ రాజ్యలక్ష్మి రైస్ ఇండస్ట్రీస్ హైదరాబాద్ వారు రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులైన శ్రీ అమరవాది లక్ష్మీనారాయణ గారు, కొండూరు లింగయ్య, కొండూరు శ్రీనివాస్, కొండూరు గోవర్ధన్, సూరిశెట్టి శ్రీనివాస్, ఉప్పు బాలస్వామి వారి ఆర్థిక సహకారంతో శ్రీసాయి ప్రాసెస్ హైదరాబాద్ వారు 2008లో ప్రచురించారు. ఈ పుస్తకాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ కె. రుక్నుద్దీన్ గారు పరిష్కరించారు. 55 పుటల ఈ పుస్తకంలో నాటి ప్రసిద్ధ బొబ్బిలి యుద్ధం వీరోచితంగా ప్రదర్శించారు హనుమద్దాసు. ఈ ప్రసిద్ధ వీరగాథను హనుమద్దాసు స్వీకరించి తందానకథ పద్ధతిలో నడిపించాడు. హనుమద్దాసు ఇందులో తన పరిచయం చేసుకొన్నాడు.

రఘురామ రఘురామ రామకోదండ రఘురామ అని ప్రారంభం చేసి ఈ తరవాత తన వివరాలన్నీ పాటలో పొందుపరిచాడు.

"శ్రీకరంబుగను మనవి జేతు సజ్జనుల మోదమూనా
సే(శే)ఖరంబుగను తెలియుడంత నైజాం యిలాకాలోన
జోకతోడ వుస్మానుద్దౌల హుజూర్ ప్రభుత్వమూనా రామా
రామరామశ్రీరామ
భూరికీర్తి మహబూబ్ నగర్ జిల్లా తారీపెంతో దోచు
కలూవకుర్తి తాలూకా లోకప్రఖ్యాతి ప్రేమదాసూ
వూరు వున్కి వేపూరు నాది నాపేరు హనుమద్దాసూ
రామరామశ్రీరామ
వాసిగాను కవి ఉర్దూ తెలుగులో వ్రాసినాడ కొన్నీ
జూచి మెచ్చినరు పండితోత్తములు సొంపు గానవన్ని
హాయిగానూ రామార్పణంబు నే జేయు చేష్టలన్నీ
రామరామశ్రీరామ
పూర్వయుద్ధమున బొబ్బిలోండ్లదొక పుస్తు(స్త)కంబుజూచీ
చదువబూనినందుండు శబ్ద నిస్సారమునకు రోసీ
ధీరబుద్ధి గల బొబ్బిలోండ్లపై కూర్మిమాత్మ దోచీ
రామరామశ్రీరామ
వాలాయంబుగ బొబ్బిలీ కథను వ్రాయుచున్న వినుడూ"

బొబ్బిలి కథ రాయడానికి కూడా కారణాలు చెప్పాడు. బొబ్బిలికథ సుప్రసిద్ధం, ప్రక్రియ జానపదం, తంబురామీద చెప్పే వరుసలు. కోడిపందెం, బూచిదొర బొబ్బిలి దేశము పోవుట, బూచిదొర సహ విజయరామరాజు బొబ్బిలి ముట్టడించుట, బొబ్బిలి తెనుగుల యుద్ధం, ధర్మరాయుని యుద్ధం, ఉత్తరం, పటాల రామన్న యుద్ధం, కోమటి స్త్రీల యుద్ధం, ముత్యాల పాపయ్య యుద్ధం, వెంగళ రాయుని యుద్ధం, దర్వులు, రంగారావు యుద్ధం, వెంకటలక్ష్మమ్మ పాపరావును జేరుట మొదలైన ఉపశీర్షికలతో కథ సాగింది.

వెలమలను, తెలుగులను, కోమటి స్త్రీలను ధైర్య స్థైర్యవంతులుగా చిత్రించినారు. దుబాసి లక్ష్మయ్య, ఫ్రాంసి దొరలాంటి పాత్రలను చమత్కారంగా ప్రవేశపెట్టినారు. రచనలో కొన్ని ఘట్టాలకు ఘట్టాలే పూర్దూలో చెప్పడం, నాటి వుర్దూ ప్రాబల్యానికి ఉదాహరణగా గ్రహించవచ్చు.

రచనలో, జోరుదారూ, తీటలేసి, యేటుదెబ్బ, అరసున్న ప్రయోగం, కండ్లు కోడిగుడ్లూ, అసిదెబ్బయేటూ, ఇఘ, ములాహిజా– మొహబ్బత్, సమఝ్ జెప్పడం, వీణి, వైలాది, వుట్లువూగినట్లు డొక్కలల్లాడే, రండముండలు, వడిసేల, లగులు, హాత, గోసిలేరుక్కొని, తాలుమాటలు, గుల్బ మొదలైన ప్రాంతీయ పదాల ప్రయోగం ఆత్మీయతనందిస్తుంది.

**6. శ్రీ వేపూరు హనుమద్దాసు వేపూరు కృష్ణలీల**

వేపూరు కృష్ణలీలలను మొదటిసారిగా సిర్సవాడ వాస్తవ్యులైన కీర్తిశేషురాలు శ్రీమతి అమృతమ్మ దేశాయినిగారు అచ్చు వేయించినారు. తర్వాత వేపూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ల రామలక్ష్మయ్య గారు 2022లో మార్వెల్ యాడ్స్ హైదరాబాద్ వారిచే ద్వితీయ ముద్రణ వేయించారు. పోతన కృతియైన శ్రీమదాంధ్ర మహాభాగవతము నందు పద్య గద్య వచనాలతో నిండియున్న "శ్రీకృష్ణరాసలీలలను" మనకు ఇప్పటి జనులు ఆటరూపంగా ఆడిపాడుకొనుటకు కందార్థ, దర్వులతో భాగవత యక్షగాన రూపకంగా మనకు అందించినారు. ఇది యక్షగాన కవిత్వం కాబట్టి సరసంగా, సారవంతంగా ఉంది. గురువు పరాంకుశశర్మ ఆదేశం మేరకు హనుమద్దాసు స్వయంగా సత్యభామ, రాధ పాత్రలు ధరించాడు. కాబట్టి ఇందులో లీనమై రాసి ఉంటాడు. శ్రీకృష్ణ లీలల్లో గోపికా వస్త్రాపహరణం ఉంటుంది. కాబట్టి దానిని 'జలక్రీడలు' అని కూడా పిలుస్తారు. మధురభక్తి రసాన్వితమైన భాగవతంలోని మధురఘట్టం జలక్రీడలను తన కవితావస్తువుగా ఎన్నుకొన్నాడు.

హనుమద్దాసు ఉర్దూ మిశ్రిత తెలుగు బాగా వాడాడు. తాను రచించే విషయం పురాణ ప్రోక్తమైనా ఉర్దూ పదాలతో తెలుగును కలుపడంవల్ల అదో క్రొత్త భాషలా ఉండేది. హనుమద్దాసు తన రచనల్లో ఎలా విస్తృతంగా ఉర్దూ పదాలను వాడినాడో జలక్రీడలు

యక్షగానంలోని ఈ పాట చూస్తే అర్థం అవుతుంది.

**"బజారే మురలీ – బజారే కృష్ణ,**
**ఆజారే ఖుషీపర్ హమారేఘర్ బజారే**
**వజీర్ హెూతుం వైకుంఠ్ మాలిక్,**
**మురేఖ సునాదో మజా సేఫిర్ బజారే**
**మిలాకే శక్కర్ మేవాపంపలేదూధ్**
**పిలాతే ప్రేమే సే– బిలాహుజర్ బజారే"**

అలాగే ఇందులో పాత్రోచిత భాషను హనుమద్దాసు ప్రవేశ పెట్టినాడు. ఈ పాటలు యక్షగాన ప్రదర్శనలోనే గాకుండా సాధారణమైన సమయాల్లో ఆసక్తిగలవాళ్లు పాడుకోవడానికి అనుకూలంగా ఉండేవి.


"ఎట్లెట్లు బలిసినాయ్ చూడరా ఆవు లెట్లెట్ల బలిసినాయ్ చూడరా
గట్లెగ బాకుతాయ్ గంతులేసి దుంకుతాయి" ఎట్లెట్లు
దర్వు – రాజగోపాలా సుశీలా రాజిత గుణజాల
గోపాలా త్రిజగపాలా దివిజఖేలా
దేవముని విలోలా – విమల దీనదయాలవాల–
చిత్కళా రాజగోపాలా
కారణాకార కలుషవిదూర ఘోర దురితదూరా
సుందరకోమల సుకుమార రాజగోపాలా

ఇలా కవిత్వాన్ని రాసి, అద్భుతమైన అంత్యప్రాసలతో కూడిన సంస్కృత శబ్ద పరిజ్ఞానాన్ని సామాన్య జనంలోకి తీసుకెళ్లాడు. ఇలాంటివి హనుమద్దాసు రచనల్లో లెక్కకు మిక్కిలిగా మనకు కనిపిస్తాయి.

### 7. సీతా కల్యాణము, వాలి వధ

సీతా కల్యాణము, వాలి వధను బెక్కెర గ్రామానికి చెందిన దారెడ్డి బాల్‌రెడ్డి, దారెడ్డి వెంకట్ రెడ్డి, వనపర్తికి చెందిన కల్వాల సుభాష్ గార్ల ఆర్థిక సహకారంతో శ్రీ రామ ఆఫ్ సెట్ ప్రింటర్స్ మహబూబ్ నగర్ వారు 2023లో మొదటిసారిగా ముద్రించారు. ఇందులో 100 పుటలు ఉన్నాయి. ఈ పుస్తకానికి దాయపంతులపల్లికి చెందిన మేకల ఆంజనేయులు గారు ముందుమాటలు రాశారు.

సీతాకళ్యాణమునందు ప్రారంభమున గల మూడు, నాల్గు పేజీలు లభ్యము కాలేదు. చినిగిపోయినవి. అందులో మొదలు ఇంద్రసభ వర్ణనము నుండి వైకుంఠుడు దేవతల ప్రార్థనతో అయోధ్యనందు జన్మింతునని అభయమొసంగుట, వశిష్ఠమహాముని ఆజ్ఞానుసారము పుత్రకామేష్టి యాగము చేయుట, యజ్ఞఫలముగా దశరథునకు తన ముగ్గురి భార్యల ద్వారా రామ లక్ష్మణ భరత శత్రఘ్నులు జన్మించుట, బాల్యము నందు వశిష్ఠముని దగ్గర విద్యాభ్యాసము చేయుట, శస్త్ర విద్యలు నేర్చుకొనుట జరుగును. పిదప కుమారులు పెద్దవారైన




సమయములో విశ్వామిత్రుడు తన వెంబడి రామలక్ష్మణుల పంపమని దశరథుని కోరుట, తండ్రి రాముని యువరాజుగా నియమించుటకు సభలో తెలుపుట, వశిష్ఠుని ఆజ్ఞమేరకు తండ్రి అనుమతితో కౌశికునెంబడి వనము కేగుట, తపసి యాగము గాచుట, రక్కసుల వధించుట, జనకుని ఆస్థానము జేరి శివవిల్లు విరచి సీతను పరిణయమాడుట రామాయణంలోని సీతాకళ్యాణములో ఉన్నవి.

రెండవది అయిన వాలివధ కథలో రాముడు సీతావియోగ దుఃఖ భరితుండై అడవులందు వెదుకుట, జటాయువు రావణుచే వధింపబడి యుండుట, జటాయువు రామలక్ష్మణులకు సీత వార్త దెలుపుట, శబరికి మోక్షమొసంగుట, కబందుని సంహరించుట, రామలక్ష్మణ, హనుమంతుల కలయిక, సుగ్రీవుని చెల్మి, వాలి సుగ్రీవుల వైరము తెలుపుట, రామసుగ్రీవులు అగ్నితో బాసచేయుట, రాముడు వాలిని వధించుట, తారాదేవి దుఃఖించుట, వాలి రాముని నిందించుట, తార రాముని శపించుట, అంగదుడు విలపించుట, వాలి అంగదుని రాముని చేతిలో నుంచుట, వాలికి రాముడు ముక్తి నొసంగుట, తార క్షమింపమని రాముని వేడుకొనుట రామాయణంలోని వాలివధలో ఉన్నాయి.

### ఉర్దూ రచనల వివరాలు

ఇంద్రకల్‌లో ఉన్నప్పుడు ప్రారంభమైన శూలనొప్పి నివారణకోసం దాయపంతులపల్లికి చేరి అక్కడనే హనుమద్దాసు అనేక కీర్తనలు ఉర్దూలో రచించారు. వీటి లిపి తెలుగులో ఉంది. విషయమంతా ఉర్దూ భాషలో ఉంది. ఉర్దూ కీర్తనలు 200లకు పైగా ఉన్నాయి. హనుమమద్దాసు జీవించిన కాలంలో ఉర్దూ రాజభాషగా ఉండేది కాబట్టి హనుమద్దాసుకు తెలుగుతో పాటు ఉర్దూ భాషలో కూడా ప్రావీణ్యం ఉండటం చేత ఉర్దూలో కీర్తనలతోపాటు నమాజ్ పుస్తకము, కందార్థముల ఘట్ట, శారద రామాయణం రచించారు. ఈ రచనలన్నీ ముద్రితం కావాల్సి ఉన్నది.

వేపూరు హనుమద్దాసు కీర్తనలపై మద్రాసు విశ్వవిద్యాలయంలో నేను 2016లో ఎం.ఫిల్ చేశాను. ఇంకా హనుమద్దాసు సమగ్ర సాహిత్యంలోని భక్తి, కవిత్వం, ఆర్తి, లోకరీతి, సంప్రదాయం, నడక, శైలి, భాష.. ఇలా ఎన్నో కోణాల్లో విశ్వవిద్యాలయాల్లో పరిశోధన జరగాల్సిన అవసరం ఉన్నది.

హనుమద్దాసు స్వగ్రామమమైన వేపూరులో సమాధి దగ్గర ఆయన తమ్ముని కొడుకులైన తెప్ప జంగయ్య, తెప్ప ఉమాపతి ఆధ్వరంలో ప్రతినెల 19న భజన జరుగుతుంది. హనుమద్దాసు శిష్యులంతా కలిసి మహబూబ్ నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం దాయపంతుల పల్లిలో సమాధి నిర్మించారు. ఇక్కడ ప్రతి పౌర్ణమికి, సంక్రాంతి మరుసటి రోజు అఖండ భజన జరుగుతుంది. ప్రతి సంవత్సరం జ్యేష్ట బహుళ అష్టమి రోజు ఆరాధన, అఖండ భజన జరుగుతుంది. వందలాది కీర్తనలతో ఎందరో హృదయాల నిండా ఈనాటికి భజన వస్తువుగా మారిన హనుమద్దాసు తెలంగాణా ప్రాంత సంకీర్తనా సాహిత్యంలో మణిపూసగా చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. హనుమద్దాసు, వేపూరు. 'శ్రీ వేపూరు హనుమమద్దాసు శ్రీరామ కీర్తనలు'. 2021, మహబూబ్ నగర్ : శ్రీ రామ ఆఫ్ సెట్ ప్రింటర్స్.

2. హనుమద్దాసు, వేపూరు. 'వేపూరు శారద రామాయణం'. 2007, హైదరాబాద్ : వాగ్దేవి ప్రింటర్స్

3. హనుమద్దాసు, వేపూరు. 'వేపూరు హనుమమద్దాసు బతుకమ్మ పాటలు'. 2008, హైదరాబాద్ : ద్రావ్యా గ్రాఫిక్స్.

4. హనుమద్దాసు, వేపూరు. 'బహద్దూరు వేపూరు రామమూర్తి శతకము'. 2008, హైదరాబాద్ : ద్రావ్యా గ్రాఫిక్స్.

5. హనుమద్దాసు, వేపూరు. 'వేపూరు హనుమమద్దాసు బొబ్బిలి పాటలు'. 2008, హైదరాబాద్ : శ్రీ సాయి ప్రాసెస్.

6. హనుమద్దాసు, వేపూరు. 'వేపూరు కృష్ణలీల-జలక్రీడ' 2022, హైదరాబాద్: మార్వేల్ యాడ్స్.

7. హనుమద్దాసు, వేపూరు. 'సీతా కల్యాణము, వాలి వధ'. 2023, మహబూబ్ నగర్ : శ్రీ రామ ఆఫ్ సెట్ ప్రింటర్స్.

8. దాయపంతులపల్లె, చన్నదాను. 'శ్రీ వేపూరు హనుమద్దాసార్యుల వారి జీవిత చరిత్ర'. 2021, మహబూబ్ నగర్ : శ్రీ రామ ఆఫ్ సెట్ ప్రింటర్స్.

9. భాస్కర యోగి, పి. 'వేపూరు హనుమమద్దాసు (మోనోగ్రాఫ్)'. 2017, హైదరాబాద్ : ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ, తెలుగు అకాడమీ.

❖ ❖ ❖ ❖ ❖

## శివ శంకరం (బ్రహ్మశ్రీ ముదిగొండ శంకర శర్మ గారికి)

నివాళి

డా. ఒజ్జల శరత్ బాబు, ఫోన్ : 99635 33937

శ్రీ సూర్యతేజస్సు శ్రీవాణి చిత్తంబు
  సౌందర్య రూపంబు నతని జాడ
సౌజన్య భావమున్ సౌహార్ద్ర భూతియున్
  ఆప్యాయ పలుకులె యతని జాడ
భారతీ పదములున్ పారమార్థిక బోధ
  ధర్మ మార్మిక దృష్టి యతని జాడ
వేదాంత వేద్యత వెరపు లేని తనము
  గురు భావ పూర్ణత లతని జాడ
క్రోధమే యధర్మము నందు నతని జాడ
తీవ్రతే గురు నిందనందతని జాడ
శిష్య వాత్సల్య శిఖరమే యతని జాడ
వేయి మాటలేల శివమె యతని జాడ

అతడు ముదిగొండ శంకరార్య ఘన శీల
వర్యుడెల్లరకు హితుడు భాస మాన
పూజ్యుడనుదిన స్మరణీయ పుంగవుండు
శాంకరీ హృదయ విలాస సారధరుడు


శృంగగిరి మానసాభి
జ్ఞాంగ నిరతచాలనుండు చైతన్య వరున్
భృంగారపు ముదిగొండ డ
భంగుడికిట్లంజలింతు భక్తియుతంబున్

(శంకర జయంతి నాడు శివైక్యం పొందిన ప్రముఖ వేదాంతవేత్త, జ్ఞాననిధి, భారతీతీర్థ పురస్కార గ్రహీతలు బ్రహ్మశ్రీ ముదిగొండ శంకర శర్మ గారికి నివాళిని అర్పిస్తూ...)

# పాలమూరు సాహితీ రైతు వల్లపురెడ్డి బుచ్చారెడ్డి

మొకరాల స్వర్ణలత

కరువు నేలపై సాహితీ సేద్యం చేసిన అక్షర శ్రామికుడు వల్లపురెడ్డి బుచ్చారెడ్డి. వలసల జిల్లాగా పేరుగాంచిన పాలమూరు జిల్లాకు రాయలసీమ నుంచి బుచ్చారెడ్డి కుటుంబం వలస వచ్చింది. కృష్ణానదికి అవల పెబ్బేరు గ్రామంలో బుచ్చారెడ్డి పూర్వీకులు స్థిరపడ్డారు. ఆధునిక కాలంలో పాలమూరు సాహిత్యం గురించి మాట్లాడుకోవాల్సివస్తే ప్రధానంగా ఇద్దరి గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. వారిలో ఒకరు కృష్ణానది అటు వైపున ఉన్న సురవరం ప్రతాపరెడ్డి కాగా.. మరొకరు నదికి ఇటువైపున ఉన్న వల్లపురెడ్డి బుచ్చారెడ్డి. అంతగా సాహిత్య కృషి చేసిన బుచ్చారెడ్డి బహుముఖ ప్రతిభావంతుడు. కథా రచయితగా, ప్రబంధ పరిష్కర్తగా, ఉపాధ్యాయుడిగా, జర్నలిస్టుగా, సంపాదకుడిగా ఇలా పలు విభిన్న పాత్రల్లో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు బుచ్చారెడ్డి. సహజంగానే ఉమ్మడి పాలనలో పాలమూరుపై అన్ని రంగాల్లో చిన్నచూపు ఉండేది. ఇక సాహిత్య రంగం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. అందులో మన బుచ్చారెడ్డి గారు స్వయంగా పేరు ప్రఖ్యాతులు కోరుకునే వారు కూడా కాదు. కీర్తి కండూతి ఏమాత్రం ఇష్టపడని వారు కావటం చేత..ఆయన గురించి జిల్లా వాసులకే సరిగా తెలీదు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన కృషి, సేవ చాలా కాలం వరకు మరుగునే ఉండిపోయింది. కథా సాహిత్యం గురించి మాట్లాడుకోవాల్సి వస్తే.. తెలుగు కథలో పాలమూరు భాగస్వామ్యం చాలా తక్కువ అనే అభిప్రాయమున్నది. వల్లపురెడ్డి బుచ్చారెడ్డి వంటి వారు ఎన్నో గొప్ప గొప్ప కథలు రాసినప్పటికీ అవి పెద్దగా ప్రచారం కాకపోవటం, స్వయంగా ఆయనకు ప్రచారం చేసుకోవటం ఇష్టం లేకపోవడం కూడా ఒక కారణంగా పేర్కొనవచ్చు. 1950వ దశకంలో వల్లపురెడ్డి బుచ్చారెడ్డి రచించిన కథలకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానమున్నది. పెద్దగా వర్ణనలు లేకపోయినా.. అతని కథలు మనసుకు హత్తుకుంటాయి. ఇతివృత్తాలు కూడా జన సామాన్యమైనవే కావటం, ఆయన పాత్రలన్నీ మన చుట్టు ముట్టు ఉన్నవే కావటం, ఒక రకంగా చెప్పాలంటే సగం కథలు ఆయన స్వానుభవంతో రాసినవే కావటం కూడా ఆయన కథలకు ప్రత్యేకతను సంతరించిపెట్టాయి. దశాబ్దాల క్రితం ఆయన రాసిన కథలు నేటికీ ప్రాసంగికతను కలిగి ఉండటమే కథా రచయితగా వల్లపురెడ్డి బుచ్చారెడ్డి గొప్పదనాన్ని తెలియజేస్తుంది. అలతి అలతి పదాలతో, సాధారణ కుటుంబ వాతావరణంతో పాటు సమాజంలో నాటి పరిస్థితికి అద్దం పట్టే కథలనే ఆయన విరివిగా రాశారు. ఆయన సమకాలీనులకే ఆయన గురించి పెద్దగా తెలియదు. ఈ నేపథ్యంలోనే వల్లపురెడ్డి బుచ్చారెడ్డి గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఈ తరంపై ఉన్నది. ప్రకృతి అన్ని ప్రాంతాలకు సమంగా వనరులిచ్చినా.. వాటిని సద్వినియోగం చేసుకోలేకపోవటం వల్ల కరువు పరిస్థితులు






తలెత్తిన పాలమూరులో బంగారం పండే భూములెన్నో ఉన్నాయి. ఇక్కడి నల్లరేగడి భూములు రైతులకు అందివచ్చిన వరాలే. కాకపోతే పాలకులు ఇక్కడి భూములకు నీటివసతిని ఏర్పాటు చేయకపోవడం వల్ల కరువు ఉత్పన్నమైంది. వలసలు పెరిగాయి. ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకంటే.. పాలమూరులో కరువు అన్నది సహజమైనది కాదని చెప్పటమే.. దీంతో పాటు ఈ నేలపై వెలుగులోకి రాని కవులు, రచయితలు, కళాకారులు ఎందరెందరో ఉన్నారు. అలాంటి వారందరిలో వల్లపురెడ్డి బుచ్చారెడ్డి ఒకరు. ఆయన జీవితం ఎక్కడ మొదలైంది? విద్యాభ్యాసం ఎలా జరిగింది? ఆయన జీవితంలోని ఉత్థానపతనాలేమిటి? చివరకు ఎక్కడ నిలిచింది? ఈ సుదీర్ఘ ప్రస్థానంలో ఆయన సాధించిన, సాగించిన సాహిత్య కృషి గురించి తెలియచేస్తూ.. ఈ తరానికి ఆయనని పరిచయం చేయటమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

### బుచ్చారెడ్డి కుటుంబం

వల్లపురెడ్డి బుచ్చారెడ్డి 1932 అక్టోబర్ 7న (వనపర్తి జిల్లా పెబ్బేరు) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరులో జన్మించారు. వీరి తల్లిదండ్రులు బుచ్చమ్మ, రామకృష్ణారెడ్డి. బుచ్చారెడ్డికి ఒక అన్నయ్య, ఒక చెల్లి సుభద్ర ఉన్నారు. వీరు పూర్వము కర్నూలు జిల్లా బ్రాహ్మణకొట్కూరుకు చెందినవారు. ఒక ముసలమ్మ తన కుమారుడిని వెంటబెట్టుకుని వెళ్తూ పెబ్బేరుకు వచ్చింది. అక్కడే ఆగిపోయింది. అవిధంగా వల్లపురెడ్డి బుచ్చారెడ్డి వంశస్థులు పెబ్బేరులో స్థిరపడిపోయారు. కృష్ణానదికి ఈవల వల్లపురెడ్డి బుచ్చారెడ్డి జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం పెబ్బేరులోని అంజుమన్ బడిలో కొనసాగింది. కొంతకాలం వీరి మేనమామ ఊరైన రాజంపేటలో ఉండి అక్కడి నుండి ప్రతిరోజూ వనపర్తికి నడిచి వెళ్లి చదువుకున్నారు. హైస్కూల్ విద్య వనపర్తిలో పూర్తి చేశారు. మదర్సా–ఏ–పోఖానియా ప్రధానోపాధ్యాయులు కె. వెంకటేశ్వరరావు వల్లపురెడ్డి బుచ్చారెడ్డిని బాగా ప్రభావితం చేశారు. బుచ్చారెడ్డి వనపర్తిలోని హైస్కూల్‌లో చదువుతున్నప్పుడే వీ కుటుంబంలో ఓ విషాద సంఘటన జరిగింది. బుచ్చారెడ్డి అన్నయ్య సత్యనారాయణ రెడ్డి ఆత్మహత్య

చేసుకున్నాడు. ఇది బుచ్చారెడ్డిని తీవ్ర దుఃఖసాగరంలో ముంచింది. అన్న మరణంతో మనస్తాపానికి గురైన బుచ్చారెడ్డిని ఆ బాధలో నుంచి బయటకు తీసుకువచ్చి బుచ్చారెడ్డిలో ధైర్యాన్ని నూరిపోశారు ప్రధానోపాధ్యాయుడు కే.వెంకటేశ్వరరావు.

**సాహిత్యంతో పరిచయం**

1954లో బుచ్చారెడ్డి ఇంటర్ చదివేటప్పుడు హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో ఉన్నారు. అక్కడ ఉన్న గ్రంథాలయంలో శరత్ సాహిత్యం, ఠాగూర్ రచనలు, బంకించంద్ర నవలలు, ప్రేమ్‌చంద్ సాహిత్యాలను నరనరాన జీర్ణించుకున్నారు. సాహిత్యం విస్తృతంగా చదవటం వల్ల కథారచన చేయటానికి దోహదపడింది. బీ.ఏ చదువుతున్న రోజుల్లోనే విస్తృతంగా కథలు రాశారు బుచ్చారెడ్డి. అప్పటి ప్రముఖ పత్రికలలో బుచ్చారెడ్డి కథలు ప్రచురితమయ్యాయి. ఆ పత్రికలకు పంపిన ఏ కథ కూడా తిరిగి రాలేదు. 1954–1960 మధ్యకాలంలో దాదాపు 52 కథలు రాశారు. కథా సాహిత్యం నుండి ఆయన దృష్టి తరువాత ప్రబంధ సాహిత్యం వైపు మరలింది. పాలమూరు జిల్లాలో ఆనాడు ఇంత ఎక్కువగా కథా రచన చేసిన వారు మరొకరు లేరు.

వల్లపురెడ్డి బుచ్చారెడ్డి ప్రబంధ సాహిత్యం వైపు దృష్టి మరల్చిన తర్వాత ఆచార్య బిరుదురాజు రామరాజు దగ్గర శిష్యరికం చేశారు. తాళపత్ర గ్రంథాల పరిష్కరణ జ్ఞానం బుచ్చారెడ్డికి ఎంతో పేరు తెచ్చి పెట్టింది. పాలమూరు జిల్లాలోనే కాకుండా మొత్తం తెలంగాణ ప్రాంతంలోనే సురవరం ప్రతాపరెడ్డి తరువాత అత్యంత అధికంగా సాహిత్య కృషి చేసిన వారు వల్లపురెడ్డి బుచ్చారెడ్డి. పేరు, ప్రఖ్యాతుల కోసం ఆయన ఎప్పుడూ పాకులాడలేదు. అలా చేసిన వారెంత గొప్పవారైనా సరే వారిని అసహ్యించుకున్నారు.

**జర్నలిస్టుగా..**

వల్లపురెడ్డి బుచ్చారెడ్డి సాహిత్యంలోనే కాదు జర్నలిజంలోనూ కృషి చేశారు. గోల్కొండ పత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. 1954లో విద్యుల్లత పత్రికకు, 1960లో ఉదయ భాను పత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు. కొంతకాలం పురోగామి వారపత్రికను నడిపించారు. వల్లపురెడ్డి బుచ్చారెడ్డి కుటుంబంలో జరిగిన విషాద సంఘటనలు ఎంతో వేదనకు గురి చేసి కథా రచన చేయడానికి దోహదం చేశాయి. సాహిత్య ప్రక్రియ విస్తృతిలో చిన్నదైన కథా రచన కత్తిమీద సామే! వ్యక్తుల జీవితంలోని సంఘటనలు, సమస్యలను కథా వస్తువులుగా తీసుకుని కథలుగా రచించారు బుచ్చారెడ్డి. ఆయన కథలన్నీ పతనమవుతున్న సామాజిక విలువలు, స్వార్థ, సంకుచిత మనస్తత్వాలు, అసూయ ద్వేషాలతో మానవీయ సంబంధాల విధ్వంసంపై ఆవేదన, ఆర్తి, ఆక్రోశంతో కూడినవే. బుచ్చారెడ్డి కథల్లో కన్నీటి చారిక లున్నాయి. బుచ్చారెడ్డి కథలు ప్రధానంగా మానసిక సంఘర్షణను బలంగా చిత్రించాయి. కథకులు చాలామంది సందర్భాన్ని వివరించిన వారే కానీ మనస్తత్వ సంఘర్షణ జోలికి పోరు. వల్లపురెడ్డి రాసిన అన్ని కథలు నేటికీ సజీవ శిల్పాలే. అందరి ఆదరణ పొందే కథలే. సామాజిక ప్రయోజనాలకు మార్గదర్శకాలే. అలాంటి కథల నేపథ్యాన్ని పరిశీలిద్దాం.

**అందాల ఆదివారం**

ఈ కథ 1954 డిసెంబర్ 31న తెలుగు స్వతంత్ర పత్రికలో ప్రచురితమైంది. బాహ్య సౌందర్యం కన్నా ఆత్మసౌందర్యం గొప్పదని చాటిచెప్పే కథ ఇది. ఇందులో పాత్ర ఒక యువకుని ఆలోచనా ధోరణిని తెలియపరుస్తూ ఉంటుంది. ఈ కథలోని యువకుడికి ఆదివారం మీద ఏర్పడిన అభిప్రాయాలతో కథంతా సాగుతుంది. నిజానికి ఆదివారం అనగానే అందరూ ఆనందంగా, సంతోషంగా గడపటానికి ఇష్టపడుతుంటాం. ఆదివారమంటే అందమైనదనీ తన స్నేహితుల మాటల ద్వారా విని వారి మాటలను పరీక్షించేందుకు ఓ ఆదివారం రోజున హాయిగా సౌందర్యాన్ని ఆస్వాదించేందుకు ఆ యువకుడు బయల్దేరుతాడు. దారిలో కలిసిన నలుగురు అమ్మాయిలు అందంగా ఉన్నా వారిలోని అహం, ఈర్ష్య, అసూయ, పైపై మెరుగులు, సంస్కార హీనత్వం చూసి బాధపడతాడు. మొదటి అమ్మాయి లేని అందాన్ని ప్రదర్శించడం, ఆమెను చూసేందుకు తోటి మిత్రులు ఉత్సాహం చూపడం, ఆ అమ్మాయి ఈ యువకుడిపై చూపే చనువు చూసి ఇతర మిత్రులు అసూయ పడటం కళ్ళకు కట్టినట్టుగా రాశారు. సంస్కారహీనంగా ఒక యువతి, అసూయతో ఒక యువతి, అహంతో తోటివాళ్లని సరిగా లేరని వెక్కిరించే పార్కులోని జంట, వారి పిల్లలు, ధనిక వృద్ధురాలు భిక్షగత్తెతో జాలి లేకుండా ప్రవర్తించటం చూసి అందం అంటే అసలైన అర్థం ఇది కాదని, ఇలాంటి అనుభూతులను చూపిన ఆదివారం కూడా నచ్చనిదిగా భావిస్తాడు. చివరలో మానవత్వాన్ని చూపిన యువతిని చూసి జాలీ, ప్రేమలే నిజమైన సౌందర్యమని గ్రహిస్తాడు. కథలోని ప్రతిపాత్ర వద్ద సమాధానాన్ని చూసుకుంటాడు. సహజమైన అందాన్ని హత్య చేసే ఇవి కూడా ఒక అందాలేనా? అని ముగిస్తూ చివరలో తారసపడిన ఒక యువతి ఏ సంబంధం లేని వ్యక్తిని రక్షించి తన గాయాన్ని కూడా లెక్కచేయక ఎదుటి వారికి సహాయం చేయాలనే కోరిక ఆమె కళ్లలో తృప్తి, నిష్కల్మష హృదయం నిజమైన అందానికి నిదర్శనమని, అది చూసే భాగ్యాన్ని కలిగించిన ఆదివారాన్ని మరలా అందమైనదిగా తన మనస్సులో భావించుకోవడంతో కథ ముగుస్తుంది.

**కథను తిప్పిన పార్శెల్**

ఈ కథలో వల్లపురెడ్డి బుచ్చారెడ్డి ఇరుగుపొరుగున ఉన్న ఇద్దరు స్త్రీ,పురుషుల మనస్తత్వాల్ని చక్కగా విశ్లేషించారు. రామారావు, సులోచన ఎదురెదురుగా ఉండే ఇళ్లలో నివసిస్తుంటారు. ఎదురింట్లో ఉండే సులోచనను చూసినప్పుడల్లా రామారావు దుర్బుద్ధితో సంస్కార హీనంగా చూస్తుంటాడు. అందుకే సులోచనకు రామారావు అంటే కోపం. ఆ రోజు ఇద్దరి ఇళ్ల మధ్య ఒక పార్శెల్ కాగితం పొట్లం పడి ఉండటంతో కథ దాని చుట్టే తిరుగుతుంది. ఆ పొట్లంలో ఏముందోని, దానిని ఒకరికి తెలియకుండా మరొకరు కాజేయాలని తలంపు

రావడంతో ఇద్దరి మనస్తత్వాలు బయటపడతాయి. ఎవరో ఏదో పోగొట్టుకుని ఉంటారని దాన్ని ఎవరూ చూడకుండా తెచ్చుకోవాలని ఇద్దరూ తాపత్రయ పడతారు. ఆ పొట్లంలో ఏదో విలువైనది ఉంటుందని ఇద్దరూ ఆశపడతారు. వీరిద్దరి మనస్తత్వం ఒకటే.. అదే దుర్బుద్ధి. ఇతరుల వస్తువులు అప్పనంగా వస్తే చాలు అనుకునే మనస్తత్వం. రామారావు ఆ పార్శెల్‌ను సులోచనను తీసుకుపొమ్మని సైగలు చేయడం, దీనికి సులోచన మండిపడి తనను ట్రాప్ చేయడానికి పొట్లం తనకు ఎరగా వేశాడని సులోచన అనుకోవడంతో ఇద్దరి మనస్తత్వాలు మరోసారి బయటపడతాయి. ఈ పార్శెల్ గుట్టు చివరకు సులోచన భర్త విప్పుతాడు. తను రాత్రి అరటి తొక్కలు పేపర్‌లో చుట్టి రోడ్డుపై పడవేశానని సులోచనభర్త చెప్పటంతో ఆ పార్శెల్‌ను అప్పటికే రామారావు ఇంట్లోకి తీసుకుపోవడంతో కథ ముగుస్తుంది.

**పరాజితులు**

వల్లపురెడ్డి బుచ్చారెడ్డి రాసిన కథలలో పరాజితులు కథ ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన అంతర విశ్వవిద్యాలయ కథల పోటీలలో మొదటి బహుమతి పొందింది. ఇది 1967లో భారతిలో అచ్చయ్యింది. ఈ కథ వల్లపురెడ్డి బుచ్చారెడ్డి కుటుంబంలో జరిగిన విషాద సంఘటన. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఆప్యాయత కనిపిస్తుంది. కుటుంబంలో తల్లి, తండ్రి, భార్య మధ్య మానసికంగా నలిగిన సామాన్యుడు సత్యనారాయణ రెడ్డి. కుటుంబ ఘర్షణల నేపథ్యంలో చివరకు ఆత్మహత్య చేసుకుంటాడు. కథానాయకుడు తన అన్న మరణానికి తండ్రే కారణమని తండ్రిపై ద్వేషభావం పెంచుకుంటాడు. తండ్రి బతికున్నంత కాలంలో తన అన్న చావుకు తాను కారణం కాదని ఆ తండ్రి చెప్పుకోలేకపోతాడు. ఒక రోజు పొలంలో కూర్చున్న కథానాయకుడు భానుమూర్తికి తండ్రి ఆత్మ వచ్చి ఓదారుస్తుంది. తన అన్న మరణానికి తాను కారణం కాదని వివరిస్తుంది. ఏ తల్లిదండ్రులు తన కొడుకు మరణం కోరుకుంటారో నాకు తెలియదు. లోకులు మమ్మల్ని ఏమి ఆధారం మీద నిందించారో నాకు ఈ నాటికి అర్థం కావటం లేదు. ఒకరి సంసారం చల్లగా సాగుతుంటే చూడలేనిది ఈ లోకం.. నీ జీవితంలో ఆత్మాభిమానం చచ్చిపోతుందనే అహంతో నీ సంతానం పట్ల ఎప్పుడూ నాలా ప్రవర్తించకు, వాళ్ళకు నష్టం కలిగించకు. కథానాయకుడు భానుమూర్తి భూమ్మీద నుంచి లేచి చూసే సరికి ఆ మొదటి ఆకారం మాయమవుతుంది. పశ్చాత్తాప హృదయంతో తాను పడి ఉన్న స్థలాన్ని చూశాడు. కన్నీళ్లతో ఆ చోటు మాత్రం కొంచెం తడిసి ఉంది. ఈ కథలోని పాత్రల చిత్రీకరణ మానసిక సంఘర్షణలు కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తాయి. బుచ్చారెడ్డి కుటుంబంలో జరిగిన యధార్థ ఘటనే పరాజితులు కథ.

**కల్పాంతం**

మంచి చేయాలని తలచినా ఒక్కోసారి చెడు జరిగి చేదు అనుభవాల్ని మిగులుస్తుంది అని తెలియచేసే కథ ఇది. సంస్కారవంతుడైన ఒక యువకుడు తన మిత్రుడిని కలుసుకునేందుకు అతడి గ్రామానికి వెళ్లి అక్కడ జరిగిన విషాద సంఘటనను చూసి కన్నీళ్లతో తిరిగి తన గ్రామానికి వెళ్లటం ఇందులోని కథాంశం. మిత్రుడిని కలవడానికి అతడి ఊరికి వెళ్లి, అతను ఇంట్లో లేకపోవడం వల్ల కొంత సమయం అలా గ్రామాన్ని చుట్టి వద్దామనుకుని చిన్నగా బయలుదేరగా.. హఠాత్తుగా ప్రకృతి వికటించి ప్రళయ గర్జన చేయడంతో విస్తుపోతాడు. తనకు ఇవే చివరి గడియలు అనుకుని తన తల్లిదండ్రులను, భార్యాపిల్లలను, స్నేహితులను తలుచుకుని విలపిస్తాడు. చివరకు ఎవరూ రారుగా నాతో.. ఈ ఉన్న కొద్ది సమయాన్ని ఆస్వాదించాలని అనుకుంటూ ఉండగా.. మేకలు కాసే ఓ పిల్లాడు తనలాగే ప్రమాదం బారిన పడి బెదిరిపోయి కనిపిస్తాడు. పోతు పోతు మంచి చేయాలనే ఆలోచనతో పిల్లవాడిని కాపాడేందుకు తన శక్తినంతా ఉపయోగిస్తాడు. వాడిలో భయం పోగొట్టటానికి మాటల్లో పెట్టగా.. ఆ పిల్లవాడు చెప్పిన సమాధానాలు విని మనసు కరిగిపోయి కన్నీళ్లతో ఆ పిల్లవాడిని హృదయానికి హత్తుకుంటాడు. తల్లిదండ్రుల కోసం అతను పడే తాపత్రయాన్ని చూసి సంతోషిస్తాడు. ఇలాంటి మంచి పిల్లలుంటే తల్లిదండ్రులే కాదు సమాజమూ బాగుంటుందని భావిస్తాడు. అలా ఆ పిల్లవాడికి ధైర్యం చెప్పి ఒక ప్రాణాన్ని రక్షించానని ఎలాగో ఒకలా మిత్రుడి ఇంటికి చేరతాడు. కానీ ఆ మరుసటి రోజు తను తన గ్రామానికి తిరిగి ప్రయాణమవుతుండగా ఆ పిల్లవాడు పిడుగుపాటుకు మరణించాడని తెలిసి హతాశుడవుతాడు. నిన్ననే ఆ పిల్లవాడికి ప్రళయానికి అర్థం తెలిపాను. ఏదైతే ప్రాపంచిక ప్రళయం అని, చూడ్డం విశేషమని తాను భావించాడో ఆ పదానికి అర్థమే తెలియని వాడికి సంభవించింది. తనతో పాటు తన తల్లిదండ్రులు కూడా మరణిస్తే మంచిదనే అతని కోరిక తీరింది. మరణం సంభవించే సమయంలో ఆ పిల్లవాడు చూపిన పరిపక్వత గుర్తుకు వచ్చి ఇతడి హృదయం వేదనతో నిండిపోతుంది. తాను ఆ పిల్లవాడికి చివరి దాకా తోడు ఉండింటే బాగుండేదేమో అని చింతిస్తాడు. తాను చదవటానికి తెచ్చుకున్న పుస్తకం పేజీలన్నీ పాడైపోయినా నాటి కల్పాంతం నుండి బయటపడి ఆ నాటి విషాద ఘట్టానికి గుర్తుగా మిగుల్చుకోవటంతో కథ ముగుస్తుంది. మరణం సమీపించినప్పుడు మనిషి ఆలోచనలు ఏ విధంగా ఉంటాయో ఈ కథలో బుచ్చారెడ్డి చక్కగా వివరించారు.

సామాజిక వ్యక్తిత్వాలను గూర్చి వైయుక్తిక దృష్టితో మధ్య తరగతి జీవన వైవిధ్యాలను తెలంగాణలో, ప్రత్యేకించి ప్రాంతీయ వాసనలతో కథలు రాసి.. మానవతా వాదులుగా, నిగర్వులుగా, నిరాడంబరులుగా, సహృదయులుగా సాహిత్య చరిత్రలో నిలిచిపోయారు వల్లపురెడ్డి బుచ్చారెడ్డి. తెలుగు సాహితీ లోకంలో కథలు రాసి తెలంగాణ కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వల్లపురెడ్డి బుచ్చారెడ్డి 2017 ఆగస్టు 31న ఈ లోకాన్ని విడిచివెళ్ళారు.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 8 (36) హైదరాబాద్ జూన్ : 2024

# ఆనంద రామాయణము – ఒక వివరణ

ఆమంచర్ల గౌతమ, డా. ఎ. కృపానిధి, ఫోన్ : 924 776 4910, 939 246 7607

ఆనందరామాయణం ప్రతులను క్షుణ్ణంగా చదివి, ఆకళింపు చేసుకొని, నా అభిప్రాయాలను ఈ వ్యాసంలో తెలియజేస్తున్నాను. వాల్మీకి రామాయణమును, అలాగే ఆధ్యాత్మ రామాయణమును మాతృక అయిన సంస్కృత భాషలోనే పఠించి యుంటిని. తులసీ రామాయణమును కూడా తెలుగున గీతాప్రెస్ గోరఖ్‌పూర్‌వారు ప్రచురించిన గ్రంథమును కూడా చదివియుంటిని. సంస్కృత శ్లోకములు ప్రధానంగాను, తెలుగు తాత్పర్యముతో పఠించితిని. రామాయణము ఎవరు వ్రాసినను వాల్మీకి ప్రోక్తముగానే పరిగణించవలెనన్నది పెద్దల ఉవాచ. కనుక ఆ ఆనంద రామాయణము కూడా వాల్మీకి ప్రోక్తమే అనునది సత్యదూరం కాదు. మనకు ఎన్ని రామాయణములు వున్నను వేటికి అవియే! వాటిలోని విషయ గ్రాహ్యము కొరక పాఠకుడు అన్ని రామాయణములు కూడా తప్పక వాటి మాతృకలలోనే పఠించుట శ్రేష్ఠము అని నా అభిప్రాయము.

ఆనంద రామాయణము మొదటి భాగము 'సారకాండ'లో వాల్మీకి రామాయణములోని ఇతివృత్తములు సంగ్రహంగా కొన్ని మార్పులతో తెలుపబడినవి. పుత్రకామేష్టి, తాటక వధ, ఆహల్యా శాపవిమోచనము, రాములవారి దండకారణ్య ప్రవేశము అచ్చట ఋషుల పరిచయములు, హనుమ లంకా ప్రవేశము, సీతామాత దర్శనము, లంకా దహనం, రామ రావణ యుద్ధము యథాతథముగా ఆనంద రామాయణమున ఉన్నది.

ఇక ఆనంద రామాయణమున వాల్మీకి రామాయణములో లేని కొన్ని ముఖ్య అంశములను తావన్మాత్రముగా స్పృశిస్తూ, సంగ్రహంగా ఇచ్చట తెలుపుతాను.

**రామాయణములో లేని క్రొత్త అంశములు**

1. కౌసల్యా దశరథుల వివాహము కొన్ని చిత్ర విచిత్ర సంఘటనల నడుమ రావణుడు అడ్డు పడినను ఒక ద్వీపములో గాంధర్వ విధిన జరుగుట.

2. దశరథ, వాలి, సుగ్రీవుల పూర్వ జన్మల వృత్తాంతము, వారికి ఆ నామములు కలుగుటకు కారణములు.

3. శ్రీరాముడి వనవాసం 'వృంద' అన్న స్త్రీ కారణంగా జరుగుట. ముద్గల మహర్షి దశరథులవారికి తెల్పుట

4. శ్రీరాముడు చేసిన దశ అశ్వమేధ యాగముల వర్ణన. వశిష్ఠ గురువులు దాన విషయంలో రాముడిని హెచ్చరించుట

5. పత్నీ, సోదర బంధు పరివారమేతముగా పుష్పక విమానమునందు చేసిన తీర్థయాత్రా విశేషములన్నియు యాత్రాకాండ యందు వర్ణింపబడి యున్నది. పాఠకుడు కూడా వారితో పాటు ఆ యాత్రలు చేస్తున్నట్లు, అందులో పాల్గొన్నట్లు, అనుభూతికి లోను కాగలడు అనుటకు సందేహం లేదు.

6. వనవాస సమయంలో శ్రీరాముడు రహస్యంగా సీతాదేవితో మూడు రూపాలు ధరింపుమని, తేజోరూపంలో అగ్నిలోను, సత్త్వరూపంలో తన (రాముని) ఎడమ భాగమునందును, తామస రూపముతో నీడగా కుటీరమున వుండమని చెబుతాడు. కుటీరమున ఉన్న నీడరూప సీతను రావణుడు అపహరిస్తాడు.

7. లక్ష్మణరేఖ వృత్తాంతం ఇచ్చట కలదు.

8. యుద్ధ సమయములో పదునాలుగు సంవత్సరాలు నిద్ర ఆహారాదులు జయించిన లక్ష్మణుడే ఇంద్రజిత్తును వధింపగలవాడు అనియు, రావణుని బొడ్డులో అమృతకలశం వున్నదని దానిని ఛేదించితేనే రాముడు రావణుని వధింపగలడు అన్న ఈ రహస్యాలను విభీషణుడు శ్రీరామునకు తెలియజేయుట.

9. రామసేతు నిర్మాణములో శిలలు సముద్ర జలములలో మునుగుచుండుట గమనించి నీలుడు శ్రీరాముని శరణు కోరగా, ఆ పై ఆ శిలలపై శ్రీరామ అని వ్రాయించగా అవి నీట తేలి సేతు నిర్మాణము పూర్తి గావించుట.

10. గురువు రామదాసు జన్మవృత్తాంతము కథలో కథలుగా రమ్యముగా వర్ణింపబడి యున్నది.

11. ఆనంద రామాయణమున పలు రామాయణములు పేర్కొనబడినవి – ఆనంద రామాయణము, హనుమ, నారద, అగస్త్య, భారద్వాజ రామాయణాదులు.

12. దండకారణ్య పూర్వ వృత్తాంతము

**ఆనంద రామాయణములో పేర్కొనిన కొన్ని ఆశ్చర్య సంఘటనలు**

1. ఆనంద రామాయణము చదివి శ్రీ వ్యాసులవారు పదునెనిమిది పురాణములు రచించుట.

2. దుర్వాసుని పూజ కొరకు శ్రీరాముడు కల్పవృక్షమును భువికి తెచ్చుట. ఆపై శిష్య సమేతముగా దుర్వాసునికి గొప్ప విందు చేయుట.

3. వాల్మీకి మూడు జన్మల వృత్తాంతం

4. కౌసల్యాది తల్లులకు వేదాంత తత్త్వమును బోధించుట.

**కొన్ని ప్రత్యేక అంశములు**

1. దేహ రామాయణము : సీతాదేవి శ్రీరాముడు ఇచ్చిన ప్రహేళికను విప్పి, మానవ దేహంలోనే రామాయణ వివరములు తెలుసుకొనచ్చునని తెల్పి, శ్రీరాముని మెప్పు పొందుట.

**2. స్త్రీ మూర్తి సౌందర్యారాధన :** శ్రీరాముడు తన పత్ని సీతాదేవిని నఖశిఖ పర్యంతము ప్రతి అవయవ సౌందర్యారాధన అశ్లీలతకు తావు లేకుండా చేస్తాడు. ఇచ్చట ముఖ్య విషయము – భక్తుడు చేసే స్త్రీ సౌందర్యారాధన మాతృస్థానమున వుంటుంది. భగవంతుడు చేసే పత్నీ సౌందర్యారాధన రెండు వేరు వేరుగా వుంటాయి.

3. శ్రీరాములవారి దినచర్య రమ్యంగా వర్ణించబడింది. అలాగే సీతారాముల దినచర్య వర్ణితము. ఈ విషయం మనకు మరెందును కానరాదు.

4. సీతారాముల జలక్రీడలు – స్నానాదులు అలాగే వారి శయన ఏకాంత క్రీడాకలాపాదులు వర్ణించబడినవి. ఇట్టవి మనకు వేరే గ్రంథాల్లో కనపడవు.

**నేను మెచ్చిన రెండు అంశములు**

శ్రీరాముడు స్వయంగా తన బంధుమిత్ర పరివార సదస్సునందు తెలిపిన విషయము. తను ధరించిన అన్ని అవతారములలో అత్యంత ఆనందము, సుఖము ఈ రామావతారముననే అని తెలుపుతూ ప్రతి అవతారమును వర్ణన చేస్తూ తెలుపుతాడు. బహుకాలము పుత్ర మిత్ర పత్నీ సమేతముగా కుమారులు, కోడండ్రు మనుమలతో అధిక ఆనందము పొందితినని చెబుతాడు. ఈ కారణముగానే ఈ గ్రంథము 'ఆనంద రామాయణము' గా సార్థకమైనది.

2. వాల్మీకి రామాయణములో సీత కుశలవులను రామునికి సమర్పించి, వాల్మీకి సమక్షమున రాముని నిండు దర్బారులో తన పాతివ్రత్యముపై శపథము గావించి భూమాత ఒడిలోకి చేరుతుంది తిరిగి రాదు. కానీ ఈ ఆనంద రామాయణమున అలా భూమి ప్రవేశం చేసినందులకు ఆగ్రహించిన రాములవారు ధనుస్సు ఎక్కు పెట్టగా భూదేవి సీతతో పైకి వెడలి సీతను రామునకు అప్పగించి నిష్క్రమిస్తుంది. అందుచేత బంధుమిత్ర, కుమార, మనుమలతో సుఖముగా రాముడు పదునొకండు వేల పైబడిన కాలం జీవించియున్నాడు.


**నచ్చని అంశములు రెండు**


1. పరమ పవిత్రమైన సంతానమును ప్రసాదించగల యజ్ఞపాయసాన్నమును విసరివేసి నేలపాలు చేసిన కైకేయి చర్య.

2. శ్రీరాముడు తన రాజ్యమున హాస్యమును, నవ్వును నిషేధించుటకు కారణము – శరాఘాతంతో తెగి నేల కూలుతున్న రావణుడి కంఠము, వికటాట్టహాం చేస్తూ నేలకొరుగుటకు భీతిల్లిన రాముడు. అవక్ర పరాక్రమవంతుడగు రాముడు భీతిల్లుటయా!?

**శ్రీరామరాజ్యము – రాజనీతి**

శ్రీరాముని రాజ్యపాలనలో ప్రజలు ఎంత సుఖంగా నుండిరో రామరాజ్యమనగానేమో ఒక కాండ అంతా చాలా విపులంగా వర్ణితమైంది. రామరాజ్యములో నిర్వైర్యము, బలాన్వితులై, మహర్షి




మనోజ్ఞముగా, సుమంజులమై విరాజిల్లుచున్నది. ప్రజలందరూ ధర్మ వర్తులు, ధనవంతులు, శాంతియుతులు, నిండు పశుసంపద, అన్ని దేవాలయాములు శోభాయమానములై వున్నవి... ఇలా వర్ణితములు.

**రాజనీతి శిక్షణ :** కుశుడు ఉత్తర రాజ్యాధికారిగా ఉవండవలసిన వ్యక్తి కనుక ముఖ్యముగా కుశుని ఉద్దేశించి, శ్రీరాముడు లవునికి, మిగిలిన ముగ్గురు సోదరులకు కలిపి రాజనీతిలో శిక్షణను ఇచ్చినాడు. పాలకునికి ఉండవలసిన సప్త గుణములు, ఉండకూడని సప్త వ్యసనములు ఇంకా ఇతర విషయాలనన్నింటిని తెలిపాడు. ఈ బోధ ఒక కాండయందు విపులముగా తెలుపబడినవి.

**ఆధ్యాత్మిక తత్త్వబోధ**

ఆనంద రామాయణములో ఇది చాలా ముఖ్యాంశము. ఇట్టి తత్త్వబోధ మరి ఇతర గ్రంథాలలో కానరాదు. అథర్వ వేదములోని ఉపనిషత్తుల తత్త్వ విచారణ, పంచభూతములు, పంచేంద్రియములు మొదలుగా గల ఇరవైనాలుగు తత్త్వములలో ప్రవహించే చైతన్యము రామ నామమే. సంసారం పూర్వకర్మల ఫలితమె. ఆత్మ సాక్షాత్కారము కేవలము మానవులకు మాత్రమే! జ్ఞానమే కైవల్య ప్రాప్తికి మార్గము. గురువు ద్వారా తన హృద్గతమైన శ్రీరాముని గుర్తించాలి. మహావాక్య విచారణ జరుపాలి. స్థూల, సూక్ష్మ, కారణ దేహముల తత్త్వ విచారణ జరపాలి. తైత్తిరీయ ఛాందోగ్యోపనిషత్తుల ద్వారా రామబ్రహ్మము నెరుగుట, శ్రీరామ బ్రహ్మతత్త్వ బోధ, పరమాత్మ లింగ తత్త్వ విచారణ మున్నగు అనేకాంశములు ఆనంద రామాయణమున కలవు.

ఆనంద రామాయణమునందు స్తోత్రాదులకు కొదవే లేదు. శ్రీ శివకృత శ్రీరామస్తోత్రము, శ్రీరామకృత శివస్తోత్రము, శ్రీ రామ అష్టోత్తర శతనామ స్తోత్రము, శ్రీరామ సహస్రనామ స్తోత్రము, శ్రీరామరక్షా స్తోత్రము, శ్రీరామ స్తవరాజ స్తుతి, శ్రీ రామ మానస పూజా స్తోత్రము, శ్రీరామ, సీతా, ఆంజనేయ, భరత, శత్రుఘ్న, లక్ష్మణ కవచములు మున్నగునవి ఎన్నో కలవు. ఇన్ని స్తోత్రములు మరి ఏ ఇతర గ్రంథములో లభింపవు.

# దేనికోసం ....

**టి. శ్రీవల్లీ రాధిక,** ఫోన్ : 9441 644 644

వ్యవహారాలలో లక్షలు నష్టపోతావు
నీ తెలివంతా ఎటుపోయిందంటూ
బంధుజనం పరిహసిస్తారు

పురస్కారాలకూ సత్కారాలకూ
దూరమవుతావు
పాండిత్యం తగ్గిపోయినట్లుందని
పదిమందీ గుసగుసలాడతారు

మూర్ఖపు మాటల శరాలకు రక్తమోడుతావు
ఒక్కమాటతో అవతలి వారి నోరు మూయించగల
తర్కమేమయిపోయిందో! అని
నేస్తులంతా విస్తుపోతారు

హక్కుగా పొందవలసిన వాటి కోసమూ
ఒక పట్టాన కదలనంటావు
అసలు చైతన్యమే కోల్పోయినట్లుందని
ఆత్మీయులు చిరాకుపడతారు

అయితే..
వాటినన్నిటినీ పట్టుకెళ్ళి
నువు ఎవరి పాదాలపైన పేర్చావో
ఆ కొంటె గోపాలుడు మాత్రం
చిరునవ్వుతో నిన్నే చూస్తుంటాడు
ఏ ఆనందంకోసం
నువు వాటిని పణంగా పెట్టావో
దానిని కొల్లలుగా
నీపై కుమ్మరిస్తుంటాడు



❖ ❖ ❖ ❖ ❖

**శ్రీరాముని వైకుంఠారోహణము**

కుశునికి రాజ్యభారము అప్పగింపు, సీతా, లక్ష్మణ సోదరులతో వానర వీరులు, సమస్త పౌరులు గంగ వద్దకు చేరుట, మంగళ స్నానాదులు గావించిరి. అటుపై తను ఆరాధించే అగ్నిని ముందుగా వైకుంఠమునకు పంపి తర్వాత అందరితో కలిసి మహాప్రస్థానము గావించెను. ప్రణవము గాయత్రీ మంత్రము శ్రీరాముని అనుసరించెను. సీతతో రాముడు తన నిజధామమునకు చేరుకొనెను. చాలా విపులంగా అన్నీ పూర్ణకాండ ఆరవ సర్గలో వర్ణితమైనాయి.

ఒక నాణెమునకు బొమ్మ – బొరుసు ఉంటాయి. అనగా మంచినీ గ్రహించవచ్చు, చెడును ఎత్తి చూపవచ్చు. కాళిదాసు ఒక శ్లోకంలో క్రొత్తదని తీసిపారవేయవలదు, పాతదని నెత్తిన ఎక్కించపనిలేదు. విజ్ఞులు అయినవారు రెండింటిని బేరీజు వేసి, విషయం క్షుణ్ణంగా పరిశీలించి ఒకదానిని ఎంపిక చేస్తాడు. సామాన్యుడు ఇతరులపై ఆధారపడి నిర్ణయిస్తాడు.

**ముగింపు**

కనుక ఆనందరామాయణాన్ని అవాల్మీకము అని తీసిపారవేయ వచ్చు. శ్రీరామాయణం భారతాదులను విషవృక్షంగా ఎత్తి చూపినవారు లేకపోలేదు. అదేవిధంగా ఆ రెండు గ్రంథాలను తలదాల్చి పూజించి, లాభాన్ని పొందినవారును లేకపోలేదు. కనుక పరిశీలించే కోణంపై గ్రంథనిర్ణయం ఆధారపడి యుంటుంది.

ఆనంద రామాయణములో ఎన్నియో క్రొంగత్త విషయములు వున్నవి. పూర్వజన్మల విశేషాలు, స్తోత్రాదులు, తత్త్వ బోధలు, రామతోభద్ర మండల పూజాదులు, తీర్థయాత్రా విశేషములు, సౌందర్యారాధన, శ్రీరామ సీతా దినచర్యలు, విహారాలు, అశ్వమేధ యజ్ఞ విశేషములు, రాజధర్మములు – రాజనీతి మున్నగు ఎన్నో విశేషాంశాలతో కూడియున్నవి. ఇట్టి ఎన్నియో విశేషములు కలిగిన ఈ గ్రంథరాజము మన ఆంధ్రమున ఎందులకు ప్రాచుర్యము నందలేదో అంతుపట్టని విషయము. తెలుగులో ప్రతులు లభింపకనా? పండితావరణ లేకనా? ప్రచురణ కర్త నిరాదరణయా లేక రచయితల వైముఖ్యమా? లేక ఇంకేవైనా కారణాలా? మన ఆంధ్రమున ఉద్దండ పండితులు ఎందరో కలరు. వారి దృష్టి ఆనంద రామాయణంపై ప్రసరింపలేదు. అలాగే ఉత్తమ ప్రవచనకారులు వున్నారు. కానీ వీరలెవ్వరు ఆనంద రామాయణముపై ప్రవచనములిచ్చిన దాఖలాలు లేవు. అవాల్మీకములైన అంశములు ఇందు కలవు అనా? లేక మరొక కారణమా?

ఆనంద రామాయణ గ్రంథమును తెలుగులో తాత్పర్యముతో కలిపి శ్రీ సత్యాత్మానందగారు ఇటీవలే ప్రచురించి యున్నారు. వారికి నా కృతజ్ఞతాపూర్వక వందనములు. ఇకముందు అయినను ఈ గ్రంథరాజము ఆంధ్రమున ప్రాచుర్యము నందగలదని నా ఆకాంక్ష.

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 8 (39) హైదరాబాద్ జూన్ : 2024

# మహాభారతం: 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు–6

డా. అట్టెం దత్తయ్య , సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

**'ధనమేరా అన్నిటికీ మూలం ఆ ధనం విలువ తెలుసుకునుటె మానవ ధర్మం...'** అనేది చాలాసార్లు నిజమే అనిపించే మాట. సమాజం మాత్రం ఎప్పుడైన ధనవంతులనే గౌరవిస్తుంది. ధనం ముందు కొన్నిసార్లు కులం, గుణం, రూపం, జ్ఞానం మొదలైనవి కూడా మోకరిల్లుతాయి. అట్లని అన్నిటిని ధనంతో సాధించలేరు. ధనంతో పరుపుల్ని కొనచ్చు, కానీ నిద్రను కొనలేరు. పుస్తకాల్ని కొనచ్చు, కానీ జ్ఞానాన్ని కొనలేరు. తిండిని కొనచ్చు, కానీ ఆకలిని కొనలేరు. ఇలా ధనంతో కొనలేనివి ఎన్నో ఉన్నాయి. అందుకే అన్నిటికీ ధనమే పరిష్కారం అనుకుంటే పొరపాటు. ధనం జీవితంలో భాగం మాత్రమే. డబ్బుమాత్రమే జీవితం కాలేదు. కాకూడదు. ఈ ధనాన్ని గురించి ధర్మరాజు మూడు ప్రశ్నలు అడిగాడు. వాటికి భీష్ముడు సమాధానాన్ని లౌకికంగా, తాత్త్వికంగా, ఆధ్యాత్మికంగా అందించాడు.

**ప్రశ్న : "ధనవంతులు, పేదవారు ఇద్దరిలో ఎవరు సుఖంగా ఉంటారు".** (శాంతి. 4. 32)

దానికి సమాధానంగా శమ్యాకుడు అనే విప్రుడు తనతో చెప్పిన మాటలను భీష్ముడు వివరించాడు. అతడు కడు పేదవాడు. కుటుంబాన్ని వదిలిపెట్టినవాడు. కూడుకు గుడ్డకు కూడా కటకట పడుతున్నాడు. ఒక రోజు భీష్ముడి వద్దకు వచ్చాడు. ప్రసంగవశాన కొన్ని మాటలు చెప్పాడు. అందులో మాటలనే భీష్ముడు ఈ ప్రశ్నకు సమాధానంగా తెలియజేస్తున్నాని విన్నవించాడు.

ధనాన్ని, దరిద్రాన్ని త్రాసులో వేసి చూస్తే దరిద్రంవైపే ముల్లు మొగ్గింది. అదేలా అనుకుంటారు? కాని వాటి గుణదోషాలు కూడా వివరించాడు.

ధనవంతుడు ఎప్పుడు మృత్యువు నోట్లో వున్నట్లు ఉంటాడు. నిప్పు, దొంగలు మొదలగు వాటికి భయపడుతూ ఉంటాడు. అంతేకాదు కోపం, లోభం పెరిగిపోయి ఎప్పుడు చింతలో మునిగి ఉంటాడు. అదంత దుఃఖం కాక, సుఖం ఎలా అవుతుంది?

నిర్ధనుడు ఎక్కడైన స్వేచ్ఛగా ఉంటాడు. అతనికి భయమనేదే ఉండదు. ఉండి లేదని చెప్పుకునే కపటత్వం ఉండదు. మృదువుగా మాట్లాడుతాడు. అట్లాంటి వారిని దేవతలుకూడా మెచ్చుకుంటారు కదా!

లోకం తీరును గమనించాలి. కంటికి కనిపించే ధనాదులు అన్ని కాల ప్రవాహంలో నశించిపోయేవే అని తెలుసుకుని, వాటిని ఎప్పుడైనా, ఎక్కడైనా విడవడం చాలా మంచిది.

**"ధనవత్త్వము దుఃఖకరం**

**బని కని తత్కాంక్ష విడుచు నతని కధనతా**



**జనితాత్మాధీనత్వం**

**బనుపమ సౌఖ్యంబు సేయు నక్షీణముగన్"** (శాంతి. 4. 38)

ధనవంతులుగా ఉండడం దుఃఖహేతువు. ఇది తెలుసుకుని ధనం మీద కాంక్షను వదిలిపెట్టాలి. పేదరికం వల్ల కలిగే ఆత్మస్వేచ్ఛ అంతులేని సుఖాన్ని కలిగిస్తుంది అనే విషయాలను తెలియజేసాడు.

ఇది బుద్ధి తెలిసిన ప్రతి మనిషికీ అవసరమైన ప్రశ్న. ధనవంతులే సుఖంగా ఉంటారని చాలామంది అపోహ. కొందరు సుఖం పొందడానికి ప్రధాన ఆధారం ధనమే అనుకుంటారు. ఈ సమాధానంలో ధనవంతుడి, పేదవాడి మనత్సత్వాలను కూడా తెలియ జేసాడు. ధనవంతుడు రకరకాల భారీలనుండి తప్పించుకోవడానికి, కోపాన్ని, లోభాన్ని అహాన్ని పెంచుకుంటాడు. బీదవారికి ఈ బాధలేదు. ఎవరితో ఎటువంటి అవసరం పడుతుందో అని వినయంతో ఉంటాడు. మృదువుగా మాట్లాడుతాడు. సత్ప్రవర్తనతో ఉండడానికి ప్రయత్నిస్తాడు.

ఇక్కడ ప్రశ్నకు తగ్గట్టుగా సమాధానాన్ని ఆచీ, తూచి వివరించాడు. కలిమిలేములు ఒక పరిమాణంలో ఉండే వస్తువులు కావు తూచడానికి. వాటి వల్ల కలిగే అర్థ, అనర్థ పరిణామాల్ని అంచన వేసుకోవాలి. ఈ సృష్టిలో కనిపించేది ఏదైనా కరిగిపోవాల్సిందే. అది ప్రకృతి ధర్మం. ధనం కూడా కనిపిస్తుంది, అంటే అది కరిగి పోతది అని తెలుసు. కరగనీయకుండా ఇంకా పెంచుకోవాలనే అందరి ఆశ. అందుకే ఇక్కడ కాపాడుకోవడంలో పడి ధనానికి దాసులుగా మారుతారు. అట్లాంటి వారిని కోపం, లోభం ఆవహిస్తాయి. అటు తర్వాత వారు సాధారణ మనశ్శాంతిని కోల్పోతారు. ఎంతో శ్రమిస్తే తప్పా ధనం రాదు. దానిని అనుభవించడం, లేదా దానం చేయడం సుఖదాయకం, పుణ్యదాయకం. ఈ రెండు చేయనపుడు దానిని కాపాడుకోవడం కోసం సంపాదించినదాని కంటే ఎక్కువ

శ్రమపడాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని వెన్నెలకంటి సూరన కూడా ఇలా చెప్పాడు.

**అర్థ మార్జించునపుడును నది సురక్షి**
**తంబు గావించునపుడునుఁ దద్వియోగ**
**మైన యప్పుడు దుఃఖంబెకానియెందుఁ**
**గలిమి సుఖమని చెప్పుట కానివలుకు** (వెన్నెలకంటి సూరన.వి.పు.VIII-374) సంపాదించడంలో దుఃఖమే. కాపాడుకోవడంలో దుఃఖమే అయినపుడు అత్యంత ధనం అనారోగ్యకరం.

**బధిరయతి కర్ణవివరం, వాచం మూకయతి నయన మంధయతి**
**వికృతయతి గాత్రయష్టిం, సంపద్రోగోయ మద్భుతో రాజన్**
(విష్ణుస్మృతి)

ఐశ్వర్యమనే రోగం బహు విచిత్రమైనది. అది సోకిన వారికి చెవులు వినబడవు. నోరు మాటాడ పెగలదు. కళ్ళు మూసుకు పోతాయి. శరీరం వికృతంగా మెలికలు తిరుగుతుంది. ఐశ్వర్య మదరోగమునకు దారిద్రమే మందు అని చెప్పబడింది సుమా.

సుభాషిత రత్నావళిలో కూడా ధనానికి మూడు గతులు అని చెప్తాడు. అందులో మొదటి రెండు చేయకుంటే మూడవది అప్రయత్నం జరిగిపోతుంది.

**దానము భోగము నాశము**
**పూనికతో మూఁడుగతులు భువి ధనమునకున్**
**దానము భోగము నెఱుఁగని**
**దీనుని ధనమునకుగతితృతీయమె పొసగున్**
(ఏ.ల.కవి.సుభా.నీతి.)

వీటిన్నిటిని గమనిస్తే సామాన్యమైన జీవితమే చాలా గొప్పది. అతి ధనవంతుడుగా జీవించాలని అనుకోకూడదు. ధనవంతుడివి కావాలనుకుంటున్నావంటే నీ ఆరోగ్యాన్ని, సుఖాన్ని, మర్యాదని కోల్పోవడానికి సిద్ధపడుతున్నావని అనుకోవాలి. ఉన్నదానిలో నలుగురికి ఉపయోగపడుతు బ్రతకడంలో ఉన్న కమ్మదనం ఎక్కడలేదు. ధనం సంపాదించి దానిని రకరకాల పద్ధతులతో కోల్పోవడం కంటే ధనం లేని జీవితమే చాలా సుఖదాయకమైనది. ఈ సందర్భంగా తిరుపతి వెంకటకవుల పద్యపాదాలను గుర్తుచేసుకోవాలి.

**ధనముబాసిన నరు జీవితంబుకంటే**
**ధనము లేకున్న నరు జీవితంబు మేలు** (తిరుపతి వేంకటకవులు.మృచ్ఛకటికము.V.71)

❖ ❖ ❖ ❖ ❖

ప్రశ్న: **“ధన దాహంతో ఉన్నవారు ఎలా సుఖపడుతారు?”** (శాంతి.4.39) అని అడిగాడు.

దీనికి సమాధానంగా భీష్ముడు “ధనార్జనంబుతోడి విసువుటం బుట్టిన విడుపున సుఖంబు గలుగు.” (శాంతి.4.39) అంటే ధనం సంపాదించడంలో విసిగిపోయి విరక్తిచెందినపుడే సుఖపడుతాడు, అని ఏక వాక్యంలో సమాధానం చెప్పాడు. అట్లాగే దానికి సంబంధించిన మరో కథను కూడా తెలియజేసాడు.

మంకి అని ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి అత్యంత ధనదాహం. అతడు పనినేర్పవలసిన వయసులో ఉన్న రెండు కోడెలను కొన్నాడు. అవి బాగా మదించి ఉన్నాయి. వాటికి ఒక కానికట్టి విడిచిపెట్టాడు. అవి పరుగెత్తే దారిలో ఒక ఒంటె పడుకుని ఉంది. దాని మీది నుంచి వెళ్ళబోయాయి. ఒంటె బెదిరి హఠాత్తుగా లేచింది. కోడెలు ఒంటెకు రెండు వైపుల రెండు వేలాడబడ్డాయి. ఉ రిపడి చనిపోయాయి. ఏడుస్తూ చుట్టుముట్టిన జనాలతో మంకి ఇలా పలికాడు.

**ఆలోచిస్తే పురుషప్రయత్నం కంటే దైవబలమే కార్యసిద్ధికి ముఖ్యం. ఎప్పుడు మనిషి ప్రయత్నం ఫలించినట్లు కనిపించినా అది దైవబలం వల్ల జరిగిందనే అనుకోవాలి. సుఖంకోరే వారు ధనం సంపాదించే అతి వ్యాపారం విడిచిపెట్టడం మంచిది.**

కోరికలను వదిలిపెడితే కాని మనసుకు ముక్తిలేదని విచారించడం మొదలుపెట్టాడు. దానికి తగిన చిత్తవృత్తిని కుదుర్చుకున్నాడు. కోరిక మూలాన్ని తెలుసుకున్నాడు. అది సంకల్పం నుండి జనిస్తుందని గమనించాడు. సంకల్ప స్పర్శలేని మనోముద్ర వహించి దానిని నశింపచేస్తానన్నాడు. సుఖం పొందడానికి ధనం మూలం కావచ్చు, కాని అది కోరినంత మాత్రాన రాదు. దానికై ప్రయత్నించాలి. ప్రయత్నించినా సిద్ధించకపోవచ్చు. సిద్ధిస్తే మాత్రం ఆ ధనంతో పాటు అనేక కష్టాలు కూడా వుంటాయి. సిద్ధించక ఓడిపోవడం చావుతో సమానం. ఎటుచూసిన దుఃఖమే కాబట్టి కోరికలు మానుకోవడం మంచిది. కోరికను తిరస్కరించడంలోనే నిజమైన సుఖం ఉంది.

దుఃఖానికి, కష్టానికీ కోరికలె మూలం. కోరికల పాలబడ్డ వారు ఏం చేయ్యాలో తెలుసుకోలేరు. అందువల్ల దానికి దూరంగా ఉండి సుఖపడుతాను. దాని కారణాన తీవ్రంగా కష్టించి సొమ్ము సంపాదించి, దానిని దాచడానికి, రక్షించడానికి కష్టపరంపర పెరుగుతుంది. కాబట్టి కోరికను వదిలివేయడం వల్ల ఎటువంటి విచారమూ, దైన్యమూ ఉండదు.

**“సులభమొ దుర్లభంబో యని చూడ నెఱుంగవు గన్నదానిపై**
**నలముదు కామమా! యిదుమ లందఁగఁ జేయుదు నిండు టేమిటం**
**గలుగదు నీకు నీ తెఱఁగగాధ రసాతల భంగి నీవు స**
**న్పొలమునఁ బోవకుండ నినుఁ బుచ్చెద బచ్చెన రూపు పోకలన్”**
(శాంతి.4.51)

“ఓ కామమా! నీ దృష్టి నీది. నీ కన్నుపడిన వస్తువు సులభమో కాదో పట్టించుకొనవు. తృప్తి అన్నమాట లేనేలేదు నీకు. అగాధమైన

పాతాళం నీ దారి. నీ దారిని నేను పోను. నిన్ను మాయ బొమ్మను తరిమినట్లు తరుముతావు" అని పద్యభావం. ధనం వెంట పరుగెత్తి దైవం ప్రతికూలించిన కారణాన ధననాశం పొంది, విసిగి వేసారి కోరికను సంపూర్ణంగా తిరస్కరించాడు. కామతిరస్కారంతో అతనిలోని కోపం నశించింది. ఇంద్రియ నిగ్రహం కలిగింది. ఓర్పు నెలకొన్నది. ప్రాణులయెడ కరుణ పాదుకున్నది. కాబట్టి ఇకపై అతనిని కోరికల తోబుట్టువలైన లోభం యొక్క గుణాలు కూడా స్పృశించలేవు.

కోర్కెలు ఈడేరటం వల్ల కలిగే సుఖం, స్వర్గంలో లభించే సుఖం – ఈ రెండు సుఖాలూ పోల్చిచూసినపుడు కోరికను త్యజించటం వల్ల కలిగే సుఖం ముందు దిగదుడుపే. కాబట్టి కోరికను శత్రువువలె చంపి, బ్రహ్మలోకం చేరుతాను అన్నాడు.

కోడెలు హఠాత్తుగా మరణించగా మంకికి ధనాశమీద విరక్తి కలిగి, కామాన్ని మొత్తంగా పరిత్యజించి, సుఖంగా దేవసమానంగా జీవించాడని భీష్ముడు బోధించాడు.

ఆ కాలంలో అన్ని వర్గాల వారికి పశుసంపదే ప్రధానమైన ధనం. అందులో రెండు కోడెలను పెంచుకోవడం అనేది గొప్ప ధనవంతుడు అని తెలియజేస్తుంది. వాటిని కొనడానికి, పెంచడానికి, తీర్చి దిద్దడానికి ఎంతో శ్రమ, కాలం, మనసు వెచ్చించి ఉంటాడు. అవే సర్వస్వంగా బ్రతికి ఉంటాడు. మమకారం పెంచుకుని ఉంటాడు. కాని అవి ఒక్క క్షణంలో విగత జీవులు అయ్యాయి. ఏది ఎవరి దగ్గర ఎంతకాలం ఉంటుంది అనేది ఎవరిచేతుల్లో లేనివిషయం. ఇక్కడ ధనాన్ని కోడెల రూపంలో చూపించాడు. కాని ఏదైనా సంపాదించుకోవల్సిందే, కొన్ని రోజులకి అకాలంగానో, సకాలంగానో పోగొట్టుకోవల్సిందే. ఈ కథలో కోడలు చనిపోవడం సహజమే. వాటిని పోగొట్టుకోవడం వల్ల నేర్చుకున్న విషయాలు గమనించ దగినవి.

ధర్మరాజు "ఎలాసుఖపడుతారు?" అని అడిగిన ప్రశ్నలో మామూలుగా అయితే సుఖపడే అవకాశం లేదు. కాని ఇంకే విధంగానైన సుఖపడుతారా? అని అర్థం ధ్వనిస్తుంది. భీష్ముడు పలికిన మొదటి వాక్యంలో ధనదాహంలో ఉన్నంత కాలం సుఖపడలేదు. విరక్తులు అయితేనే అది సాధ్యం అని తేల్చేసారు. ఈ ఒక వాక్యం చాలు. అయినప్పటికీ మరో కథ ఆధారంగా వివరించాడు.

ధనం మీద వ్యామోహాన్ని పెంచుకుని, దానిని పెంచుకోవడం అనేది తనను తాను దుఃఖానికి గురిచేస్తున్నాడని అనుకోవాలి. సుఖంగా ఉండాలంటే జీవనానికి సరిపోయేంత ధనం సంపాదించు కోవడం మంచిది. ధనం ఎక్కువ సంపాదించుకోవాలనుకోవడం కోరిక. సంకల్పం వల్ల కోరికలు కలుగుతాయి. వీటివల్లనే నచ్చినదానిని, మనసు పడ్డదానిని సాధించుకోవడానికి, తర్వాత దానిని పెంచుకోవడానికి, రక్షించుకోవడానికి పడే ప్రయాస దుఃఖప్రాయమైనది. ముందుగా కోరికలను అరికట్టడం వల్ల కోపం, లోభం, దమం, శమం మొదలైనవి అన్ని వారి చెప్పుచేతుల్లో ఉంటాయి. వీటి తర్వాత పొందే సుఖం స్వర్గ సుఖం కంటే కూడా గొప్పది. ఈ విషయాన్ని నారాయణకవి హితోపదేశం ఇలా తెలియజేస్తుంది.

**"ధనం తావదసులభం, లబ్ధం కృచ్ఛ్రేణ రక్ష్యతే**
**లబ్ధనాశో తథా మృత్యుః, తస్మా దేత న్న చింతయేత్"**
(హితోపదేశం. నారాయణకవి. 1–178)

ధన సంపాదనం చాల కష్టం. సంపాదించిన దానిని రక్షించుట మరీ కష్టం. లభించిన ధనం పోనూవచ్చు, లేదా తానే మృతి నొందను వచ్చు. గాన ధనాన్ని గూర్చి అంతగా వ్యసనపడుట మంచిది కాదు అని భావం. తాను అనుభవించని దాని కోసం జీవితాంత శ్రమించి, పోగుచేసి, కాపలిదారుగా ఉండి కష్టాలు పడడం ఎందుకు?

**అర్థమ యనర్థ మూలం**
**బర్థమ మాయా విమోహనావహము, నరుం**
**డర్థార్జన దుఃఖమున న**
**పార్థీకృత జన్ముడగుట పరమార్థ మిలన్** (అరణ్య. 1.28)

అరణ్యవాసం కాలంలో శౌనకుడు పాండవుల వద్దకు వచ్చి నీతిబోధ చేస్తు చెప్పిన పద్యం ఇది. లోకంలో అన్ని అనర్థాలకు ధనమే మూలం. మాయా మోహాలకు డబ్బే కారణం. మనిషి ధనార్జనలో పడి దుఃఖీభూతుడై వ్యర్థ జన్ముడౌతున్నాడు అని తెలియజేస్తుంది. ఈ విషయం గురించి మంచన కేయూరబాహు చరిత్రలో **"పసిడి మీద నాస పాటిన మనుజుండు / తనకు వచ్చుకీడు తలప గలడె..."** (మంచన.కేయూర. IV. 78) ఇలా ఎన్నిటిని తిరిగేసిన అన్ని బోధించేది ఒకటే. ధనం మీద అత్యాశ మంచిది కాదు. అందువల్ల ధనదాహంతో ఉన్నవాడు ఎప్పుడు సుఖపడలేదు అని తెలుసుకోవచ్చు.

**ఆయమేవ పరో ధర్మః, ఇయమేవ విదగ్ధతా**
**ఇద మేవ హి పాండిత్యం, యదాయాన్నాధికో వ్యయః** (విష్ణుస్మృతి)

ఆదాయాన్ని మించి వెచ్చించకూడదు అనేదే పరమధర్మం, అదియే గొప్ప పాండిత్యం, జ్ఞానం కూడాను. దీనిని పాటించినవాడు జీవితంలో దుఃఖం నొందడు.

❖ ❖ ❖ ❖ ❖

ప్రశ్న: **"వారివల్లనో, ఇతరులవల్లనో సంపదను కోల్పోయి అగచాట్లు పడేవారు వారి బాధను ఎలా దిగమింగుకోవాలి?"** (శాంతి. 3.26)

కోసలదేశపు రాజు క్షేమదర్శి విదేహదేశపు రాజు చేతిలో రాజ్యాన్ని కోల్పోయి చాలా బాధలు పడ్డాడు. అతని దగ్గర పూర్వం మంత్రిగా చేసి ప్రస్తుతం అడవులలో బతుకుతున్న కాలకవృక్షీయుడి దగ్గరకు వెళ్ళి తలదాచుకున్నాడు. ఆ రాజు కాలకవృక్షీయుడిని ఇట్లాంటి ప్రశ్ననే అడిగాడు. అతడు చెప్పిన మాటలు తెలియజేస్తాను అని

భీష్ముడు సమాధానం చెప్పడం మొదలు పెట్టాడు.

సమస్త సుఖాలు అనుభవించేటప్పుడు డబ్బు ఎప్పుడు అట్లాగే ఉండదు. అది అనిత్యమైనది. దానికి నేను బానిసను కాకూడదు' అని అనుకునే వారికి డబ్బు ఉన్నా పోయినా చీకూ చింతా ఉండదు. ఒకొక్కపుడు కాదేమో అనుకున్న పని సులభంగా నెరవేరుతుంది. అయిపోతుంది అనుకున్న పని కాకపోవచ్చు. పని ఫలిస్తే సంతోషం, ఫలించకపోతే విచారం. విజ్ఞానులు ఈ రెండింటిని ఒకేలాగ చూస్తారు.

**జననీ జనకులును సుహృ**
**జ్జనులును దెగునపుడు గావఁ జనమి దెలియదే**
**ధనములు వారలకంటెనె**
**మనుజేశ్వర! వగపు వాని మగిడించునొకో!** (శాంతి.3.29)

తల్లిదండ్రులను, ఆప్తులను కాపాడుకోలేని మనిషి ధనాన్ని ఎలా కాపాడుకోగలడు? ఇది కూడా అశాశ్వతమైనదే. ఉపాయం కలిగినవారు, బలంగలవారు లోకంలో చాలామంది ఉన్నారు. ఎట్లాంటివారికైనా సిరి శాశ్వతంగా లేదు. ధీరుడైనవారు ధనం పోయినా దుఃఖపడరు. అనుకోకుండానే సిరి పోతుంది. అలాగే కోరకుండానే సంపద వచ్చి పడుతుంది. మనిషిని సిరి వదిలేస్తుంది. సిరిని మనిషి వదిలేస్తాడు. ఇందులో వింతేమిలేదు. ఇట్లాంటి సమయంలో మనిషి ఫలితాన్ని కోరుకుంటూ మాట్లాడకుండా మౌనంగా ఉండడం సరైనపని.

**గతమునకును వగవ కనా**
**గతమునకును నోరుదెఱచి కదుఁ గోరక దీ**
**నతఁబొందక దైవం బే**
**గతిఁ బుచ్చిన దానఁ బోదుఁగా కనవలయున్** (శాంతి.3.30)

అయిపోయిన దానిని గూర్చి విచారించి ప్రయోజనం లేదు. కాబోయే వాటిని గూర్చి ఆశ పనికి రాదు. దైన్యాన్ని దరిదాపులకు రానీయరాదు. దైవం ఎట్లా నడిపిస్తే అట్లా నడవక తప్పదు అనే నిశ్చయానికి రావాలి అని భీష్ముడి సమాధానం.

ఈ ప్రశ్న ఇప్పటి సమాజానికి చాలా అవసరయోగ్యమైంది. ఐశ్వర్యవంతులుగా జీవించిన వారు ఏవేవో కారణాల వల్ల ధనాన్ని కోల్పోగానే మనస్తాపం చెంది ఆత్మహత్యలకు గురవుతున్నారు. ధన సంపాదనకు ప్రయత్నించి విఫలుడైనవారి కంటే సఫలుడై కొంత కాలానికి అది కోల్పోయినవారే భరించలేని బాధకు గురవుతారు. డబ్బు అశాశ్వతమైనదనే సత్యాన్ని కూడా తెలుసుకోలేక పోతారు. ఈ సమాధానంలో భీష్ముడు చక్కని ఉదాహరణ ఇచ్చాడు. డబ్బు సంపాదించుకోవడం తనను, తనవారిని సుఖపెట్టడం కోసం, రక్షించుకోవడం కోసం. అంటే డబ్బుకంటే తను అయినా తనవారైన గొప్పవారే. స్వయాన తల్లిదండ్రులను, ఆప్తులను కాపాడుకోలేని వారు, డబ్బును ఎలా కాపాడుకోగలడు. ఎన్నిరకాల బలాలు కలిగిన వారైనా ధనాన్ని కాపాడుకోలేరు. డబ్బురావడం పోవడం మనిషి చేతిలో లేనిపని. ఈ విషయాన్ని పంచతంత్రం శ్లోకం చిన్నప్పటినుండి అందరి బోధిస్తూనే ఉంది.

**ఆజగామి యదా లక్ష్మీః నారికేళఫలాంబువత్**
**నిర్గగామ యదా లక్ష్మీః గజభుక్తకపిత్థవత్** (పంచ.సూ.ము.153)

కొబ్బరికాయలో నీళ్ళమాదిరి ధనం ఎలా వస్తుందో ఎవరికి తెలియదు. ఏనుగు మింగి వదిలిన ఎలగకాయలో మాయమైన గుజ్జుమాదిరి ఏవిధంగా మాయమైపోతుందో కూడా ఎవరికీ తెలియదు. కొన్ని పనులు నెరవేరడం వల్ల డబ్బు వస్తుంది అనుకుంటారు కాని, రాదు. కొన్నిపనుల చేయడం వల్ల ధనం రాదు అనుకుంటారు కాని, ఊహించనంతగా వస్తుంది. ధనం రావడం కూడా మనిషి చేతిలో లేనప్పుడు, పోకుండా ఉండాలనుకోవడం దురాశ.

చివరగా శ్రీకాలహస్తీశ్వర శతక పద్యంతో ముగిద్దాం.

**తరగల్ పిప్పల పత్రముల్ మెఱుగుటద్దంబుల్ మరుద్దీపముల్**
**కరికర్ణాంతము లెండమావులతతుల్ ఖద్యోత కీట ప్రభల్**
**సురవీధీ లిఖితాక్షరంబు లసువుల్ జ్యోత్స్నా పయః పిండముల్**
**సిరులందేల మదాంధులౌదురు జనుల్ శ్రీకాళహస్తీశ్వరా!**

**ఆధార గ్రంథాలు** :

1. అప్పలస్వామి, పురిపండా. **'వ్యావహారికాంధ్ర మహాభారతం'** (శాంతి పర్వము). 1976. రాజమండ్రి: ప్రాచీన గ్రంథావళి.

2. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. **'శ్రీమహాభారతము'** (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.

3. విశ్వేశ్వర శాస్త్రి, జన్నాభట్ల. సంపా. **'మహాభారత వైజయంతి'** (తొమ్మిది సంపుటాలు). 2006. గుంటూరు : భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

4. వెంకటరత్నం, గుంజి. **'మహాభారత విజ్ఞాన సర్వస్వం'** 2021. హైదరాబాదు : ఎమెస్కో.

5. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. **'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము'** (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.

6. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. **'మహాభారత విమర్శనము'** (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

# ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు కథలు – సామాజికాంశాలు

**గద్దల అనిల్,** తెలుగు పరిశోధక విద్యార్థి, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. ఫోన్ : 990 865 5086

ప్రవేశిక:

**"పిల్లల్లారా పాపల్లారా రేపటి భారతపౌరుల్లారా**
**పెద్దలకే ఒక దారిని చూపే పిన్నల్లారా పిల్లల్లారా**
**మీ కన్నుల్లో పున్నమి జాబిలి**
**ఉన్నాడు, ఉన్నాడు పొంచున్నాడు**
**మీ మనసుల్లో దేవుడు కొలువై ఉన్నాడు"**

దాశరథి కృష్ణమాచార్యులు 'పిల్లల్లారా పాపల్లారా' అనే గేయ ఖండికలో పిల్లల గొప్పతనం, వారి కన్నుల్లో దాగి ఉండే పున్నమి జాబిలి, వారి మనస్సుల్లో కొలువై ఉండే దేవుడి గురించి వర్ణిస్తూ, నేటి పిల్లలే రేపటి భారతపౌరులు అనే విషయాన్ని ఆయన నొక్కి వక్కాణించారు. అయితే, తెలుగు సాహిత్యంలో బాల సాహిత్యం ఎప్పటి నుంచి ప్రారంభమైంది? ప్రాచీన కవులు ఏయే సందర్భాలలో బాలల గురించి ప్రస్తావించారు? ఆధునిక కవులు బాల సాహిత్యానికి చేసిన కృషి ఏమిటి? కవి, కథకులు ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు రాసిన కథల్లోని సామాజిక అంశాలను విశ్లేషించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.


**ప్రాచీన తెలుగు సాహిత్యంలో బాలల ప్రస్తావన :**

క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ కవి పాల్కురికి సోమన కాలం నుంచి తెలుగు సాహిత్యంలో బాల సాహిత్యం ప్రారంభ మైందని చెప్పవచ్చు. పాల్కురికి సోమన రాసిన బసవపురాణంలో మొట్టమొదటిసారిగా బాలలకు సంబంధించిన జోల పాటలు, ఆటలు ప్రస్తావించబడ్డాయి. 'జోసరచుచు సన్నుతిబాడు' అంటూ పిల్లలను నిద్రపుచ్చటానికి పాడే జోల పాటను రాశారు. వీటితోపాటు రాగుంజు పోగుంజులాట, కుందెన గుడి, చప్పట్లు, గుడిగుడి గుంజం గుంజారాగం, సిట్లపొట్లాట, దాగుడుమూతలు వంటి బాలల ఆటలను సోమన తొలిసారిగా సాహితీలోకానికి అందించారు.

ప్రాచీన బాల సాహిత్యం ఆనాడు అధికంగా గేయ రూపంలో ఉండేదని చెప్పవచ్చు. పాల్కురికి సోమన తర్వాత అనంతామాత్యుడు (భోజరాజీయం), కొరవి గోపరాజు (సింహాసన ద్వాత్రింశిక) మొదలైన కవులు సందర్భానుసారంగా వారి వారి గ్రంథాల్లో బాల సాహిత్యాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత క్రీ.శ. 15వ శబ్దానికి చెందిన పోతన తన భాగవతంలో బాలకృష్ణుని ఆటలను వర్ణిస్తూ, బాలలకు సంబంధించి రాసిన గేయాలు నేటికి ప్రచురంలో ఉన్నాయి. అన్నమయ్య రచించిన **"చందమామ రావే జాబిల్లి రావేబీ జో అచ్యుతానంద జోజో ముకుందా"** అనే పాటలు ఇప్పటికీ గ్రామాల్లో, పట్టణాల్లో వినిపిస్తున్నాయి. బాలల సాహిత్యం మొదట్లో ప్రత్యేకంగా లేదు. కాని రామాయణ, భారత, భాగవతాల్లోని చిన్న చిన్న నీతి కథలను పిల్లలకు అవసరమైన రీతిలో ఆనాటి పెద్దలు వినిపించేవారు.

**బాలల సాహిత్యం – ఆధునిక కవుల కృషి**

ఆధునిక తెలుగు సాహిత్యంలో బాలల సాహిత్యానికి కృషి చేసిన కవుల్లో ముందువరసలో ఉండే కవి గురజాడ అప్పారావు. బాలల కోసం ఆయన కొన్ని ప్రత్యేక గేయాలు రాశారు. ఆ తర్వాత చలం సమకాలినుడైన చింతా దీక్షితులు 'లక్క



పిడతలు' అనే పేరుతో బాలల కోసం ఓ సంపుటి వెలురించారు. తెలంగాణలో ప్రసిద్ధులైన కవి పండితులు డా.సి.నారాయణ రెడ్డి, దాశరథి కృష్ణమాచార్యులు, పి.యశోదారెడ్డి, డా.కపిలవాయి లింగమూర్తి, గడియారం రామకృష్ణ శర్మ మొదలైనవారు బాలల కోసం అనేక పద్యాలు, గేయాలు, నీతి కథలు, నాటికలను, నవలలు, జీవిత చరిత్రలు రచించి, బాల సాహిత్యానికి ఎనలేని కృషి చేశారు.

వారితోపాటు ఆచార్య బిరుదురాజు రామరాజు 'తెలంగాణ' పిల్లల పాటలు, త్రివేణి పిల్లల పాటల పేర్లతో పుస్తకాలను వెలువరించారు. గడియారం రామకృష్ణశర్మ 'వీరగాథలు' అనే బాలవీరుల కథలను, మనింకోదు రామయ్య 'తాతయ్య కథలు', 'ఆశాలువ' నవల, దీక్ష, ఆహుతి, పాకాల యశోదారెడ్డి నక్కబావ, బడిపెద్ద, బుచ్చిగాడు వంటి చాలా కథలను రచించి, బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

**ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు పరిచయం :**

ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు (సరబాద ముఖ్య ప్రాణ్‌రావు)గా ఆధునిక తెలుగు సాహిత్యంలో రచయితగా, నవలాకారుడుగా, కథకుడుగా గుర్తింపు పొందిన కవి. వీరు వైవిధ్యమైన, విశేషమైన ఇతివృత్తాలను ఎన్నుకొని చారిత్రక, సామాజిక అంశాలతో రచనలు కావిస్తున్నారు.

రచనా వ్యాసంగానికి ముందు వీరు సినిమా రచయితగా ప్రసిద్ధులు. ఆంగ్లసాహిత్యంలో బి.ఏ., ఎం.ఏ., పూర్తి చేసిన ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు ఇప్పటివరకు మొత్తం 24 రచనలు చేశారు. అందులో ఒక కథా సంపుటి, రెండు కవితా సంపుటాలు, రెండు నాటకాలు, పందొమ్మిది నవలలను రచించారు.

**ఎస్.ఎమ్.ప్రాణ్ రావు చెలిమి కథలు – సామాజిక అంశాలు:**

**చెలిమి కథలు**

ఎస్. ఎమ్. ప్రాణ్‌రావుగారు కథకులుగా కూడా ప్రసిద్ధులు. బాలల సాహిత్యానికి పెద్ద పీట వేసేందుకు 'చెలిమి' పత్రిక ఎంతో కృషి చేసింది. ఆ క్రమంలో ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు గారి కథలు కూడా వెలువడ్డాయి. ఈ పత్రికలో రావుగారు కొంత కాలం పని చేశారు. ఆ సమయంలో రాసిన కథలే ఒక సంపుటిగా వెలువడ్డాయి. ఇది 1993లోనే వెలువడిన కథల సంపుటి. ఇందులో మొత్తం 10 కథలు ఉన్నాయి. అవి :

1.బేరం 2.దుష్టగ్రహం 3.కుంటికులాసం 4.చదువు 5.ఎలక్షన్‌ఆట 6.అమ్మ 7.పుట్టినరోజు కానుక 8. డిగ్నిటీ 9.నెత్తుటి సూరీడు 10.ముసుగు ఉంగరం.

చిన్న తరగతులలోని బడి పిల్లలకై ప్రత్యేక శ్రద్ధతో రచింపబడినప్పటికీ, పెద్దవారికి గూడా ఉపయోగకరంగా వుంటాయి. ప్రతి కథ వెనుక ఒక సందేశము, నీతి, సంస్కృతికి, సామాజిక ప్రయోజనం సంబంధించిన అంశములు ఉన్నాయి. కాని ఈ నీతి బోధ బాహాటంగా, ప్రచార ధోరణిలో ఉండదు. చదవటానికి ఆసక్తికరమైన కథలలో విజ్ఞానమునకు వినోదం జోడించి, రావుగారు పాఠకలోకానికే గాక విద్యా రంగానికి ఎంతో సేవ చేశారు. మానవతా విలువల్ని కాపీరైటింగ్ బుక్కుల్లో చెప్పినట్టు చెప్పకుండా, చిన్న పిల్లలు వాళ్లంతట వాళ్లు తెలుసుకుని అంతర్గతం చేసుకొనేలాగా సున్నితంగా తెలియబరచారు. దీనినే ఆధునిక బోధనా విధానంలో తనంతటతాను తెలుసుకునే పద్ధతి (Discovery Method) అంటారు.

నేటి ప్రపంచములో, ముఖ్యంగా మన దేశంలో విలువలు నానాటికీ క్షీణించిపోతున్నాయి. పాలకులలో, రాజకీయ వేత్తలలో అధికారులలో – చివరికి న్యాయాధికారులలో, అధ్యాపకులలో కూడా – నైతిక విలువలు అట్టడుగు స్థాయికి దిగజారిపోయాయి. ఈ అతి ముఖ్యమైన సమస్యను అన్ని కోణాల నుంచి ఎదుర్కోవలసి ఉంది. ఈ దిశలో రావ్ గారి కథలు ఒకప్రయోగాత్మకమైన చర్యగా పరిగణించవచ్చును.

**1. బేరం**

ఎంతోమంది అమాయకులను బంగారం వ్యాపారులు ఎలా మోసం చేస్తున్నారు. అదే విధానం 'బేరం' కథలో కూడా కనిపిస్తుంది.

రాజు అనాథ అయినా తనకు తెలిసిన పనిని చేసుకొంటూ బతికాడు. శివయ్య లాంటి మరో వ్యక్తికి ఆసరాగా నిలిచాడు. కానీ తప్పుడు మార్గం పట్టలేదు. కానీ మంచితనం ముసుగులో మానిక్ చంద్ మాత్రం నిర్దాక్షిణ్యంగా, నిర్లక్ష్యంగా ఇద్దరు అమాయక కుర్రవాళ్ళను మోసం చేస్తాడు. చెత్తకుండీలో దొరికిన బంగారపు కెంపుల ఉంగరాన్ని అమ్ముకొని దారిద్ర్య విముక్తులవుదామని బంగారు కలలు గన్న ఆ అనాథ బాలురు దురాశా పీడితుడైన ఆ వర్తకుని మాయలోపడి మోసపోతారు. ఈ ప్రపంచములో మానిక్ చంద్ వంటి మోసకారి ధనికులు కోకొల్లలు. అట్టివారు దైవ భక్తులుగా ప్రజోపకారులుగా నటించి సంఘంలో చెలామణి అవుతారు. మనదేశ దారిద్ర్యానికి ఈ గోముఖ వ్యాఘ్రూలే కారకులు. ఇందులో విద్యార్థులకు ఉపయోగపడే అంశాలు కొన్ని ఉన్నాయి. 1. తల్లి దండ్రులు లేకుండా పిల్లలు భారత దేశంలో బ్రతుకుతున్నారు. వారి పరిస్థితి ఇది అని చూపించడం. 2. చదువుకోకపోతే సమాజం ఎలా మోసం చేస్తుందో చెప్పడం. 3. ఎవరు ఏ పని చేసినా తప్పు కాదు. కానీ వారివారి చిత్తవృత్తిని బట్టి ఎలా ఉంటారు అనేది తెలుస్తుంది. అంటే కథలో రాజు, శివయ్యలు చేసే పని గుర్తింపు లేని పని. ఎవరూ చేయకూడదు అనుకొనే పని. కానీ వారు నిజాయితీపరులు మంచివారు. మానిక్ చంద్ చేసే పని అందరూ ఇష్టపడే బంగారం వ్యాపారం. కానీ అతడు మోసగాడు. డబ్బును చూసి గౌరవం ఇచ్చే ఈ సమాజంలో వ్యక్తిత్వాన్ని చూసి గౌరవం ఇవ్వాలని చెప్పడం ఇందులో బాలలకు చేసే సూచన. ఇలాంటి సందర్భమే చాగంటి సోమయాజులు గారి 'కుంకుడాకులు' కథలో కూడా కనిపిస్తుంది. అది కూడా ఆర్థికవిధానంతో ముడిపడి ఉంటుంది.

**2. దుష్టగ్రహం**

ఈ కథ ఈ నాడు మన ప్రజలలో చదువుకున్న వాళ్లలో కూడా పాతుకుపోయిన మూఢ విశ్వాసాలకు అద్దం పడుతుంది. చిలక జోస్యం ప్రభావంలోపడి సోమరిగా, అల్లరి పిల్లవాడిగా మారిన రంగారెడ్డి అనే పిల్లవాడిని సుశీల అనే టీచరు మంచి మార్గానికి తీసుకువస్తుంది. జాతకాల పిచ్చిలో పడి తమ కర్తవ్యం మరచిన వారికిది కను విప్పు. ఉత్తమ ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పటంతో తృప్తి పడక, తమ విద్యార్థుల జీవితాలను కూడా సరిదిద్ది, వారిని సన్మార్గవర్తనులుగా చెయ్యాలి. చేస్తారు అనేది ఇందులోని ధ్వని. టీచర్ కూడా కేవలం పాఠం వరకే పరిమితం కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను కూడా తీసుకోవడం కథలో ప్రధానం. దీనికి దుష్టగ్రహం అని పేరు పెట్టడం కూడా సముచితం. గ్రహ పదం వినగానే జాతకాలు, వాటిని నమ్మే ఒక విద్యార్థి పాత్ర పాఠకులకు స్ఫురించవచ్చు.

**3. కుంటి కులాసం**

ఈ కథలో చిన్న పిల్లలలో ఉండే అల్లరి స్వభావం, చిలిపి చేష్టలు చాలా సహజంగా చిత్రించబడ్డాయి. శేఖర్ అనే కుర్రవాడు

వికలాంగుడైన తన స్నేహితునికి 'కుంటి కులాసం' అని పేరు పెట్టి హేళన చేస్తూ ఉంటాడు.

వేణు, గిరి, శ్యాంబాబు, శేఖర్ నలుగురూ మిత్రులు. ఏడవ తరగతి విద్యార్థులు. నలుగురూ రోజంతా కలిసే తిరుగుతారు. వాళ్ళకు దుష్ట చతుష్టయం అని పేరు. నలుగురికీ నాయకుడు శేఖర్. అదే తరగతిలో సాయిరాజ్ అనే అబ్బాయికి పోలియోవల్ల ఒక కాలు చచ్చుపడిపోతుంది. అతనికి శేఖర్ 'కుంటి కులాసం' అని పేరు పెడతాడు. ఎక్కడ కనిపించినా అలాగే పిలుస్తాడు. 'కుంటి కులాసం ఇంటికి మోసం' అంటూ పాటలు కూడా పాడతాడు. దానినే తన మిత్రులు కూడా అవకాశంగా తీసుకొని సాయిరాజ్ ని హేళన చేస్తూ ఉంటారు. సాయిరాజ్ ఉండేది పక్క ఊరిలో ఇంతలో వెనక ఎవరో వస్తున్నట్టు అనిపిస్తుంది. ఒక విజిల్ వినిపిస్తుంది. వెనక శేఖర్ వస్తున్నట్టు గమనిస్తాడు. "ఏయ్ కుంటి కులాసం" అని గట్టిగా అరుస్తాడు శేఖర్. తన పేరు కుంటికులాసం కాదని, తన పేరు సాయిరాజ్ అని చెబుతాడు. శేఖర్ వస్తే ఇంకా ఎక్కువ హేళన చేస్తాడని సాయిరాజ్ వేగం పెంచుతాడు. ఆ వేగంలో అనుకోకుండా గోతిలో పడిపోతాడు. అది బాగా లోతుగా ఉన్న గొయ్యి. నీళ్ళు, రాళ్ళు ఉండవు. కానీ లోతుగా ఉండడంతో సాయిరాజ్ కాలు బెణుకుతుంది. నిలబడడానికి ప్రయత్నిస్తాడు కానీ సాధ్యం కాదు. పైన నిలబడి చూస్తున్న శేఖరును సాయం చేయమని బతిమాలుతాడు. శేఖర్ మాత్రం గోతిలో ఉన్నది ఎవరు అని అడుగుతాడు. "నేను" అంటాడు సాయిరాజ్. "నేనంటే పేరు లేదా?" అంటాడు. "సాయిరాజ్" అంటాడు. ఆ పేరు నేను వినలేదు అంటాడు శేఖర్. తన తండ్రితోనైనా చెప్పమని సాయిరాజ్ బతిమాలతాడు. ఏమని చెప్పాలి అని అడుగుతాడు. నేను గోతిలో పడ్డానని అంటాడు సాయిరాజ్. మళ్ళీ నేను అంటే ఎవరు అని అడుగుతాడు శేఖర్. అలా చాల సేపు ఇద్దరికీ మధ్య కీచులాట జరుగుతుంది. చివరికి శేఖర్ వేధింపును తట్టుకోలేక సాయిరాజ్ 'నా పేరు కుంటి కులాసం' అని గట్టిగా ఏడుస్తాడు. డొక్కలు ఎగిరిపడేలా హృదయ విదారకంగా ఏడుస్తాడు. దానికి శేఖర్ మనసు కరిగిపోతుంది. వెంటనే గోతిలోకి దూకి, తన చొక్కాతో సాయిరాజ్ కన్నీళ్ళు తుడుస్తాడు. ఎవరైనా సాయిరాజ్ ను పల్లెత్తు మాట అన్నా వాళ్ళ భరతం పడతా అంటాడు. సాయిరాజ్ ను తన భుజాలపై ఎత్తుకొని పైకి తీసుకు వస్తాడు.

ఈ కథ ప్రతి బడిలో, కళాశాలలో జరిగే వేధింపుల నేపథ్యానికి సంబంధించినది. అది తరువాత తర్వాత ర్యాగింగ్ గా మారి ఎందరి ప్రాణాలనో బలి తీసుకున్నది. అది పెచ్చి పెరిగిపోవడంతో ప్రభుత్వం anti-ragging act ను ప్రవేశ పెట్టింది. ఎవరు ర్యాగింగ్ చేసినా వాళ్ళు జైలు పాలు అవుతారు. వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. దానివల్ల కొంచెం ర్యాగింగ్ తగ్గింది.

# కాకి సమయం

కట్ట మీదంగా
ఆత్రంగా చూసే కళ్ళు
కుళ్ళుబోతుల మాటలమధ్య
నలిగిపోయే ఇస్తారాకు



కాకులు
ఓ చెట్టు మీది నుండి
ఇంకో చెట్టు మీదికి
గింగిరాలు కొడుతూ

గంగిరెద్దుల
గిట్టలమధ్యలోంచి గొణిగే
పైసల గొంతు
వంతులు వంతులుగా
గుండెనిండుగా
నీళ్ళారబోత



ఇస్తారాకు నడుమ కురిసిన
ఇష్టమైన పదార్థాల ప్రేమవర్షం

కాకి
మనుషులను గెలిపించుకునే
సమయం
బతికిన కాలాన
చేతితో పంచిన
అన్నం మెతుకుల లెక్క తీసే
ఆఖరి కీలక ఘట్టం



పిట్ట ముట్టితేనే
ఆత్మ బతికినట్టు
లేకుంటే
గాలి వానలకు కూలిపోయి
చెట్టులాగే,
చడీ చప్పుడు లేనట్టు



**డా. తండ హరీష్ గౌడ్**
సిద్ధి పేట, ఫోన్ : 897 843 9551

**4. చదువు**

ఈ కథ చదువును ఆధారం చేసుకొని రాయబడిన కథ. ఇందులో మొదటి నుండీ చదువునే ఎక్కువ ఫోకస్ చేస్తూ వచ్చారు రచయిత. అలాగే చివరిలో చదువు గురించిన సంభాషణ, పరీక్షలు వాటితోనే ముగుస్తుంది కూడా. కానీ కథ మొత్తం రాజుకు కుక్క కరవడం, రాజు కుక్క మీద జాలి చూపించి వైద్యం చేయించడంపై నడుస్తుంది. అక్కడ రాజు చదువు కంటే అతను చూపిన మానవత్వం ఎక్కువ ఎలివేట్ అయ్యింది. అందుకే రాజు తల్లి కుక్కకు వైద్యం చేయిస్తూ సమయం వృథా చేస్తున్నా ఏమీ అనకపోవడం, డాక్టరు మెచ్చుకోవడం, జంతువుల డాక్టరు, చివరికి శారద టీచరు మెచ్చుకోవడం జరిగింది.

నిజంగా కథ చదువు కోణం నుండి రాయబడినది అయితే రాజు చదువు సంబంధించిన కథను, కథనాన్ని చదువు కోణంలోనే ఇంకా బలంగా చెప్పాలి. కానీ ఇక్కడ చదువు గురించి చెబుతూనే, సామాజికత, మానవత్వం ఎక్కువ ఎలివేట్ అయ్యేలా కథాకథనాలు ఉన్నాయి.

**5. ఎలక్షన్ ఆట**

మొత్తం పది కథల్లో నేటి సమాజానికి అద్దం పట్టే కథ ఇది. ఎప్పుడో 20 ఏళ్ళ క్రితం నాటి రాజకీయ వ్యవస్థ ఎలా ఉందో చెప్పడానికి ఉపయోగపడుతుంది. అది నేడు అంత దుర్మార్గమైన స్థితికి చేరుకుందో అంచనా కట్టవచ్చు. ప్రస్తుత రాజకీయాల్లో పేరుకు పోయిన కల్మషం. రాజకీయ వేత్తల శుష్క వాగ్దానాలు, అవినీతి, నిజమైన ప్రజా శ్రేయస్సుపై అశ్రద్ధ మొదలగు అవలక్షణాలను పిల్లలు ఆడుకొనే ఎలక్షన్ ఆట అనే ముసుగులో చూపిస్తుంది. తెలివైన విద్యార్థులు పిన్న వయస్కులైనప్పటికీ, పెద్దల దుశ్చర్యలను గమనిస్తూ, భావి పౌరులుగా, ఓటర్లుగా తమ బాధ్యతలను నిర్వర్తించటానికి తయారుగా ఉన్నారని,ఈ కథ రేఖామాత్రంగా సూచిస్తుంది. ఇది రాజకీయ వేత్తలకు ఒక గుణపాఠం.

1. భ్రష్టు పట్టిన రాజకీయ వ్యవస్థను. 2. రెండు పేదరికాన్ని. ఆ రెండూ 20 ఏళ్ళ క్రితం ఎలా ఉండేవో చూపించారు. ఇప్పుడు ఎలా ఉన్నాయో మనం చూస్తున్నాం.

ఈ కథ ముగింపులో మాత్రం రాజారావు మాటలద్వారా రాజకీయ వ్యవస్థలో మార్పును చూపిస్తూ పాఠకుడికి ఒక ఆశావహ దృక్పథాన్ని కల్పించారు రచయిత. అది ఈ కథకు అవసరం. ఈ కథ పరిధి అంతే. కానీ సమాజం అలా లేదు.

**6. అమ్మ**

ముగ్గురు అమ్మల పాత్రలను తీసుకొని సముచితంగా చిత్రీకరణ చేయడం ఇందులో మనం గమనించవచ్చు. ముందు చెప్పినట్లు తల్లి ప్రేమ, కొంత సామాజిక బాధ్యతను ఇతివృత్తంగా తీసుకొని నడిపించిన కథా నిర్వహణలో ఒక గొప్ప సూత్రాన్ని రచయిత పాటించారు. పైన పేర్కొన్న ముగ్గురు అమ్మల క్రమాన్ని గమనిస్తే ముందు చంద్రయ్య తల్లి, తరువాత తుపాకీ అబ్బాయి తల్లి, ఆ తరువాత చంద్రయ్యను చేరదీసిన తల్లి కథలో మనకు కనిపిస్తారు.

ఒక క్రమ పద్ధతిని పాటిస్తూ, ఔచిత్యం దెబ్బతినకుండా కథనాన్ని నడిపించి కథకు బలాన్ని చేకూర్చారు రచయిత. అందుకే ఈ కథ విద్య, వైజ్ఞానిక విషయాలకు సంబంధించినది కాకపోయినా, సామాజికాంశాల కోణంలో విద్యార్థులకు ఎక్కువగా ఉపయోగ పడుతుంది. అమ్మతనం గురించి కాబట్టి అందరూ కథతో లీనమయ్యేలా చేస్తుంది. శీర్షికకు న్యాయం చేస్తుంది.

**7. పుట్టినరోజు కానుక**

ఈ కథ పిల్లలలో ఉండే అల్లరి, చిన్ని చిన్ని దొంగతనం వంటి చెడు అలవాట్లు ఎంత పెద్ద నష్టాన్ని కలిగిస్తాయో తెలియజేస్తుంది. సాధారణంగా చెడు అలవాట్లు వారి జీవితాలకు విఘాతం కలిగిస్తే, ఈ కథలో మాత్రం అవతలి వ్యక్తులకు వాటిల్లే భర్తీకాని నష్టాలను వివరించే కథ ఇది.

రుక్కయ్య ముసలాయన. ఆయన బడి బయట జామకాయలు అమ్ముకొనే వ్యక్తి. గేటు దగ్గరే ఉంటాడు. తన వ్యాపారం సరిగ్గా జరిగినా జరగకపోయినా రుక్కయ్య సుందర్ సింగ్ కి ఒక రూపాయి ముట్ట చెప్పాలి. లేదంటే ఇంటర్వెల్ సమయంలో, లంచ్ సమయంలో పిల్లల్ని బయటికి వెళ్ళనివ్వడు. లేదంటే గేటు ఆలస్యంగా తెరిచి తొందరగా మూసేస్తాడు. దానితో పిల్లలు బయటకు రాలేరు.. అందుకే రుక్కయ్య మాత్రమే కాదు. మిగిలిన వ్యాపారులు కూడా సుందర్ సింగ్‌కు తలో రూపాయి ఇవ్వాల్సిందే.

ఒకరోజు అమర్చిన జామకాయల బండి దగ్గర పిల్లలు గుమిగూడి ఉంటారు. వారిలో గోపి కూడా ఉంటాడు. గోపికి 12 ఏళ్ళు ఉంటాయి. గోపి, సజ్జు మిత్రులు. తోడు దొంగలు కూడా. రుక్కయ్యకు కళ్ళు సరిగా కనిపించవు. అది ఆసరాగా చేసుకొని అతని దగ్గర ఎప్పుడూ జామకాయలు కొనరు. చేతికి అందినవి దొంగిలించి తింటూ ఉంటారు. ఈ మధ్య రుక్కయ్య అదోలా ఉంటున్నాడు జామకాయలు కూడా ఎక్కువ తేవడం లేదు అని అనుకుంటారు. తరువాత రోజు లంచ్ సమయంలో గేటు బయట ఉండడు. అతని కోసం వెతుక్కున్న గోపి రుక్కయ్య ఎక్కడ అని జానీమియాని అడుగుతాడు. "ఇంకేం వస్తాడు. దివాలా తీశాడు. కిరాయి కట్టనందుకు బండి సొంతదారు బండి లాక్కుపోయాడు. అప్పుల వాళ్లు ఇంటి మీద పడి చెంబు, తప్పేలా తీసుకుపోయారు, దాంతో పాపం, రుక్కయ్య వీధిని పడ్డాడు" అంటాడు జానీమియా. నెత్తి మీద ఎవరో సుత్తితో కొట్టినట్లనిస్తుంది గోపికి, 'అదేమిటి, రుక్కయ్య దివాలా తీయడమేమిటి! అంతా అతని దగ్గరే కొనేవారుగా' అంటాడు ఎలాగో గొంతు పెగుల్చుకొని. అంతా కొనేవారు కాదు. కొందరు దొంగతనం

కూడా చేసేవారు. రుక్కయ్యకు చూపు సరిగ్గా ఆనేది కాదు. అది అదునుగా తీసుకొని దొంగ వెధవలు రోజూ కాయలు –కాజేసేవాళ్లు. దాంతో పాపం రుక్కయ్యకు వ్యాపారంలో పైసా మిగలక పోగా అప్పులు పెరిగిపోయాయి. వడ్డీలు పేరుకుపోయాయి. అందుకే ఏ దిక్కూ లేని రుక్కయ్య నెత్తిన గుడ్డ వేసుకొని పట్నం పోయ్యాడు.


సంక్రాంతి సెలవులు ఇస్తారు. గోపి వాళ్ళ మామయ్య ఇంటికి వెళ్తాడు. తన పుట్టిన రోజు కావడంతో గోపి తండ్రి బట్టలు కొనుక్కోవడానికి 250 రూపాయలు పంపుతాడు. వాటికి 50 రూపాయలు జోడించి బట్టలు కొనుక్కోమని ఇస్తాడు. మామయ్య, గోపి ఇద్దరూ కలిసి బట్టలు కొనుక్కోవడానికి వెళ్తారు. బస్‌స్టాప్ లో బస్సు కోసం నిలబడి ఉంటారు.. ఇంతలో గోపి. పక్క నుండి ధర్మ చేయండి బాబూ అంటూ ఒక గొంతు వినిపిస్తుంది. ఆ గొంతు ఎక్కడో విన్నట్టు అనిపిస్తుంది గోపికి తిరిగి చూస్తే అడుక్కుంటూ కనిపిస్తాడు రుక్కయ్య. గోపికి కడుపులో తిప్పినట్టు అవుతుంది. చెమటలు పడతాయి. బాధ పడతాడు. తేరుకొని ఒక నిర్ణయానికి వస్తాడు. తన జేబులో నుండి డబ్బులు తీసి రుక్కయ్య గిన్నెలో వేసేసి వస్తాడు. ఏమైంది అని అడుగుతాడు లాలనగా. కళ్ళ నుండి ధారగా పడుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ పొల్లు పోకుండా అంతా చెబుతాడు. అంతా విన్న సారథికి ఆనందం కలుగుతుంది. గోపి చేసిన పనికి మెచ్చుకుంటాడు.


ఈ కథారచనలో రావుగారి చక్కని సహజత్వం, రచయితగా ఆయనకున్న అనుభవం, చిన్న పిల్లల మనస్తత్వం అర్థం చేసుకునే నేర్పరితనం కనిపిస్తాయి. కథలో చిన్నచిన్న వ్యాపారుల దైన్యమైన జీవితాన్ని వర్ణించిన విధానం కరుణ రసాత్మకంగా పాఠకుల హృదయాలను పిండేస్తుంది.

8. డిగ్నిటీ

ఎవరు ఏ పని చేసినా అది తప్పుడు పని కానంతవరకూ సిగ్గు పడకుండా చేసుకోవడమే అంత పెద్ద పని చేసినా తప్పుడు మార్గాన్ని అనుసరిస్తే అది డిగ్నిటీ అనిపించుకోదని తెలియజేసే కథ. అరవింద్ చిన్నతనంలోనే కష్టపడి చదువుకోటమే కాకుండా, తండ్రియొక్క లంచ గొండితనాన్ని నిరసించి, తాను పార్ట్ టైమ్ ఉద్యోగం చేసి తల్లికి, సంసారానికి సహాయపడతాడు. (%ఖుఖితీ- ఎఅఎవ%) ఉద్యోగం చేస్తూ –చదువు సాగించటం పాశ్చాత్య దేశాలలో అమలులో ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే మన దేశంలో ఆచరణలోకి వచ్చింది. దీనినే (%జుఖితీఅ ఔష్ట్రఅశ్రీవ ఎశీబ ూఖుతీఅ%) పద్ధతి అంటారు. అలా పని చెయ్యడానికి విద్యార్థులు ఎంతమాత్రం సిగ్గుగాని, నామోషి గాని పడనక్కరలేదు. అందులో హుందా తనం (%ణఱస్త్రఅఱ్వ%) ఉంది.

ఈ కథ చాలా బలమైన కథ. పరువు కూపంలో కూరుకు పోయిన ఒక తండ్రిని మార్చిన 15 ఏళ్ళ తనయుడి కథ. నేటి సమాజంలో



పరువు, పరువు హత్యలు మరింత పేరుకుపోయిన వైనానికి ఇది గొడ్డలి పెట్టు.

ప్రముఖ చలనచిత్ర నటులు చిరంజీవిగారు నటించిన, ప్రముఖ దర్శకులు బాల చందర్ గారు దర్శకత్వం వహించిన "రుద్రవీణ" సినిమా కూడా ఇలాంటి తరహాదే. పరువు పరువు అంటూ తాతల నాటి సంగతులు చెప్పి అభ్యుదయ భావాలను కలిగిన కొడుకును నివారించే తండ్రికి తన చేతలతో కనువిప్పు కలిగించేదే రుద్రవీణలోని ఇతివృత్తం. చివరికి తండ్రి మారడం ఈ రెండు కథల్లోని చక్కని ముగింపు. ఇది పిల్లల కోసం రాసినా పెద్దలకు ఎక్కువ ఉపయోగ పడే కథ.

**9. నెత్తుటి సూరీడు**

ఈ కథ విషాదాంత కథ. తాగుబోతు తండ్రికి తెలియకుండా రిక్షా తొక్కుతూ సంపాదించుకొనే అబ్బాయి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఒక పిల్లవాడి కథ.

యాదయ్యకు 12 ఏళ్ళు ఉంటాయి. తండ్రి రిక్షా తొక్కుతాడు, వచ్చిన డబ్బులను తాగేస్తూ కుటుంబం పట్ల బాధ్యత లేకుండా ఉంటాడు. పొట్ట చేత పట్టుకొని పట్నం వచ్చిన వారి కుటుంబం ఒక మురికివాడలో గుడిసెలో కాపురముంటారు. యాదయ్య తండ్రి రాజయ్య రిక్షా తొక్కుతాడు. తండ్రి మధ్యాహ్నం భోజనానికి వచ్చి తిన్న తరువాత రెండు గంటలు పడుకోవడం అలవాటు. ఆ సమయంలో యాదయ్య రిక్షా తొక్కి డబ్బులు సంపాదించి వాటితో తనకు కావలసినవి కొనుక్కుంటాడు. కొన్ని తల్లికి ఇస్తాడు. తండ్రికి తెలిస్తే ఆ డబ్బులు కూడా లాక్కొని తాగేస్తాడు.

ఒకరోజు ఎప్పటిలాగే తండ్రి పడుకున్నాక రిక్షా తీస్తాడు యాదయ్య. పది రూపాయలైె సంపాదించాలి. అయిదు రూపాయిలు వాళ్ళ అమ్మకు ఇచ్చి, మిగలిన 5 రూపాయలతో బొబ్బిలి రాజా సినిమాకి వెళ్ళాలి. అదే అతని టార్గెట్. ముగ్గురిని ఎక్కించుకొని 6 రూపాయలు సంపాదిస్తాడు. ఇంకా నాలుగు రూపాయలు అవసరం. సమయం తక్కువగా ఉంటుంది. చివరిగా ఒకరిని ఎక్కించుకుంటాడు.

వాళ్ళ నాన్న లేచే సమయం అవుతంది. తండ్రి లేచే సమయానికి ఇంటికి వెళ్ళాలని హడావుడిగా వెళ్తూ ప్రమాదానికి గురై చనిపోతాడు.

ఈ కథ ఒక విషాదాంత కథ. పేదరికం ఒకవైపు, వ్యసనపరుడైన తండ్రి ఒక వైపు కుటుంబాన్ని ఆర్థికంగా క్రుంగదీయడం మన సమాజంలో ప్రతి చోట కనిపించే విషయమే. దానిని కథగా మలిచారు రావుగారు. కాకపోతే విధి కూడా పగబట్టి యాదయ్యను చంపడం అత్యంత హృదయ విదారక విషయం. దాన్ని రచనలో చూపించడంలో కృతకృత్యులయ్యారు రావుగారు.

బాధ్యత లేని తండ్రులు ఉన్న మన సమాజంలో కుటుంబ బాధ్యతను తీసుకోవడం వారి అవసరాలను వారే తీర్చుకోవడం వంటివి పిల్లలు చెయ్యాలి అని ఈ కథ బోధిస్తుంది. ఒక నిర్భాగ్యుని విషాధ గాథ హృదయ విదారకమైన దృశ్యాన్ని ఛాయాచిత్రంలాగ చిత్రించారు రచయిత. వాస్తవిక పరిస్థితులు, బీదల పాట్లు కళ్లకు కట్టినట్లుగా కనిపించి పాఠకుల హృదయాలని కదిలించి వేస్తుంది ఈ కథ.

అయితే వీరి కథల్లో శీర్షిక గురించి మాట్లాడాలి. శీర్షిక గొప్పగా ఉండడం కూడా ఆ రచనకు బలమే. ఈ కథల సంపుటిలోని కుంటి కులాసం, చదువు, అమ్మ, ఎలక్షన్ ఆట, పుట్టిన రోజు కానుక వంటి కథల శీర్షికలు నేరుగా విషయాన్ని చెప్పేస్తాయి కథలు. బేరం, డిగ్నిటీ కథలు విషయాన్ని నేరుగా చెప్పకపోయినా లోపలి విషయాన్ని అంచనా వేయడానికి ఉపయోగ పడతాయి. నెత్తుటి సూరీడు, ముసుగు ఉంగరం, దుష్టగ్రహం కవితాత్మక శీర్షికలు. ఒక రకంగా కవితాత్మక శీర్షికలు ఏ రచనకైనా మరింత బలం. పైగా పాఠకులను కూడా ఆకర్షిస్తాయి.

**10. ముసుగు ఉంగరం**

ఈ కథ ఒక గ్రహాంతర వాసి భూగ్రహం మీదకు వచ్చి ఇక్కడ జరుగుతున్న నేరాలు, ఘోరాలు అన్యాయాలను చూసి ఆశ్చర్యపోతాడు. ఇది ఆ కాలానికి గొప్ప ప్రయోగమే. గ్రహాంతరాలపై పరిశోధనలు ఎప్పటి నుండో జరుగుతున్నా ఈ మధ్య కాలంలో వాటి చర్చ జరుగుతోంది. పాశ్చాత్య దేశాలలో వాటిపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. భారతదేశంలో పీ.కే. వంటి సినిమాలు ఈ కోవకు చెందిన కథతో నిర్మించబడినవి. పీకే సినిమా 2014లో వచ్చింది. కానీ ఈ కథ పీకే సినిమా కంటే పదేళ్ళ ముందే వచ్చింది. ఈ కథలో ఇద్దరు కుర్రవాళ్లు – వాసు, శివ అనుకోకుండా పోగాల్ అనే విచిత్ర వ్యక్తిని కలుసుకుని స్నేహం చేస్తారు.

ఈ కథలో ఒక గ్రహాంతరవాసి, అతను ఎలా ఉంటాడు. అతని భాష, అతని ఆహారం, ఎలా వచ్చాడు. హైదరాబాదును చూడడానికి వచ్చినట్లు, ఇక్కడ విషయాలు, హైదరాబాదు చరిత్రకు కళంకం తెచ్చే కత్తిపోట్లు, మతకలహాలు, గృహదహనాలు వ్యంగ్యంగా విమర్శించబడ్డాయి. ప్రజలంతా అసూయ, ద్వేషం, హింసాత్మక చర్యలు మాని పరస్పరం స్నేహ భావంతో, మత సామరస్యంతో, ప్రేమతో జీవించాలనే సందేశం కూడా కనిపించేలా కథను అల్లారు రచయిత.


ఇందులో ఎస్.ఎస్. ప్రాణ్ రావు రాసిన చెలిమి కథల పుస్తకం ఎప్పుడు రాయబడింది. పుస్తకానికి ముందుమాట ఎవరు రాశారు. పుస్తకంలో ఎన్ని పిల్లల కథలు ఉన్నాయి. ఏయే కథల్లో ఏయే విషయాలు పిల్లల కోసం చెప్పబడ్డాయి అనే అంశాలను ప్రస్తావించు అనిల్..

**ముగింపు :**

'చెలిమి కథలు' అనే సంపుటిలో ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు పిల్లలకు సులభంగా అర్థమయ్యే భాషలో వారి మనస్తత్వం, స్నేహం, ఉన్నత విలువలతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తూ, చక్కని కథలు రాశారు. ఇలాంటి కథలు, రచనలు నేటి పిల్లలకు సాంఘికంగా, నైతికంగా ఎంతగానో ఉపయోగపడతాయని అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. నేడు బాలల వ్యక్తిత్వ వికాసానికి అవసరమయ్యే మరింత సాహిత్యం రావాల్సిన అవసరమైన ఎంతైనా ఉంది. కథలు, గేయాలు, కవితలు, వ్యాసాలు, కార్టూన్లు ఇలా ఏ రూపంలో వచ్చినా సరే, బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేయాల్సిన బాధ్యత కవులు, రచయితలపై ఉంది. పిల్లల శ్రేయస్సు కోరి ఎన్ని మంచి పుస్తకాలు వచ్చినా – మానవత్వం, పరోపకారం, పెద్దలను గౌరవించడం వంటి విషయాలు చెబుతూనే మిగతావాటి పైనా వారి అవగాహనకు తగిన రీతిలో చెప్పాలి. అప్పుడే సమాజానికి మంచి బాల సాహిత్యం ఇచ్చినట్లవుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు బాల గేయ సాహిత్యం – డా.యం.కె.దేవకి
2. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) – డాక్టర్. జి. నాగయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి
4. చెలిమి కథలు – ఎస్.ఎమ్.ప్రాణ్ రావు



# నిరంతర సాహితీ మూర్తి – శ్రీరంగస్వామి

డా. తిరునగరి శరత్ చంద్ర, ఫోన్ : 630 987 3682

ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిత,వ్యాసం,కథ వంటి ప్రక్రియల్లో విశేషమైన రచనలు చేసిన సాహితీవేత్తగా, విశిష్టమైన పరిశోధనానుభవంతో ఎందరో పరిశోధకులకు విలువైన సూచనల నందించిన మార్గదర్శకుడిగా, 'శ్రీలేఖసాహితి' సంస్థ ద్వారా ఎన్నో సాహిత్య కార్యక్రమాలను చేస్తూ, మేలైన సాహిత్యాన్ని రసజ్ఞులకు పంచిపెడుతున్న సాహితీపోషకుడిగా, దాదాపు 50 గ్రంథాలకు సంపాదకుడిగా..బహుముఖీనమైన ప్రతిభతో తన ముద్రను ప్రతిష్ఠించుకున్నారు డా.టి. శ్రీరంగస్వామి.

ప్రాచీన, ఆధునిక సాహిత్యాల్ని సమగ్రంగా అధ్యయనం చేసిన శ్రీరంగస్వామి ప్రతిభావ్యుత్పత్తులు అనన్యమైనవి. ఆయన ప్రతి వ్యాసం పరిశోధనాత్మకంగాను, ప్రతి కవిత ఆలోచనాత్మకంగాను, ప్రతి ప్రసంగం ప్రభావవంతంగాను ఉంటుంది. ఈ మూడు కోణాల్లోనూ ఆయనలోని సృజనాత్మకతాశక్తి వేయిముఖాలుగా కనబడుతుంది.

**పరిశోధకుడిగా :**

శ్రీరంగస్వామిలోని విస్తృతమైన పరిశోధనాదృష్టికి తార్కాణం ఆయన పిహెచ్.డి. గ్రంథం. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య పర్యవేక్షణలో 1994 సం.లో డాక్టరేట్ పట్టా అందుకున్న శ్రీరంగస్వామి పరిశోధనాగ్రంథం 'విశ్వనాథ వారి కృష్ణకావ్యాలు'. మహాకవి విశ్వనాథ వారి కృష్ణసంబంధమైన సాహిత్యాన్ని సహేతుకంగా అధ్యయనం చేసి, అపారమైన మేధాసంపత్తితో, నిరంతర పరిశీలనాదృష్టితో, పరిశోధనాపుష్టితో వెలువరించిన గ్రంథమిది. 'శృంగారవీథి', 'గోపికాగీతములు', 'భ్రమరగీతాలు', 'నందమూరు శతకం' మొ. విశ్వనాథ వారి రచనల్లోని కృష్ణతత్త్వాన్ని ఆవిష్కరించి పరిశోధనకు రమణీయతను చేకూర్చారు శ్రీరంగస్వామి. మొత్తం ఎనిమిది అధ్యాయాల్లో విశ్వనాథ సాహితీమూర్తిమత్వాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

విశ్వనాథ రామాయణ కల్పవృక్షంలో ఇముడనివి కూడా ఇందులో చెప్పబడ్డాయి. శృంగారవీథీ విహారము, శృంగారవీథీ – గీతగోవిందము మొ. ఘట్టాల్లో రాధాకృష్ణ ప్రణయతత్త్వాన్ని మధురంగా చిత్రించారు. రాధాకృష్ణుల విరహ సంయోగాలు, లీలావిలాసాలు మనోహరంగా చిత్రించబడ్డాయి. గోపికాగీతలు, భ్రమరగీతలు, రుక్మిణీ కల్యాణగాథ, శ్రీకృష్ణసంగీతము, వేణుసంతానగోపాలలీల మొ. ఘట్టాలలో శ్రీకృష్ణ స్వరూపం, శ్రీకృష్ణతత్త్వం మన హృదయం ముందు ఆవిష్కరిస్తారు. విశ్వనాథలోని భక్తితత్త్వాన్ని, ఆయనలోని శ్రీకృష్ణతత్త్వాన్ని, ఆయన అవగతం చేసుకున్న శ్రీకృష్ణ భగవానుని మూర్తిమత్వాన్ని ఈ పరిశోధనాగ్రంథంలో పట్టి చూపించే ప్రయత్నం చేశారు. ప్రతి పాఠకుడికి, పరిశోధకుడికి విశ్వనాథవారి కృష్ణసాహితిని చేరువ చేసిన ఆయన పరిశోధనాతృష్ణకు నమస్కరించాల్సిందే.

వేలయేండ్ల చారిత్రక వైభవం, సాహిత్యవైభవం కలిగిన నేల వరంగల్లు. ఎందరెందరో మహనీయులకు, కవులకు పుట్టినిల్లు. అలాంటి వరంగల్ జిల్లాలోని రచయితలను, కవులను పరిచయం చేస్తూ 'వరంగల్ జిల్లా రచయితల వాఙ్మయసూచిక' అనే గ్రంథాన్ని వెలువరించారు శ్రీరంగస్వామి. ఇది 1987 లో ముద్రితమైంది. ఈ పుస్తకం ప్రచురించేనాటికి ప్రచారంలో ఉన్న వరంగల్ జిల్లా కవులు, రచయితలను వారి ప్రసిద్ధ రచనల వివరాలను ఇందులో పొందుపరిచారు. ఎంతో లోతైన పరిశోధన చేసి ఈ పుస్తకాన్ని ప్రచురించారు. వరంగల్ జిల్లాలోని పల్లెపల్లెన, మూలమూలన ఉన్న ఎందరో కవులను, పండితులను వారి జీవితసూచికలను ఇందులో చూపించారు. ఎందరో మరుగునపడిన కవులకు ఈ పుస్తకం వేదికలాగా మారిందని చెప్పవచ్చు. ఈ పుస్తకానికి కాళోజి, దేవులపల్లి రామానుజరావు, కోవెల సుప్రసన్నాచార్య లాంటి ప్రముఖులు పీఠికలు రాశారు. శ్రీరంగస్వామి కృషి ప్రశంసనీయమైందని కొనియాడారు. ఈ పుస్తకంలో మొత్తం 10 ప్రకరణాల్లో 101 మంది కవుల రచనలు, వారి జీవితవిశేషాలు తెలియజేయబడ్డాయి. నేటికీ వరంగల్ జిల్లా సాహిత్యంపై పరిశోధన చేసే విద్యార్థులెందరికో ఈ పుస్తకం ఒక కరదీపికలా ఉపయోగపడుతూనే ఉంది.

**అంతేకాకుండా..**

కోవెల సుప్రసన్నాచార్యుల జీవిత, సాహిత్యవిశేషాలను తెలియజేస్తూ వారి వాఙ్మయ సూచిక ప్రచురించారు. దేవులపల్లి రామానుజరావు – ఒక రేఖాచిత్రం పుస్తకం ద్వారా రామానుజరావు సాహితీ మూర్తిమత్వాన్ని కూడా మన కళ్ళముందు ఆవిష్కరించారు శ్రీరంగస్వామి.

శ్రీరంగస్వామి 2016 లో 'వరంగల్ జిల్లా కథాసర్వస్వాన్ని' ప్రచురించారు. ఇందులో వరంగల్ జిల్లాకు చెందిన రచయితల 108 కథలున్నాయి. ఒక్కో రచయిత రాసిన ఒక్కో కథను సేకరించి ప్రచురించారు. 'దూపాటి శేషమ్మ' రాసిన 'పరివారక శిక్ష' కథ మొదలు 'నెల్లుట్ల రమాదేవి' రాసిన 'కాలం మారినా' కథ వరకు మొత్తం 108 ఉన్నాయి. ఆయా రచయితల, రచయిత్రులు రాసిన కథలు ఎక్కడ ప్రచురితమైనవో, ఏ కథాసంకలనాలవో వివరంగా తెలియజేశారు. శేషాద్రిరమణకవులు, ఒద్దిరాజు సోదరులు, పొట్లపల్లి రామారావు, దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్య, నందగిరి

ఇందిరాదేవి, బిరుదురాజు రామరాజు, పేర్వారం జగన్నాథం, అంపశయ్య నవీన్..ఇలా ఎందరో ప్రముఖుల కథలతో పాటు అజ్ఞాతంగా ఉన్న మరెందరో రచయితల కథలకు కూడా ఈ సంకలనంలో చోటు కల్పించారు. చారిత్రక విశేషాల్ని, ప్రాంతీయ నేపథ్యాన్ని, సామాజికాంశాలని పట్టి చూపించే ఎన్నెన్నో కథల్ని ఇందులో మనం చదవొచ్చు.

ఒకప్పటి మన మంత్రి టి.హయగ్రీవాచారి కూడా కథారచయితే అన్న విషయాన్ని తెలియజేస్తూ వారు రాసిన 'లలిత' అనే కథను కూడా ఇందులో పొందుపరచడం విశేషం. సంపాదకునిగా శ్రీరంగస్వామి అవిరళకృషికి తార్కాణంగా 'వరంగల్ జిల్లా కథాసర్వస్వం' నిలుస్తుందని నిక్కచ్చిగా చెప్పవచ్చు. విశ్వవిద్యాలయాల లోని ఎందరో పరిశోధక విద్యార్థులకు ఈ గ్రంథం కరదీపికగా నిలిచి ఉంది. నిలిచి ఉంటుందనడం అతిశయోక్తి కాదు.

**కవిగా :**

శ్రీరంగస్వామిలోని కవితాప్రతిభ కూడా మనకు ఆయన కవితా సంపుటాల్లో వేయింతలుగా దర్శనమిస్తుంది. 'నిరంతరం' అనే కవితా సంపుటిలోని ప్రతీ కవిత ఒక చైతన్యశకలంలాగా, నిరంతర ప్రవాహంలాగా పయనిస్తుంది. మచ్చుకు ఈక్రింది పంక్తుల్ని చూద్దాం.

**'గాజుపొరల్లోని బింబాల్లా**
**ఉల్లిపొర కాగితం కింది చిత్రంగా**
**ఆషాఢమాసపు మబ్బులాగా**
**హిమాంచలాంచలాల తొలిపొద్దులోని**
**పొగమంచుల్లాగా**
**జ్ఞాపకాలు నన్ను చుట్టు ముట్టుతూనే ఉన్నాయి'** ...అంటూ..
**'జీవనారణ్యంలో జ్ఞాపకాల తాళపత్రాలను**
**మేధలో పదిలం చేసుకుంటూ**
**మనుగడను సాగిస్తుంటాను.**
**జ్ఞాపకాల ఆటుపోటుల్లో**
**ఒక ఋషినై మసలుతుంటాను**
**సర్వాంగాలనూ కేంద్రీకరించి**
**జ్ఞాపకాల ఒడిలో విశ్రమించకుండా**
**జ్ఞాన చక్షువుల్లో రేగిన జ్వాలల్లో**
**తపస్తప్తుడనౌతాను'**

అంటూ జ్ఞాపకాన్ని ఒక తపస్సుగా భావిస్తూ, జీవితం అనే అరణ్యంలో జ్ఞాపకాలనే తాళపత్రాలను మేధలో పదిలంగా దాచుకుంటున్న శ్రీరంగస్వామి జ్ఞాపకాలతోనే తన జీవనప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతీ జ్ఞాపకం మధురాతిమధురమైనది కాకపోయినా ఒక అనుభవమేనన్న సత్యాన్ని ఈ కవితలో స్పష్టంగా చెబుతున్నారు.

జ్ఞాపకాలు తనను చుట్టు ముట్టుతూనే ఉన్నా , జ్ఞాపకాలతో తాను పరిమళిస్తూ, పరవశిస్తూ ఉన్నా, జ్ఞాపకాల ఒడిలోనే విశ్రమించి గతంలోనే ఆగిపోలేదు. గతానుభవాలన్ని పోగు చేసుకుని, వర్తమానాన్ని బాటగా చేసుకుని, భవిష్యత్ వైపు పరుగులు తీస్తున్న నిత్యాన్వేషిగా మనకు కనబడుతున్నారు.

మరొక చోట..


'మోదుగుపూల గలగలలు' అనే కవితలో..

**'ఉదయించే ఆశాకిరణాలకు**
**ఉవ్వెత్తున లేచే కెరటాలకు**
**ఉద్విగ్నమవుతున్న మనసులకు**
**ఉదీయమాన జిహ్వాలకు**
**వుదాత్తంగా**
**హృద్యంగా**
**సమవీక్షణంతో**
**అక్షరలక్షలనందించి**
**ఆలోచనాకేదారాలకు జీవం పోసిన**
**మీ భావఝరులు**
**మార్గదర్శకం..**
**మీ సాదాసీదామూర్తిమత్వానికి**
**మా మోదుగుపూల నీరాజనం'.** అంటూ కవిత్వంలో నిత్యచైతన్య రేఖలను విరజిమ్ముతారు శ్రీరంగస్వామి. ఇంకా..అమరజీవి పొట్టిశ్రీరాములు గురించి రాసిన 'అమరుడు' అనే కవిత, నిద్రాదేవత, ఆమనికోయిల, కంకణం, మయసభ వంటి కవితలెన్నో 'నిరంతరం' అనే కవితాసంపుటిలో తామరపూరేకుల్లా విచ్చుకుని కన్పిస్తాయి. ఇంకా..మధుర, శిఖరం, మానససంచరరే, సమజ్ఞ మొ. కవితాసంపుటులు ఆయన ప్రతిభకు మెచ్చుతునకలు.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**
**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**
**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

బోస్నియా హెర్జగోవినా దేశంలోని సరయేవో కవయిత్రి అజసా జహిరోవిచ్ కవితలకు అనుసృజనగా 'సరయేవో నుండి ఏకశిలకు' అనే కవితాసంపుటిని రాశాడు. ఇంకా ఎన్నో కవితల్ని హింది, ఇంగ్లీషుభాషల్లోకి అనువదించారు. 'నీలమోహనాష్టకం' అని వచనప్రక్రియలో తొలి అష్టకాన్ని రాసిన ఘనత కూడా శ్రీరంగస్వామికే దక్కుతుంది.

'సజీవచిత్రాలు' 'షుగర్ లెస్ కాఫీ' వంటి కథాసంపుటాలతో కథారచయితగా కూడా తన ప్రతిభను కనబరిచారు. ఉత్తమ కథకుడిగా తన అసాధారణ ప్రతిభను చాటి చెప్పారు శ్రీరంగస్వామి.

**ఉత్తమ విమర్శకుడిగా :**

విమర్శకుడికి ఉండవల్సిన ప్రధానమైన లక్షణం సాహిత్యంలో బాగోగులను నిర్ణయించడం. నిష్పక్షపాతంగా వ్యవహరించే దృష్టి కలిగి ఉండడం. తనకిది ప్రియమైన రచన అని, అది అప్రియమైన రచన అని, హెచ్చుతగ్గులు చూపించకూడదు. అలాంటి వారే నిజమైన విమర్శకులుగా రాణిస్తారు. అయితే ఈ లక్షణాలన్నీ విస్తృతమైన స్థాయిలో ఉండి, ఎంతో పరిణతితో పరిశోధనావ్యాసాలను అందించిన శ్రీరంగస్వామిని ఉత్తమ విమర్శకుడనడం ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఆయన రాసిన విమర్శనాత్మక వ్యాససంపుటాల్లో 'పొనుక' ఒకటి. ఇలా పుస్తకానికి పేరు పెట్టడంలోనే శ్రీరంగస్వామి ప్రతిభ ప్రదర్శితమవుతుంది.

'పొనుక' అంటే వ్యవసాయక ఉత్పత్తులను, వస్తువులను ఎడ్లబండిలో వేసి తరలించే వస్తువు అని అర్థం. ఎన్నెన్నో సాహిత్య సంగతులను, విశేషాలను ఈ వ్యాసాల రూపంలో భవిష్యత్ తరాలకు తరలిస్తున్నారు శ్రీరంగస్వామి. ఈ పొనుక వ్యాససంపుటి ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపునిచ్చిన గ్రంథం. ఇందులో మొత్తం 15 వ్యాసాలున్నాయి. స్వాతంత్ర్యం కోసం పోరాడిన తెలంగాణ రచయితల్ని, వారు ఉద్యమ కాలంలో ఎలా కవిత్వాన్ని ఆయుధంగా ప్రయోగించినారో ఆ విశేషాలను గురించి ఇందులో సవివరంగా తెలియజేశారు.

తెలంగాణవీరుడు సర్వాయిపాపన్న వీరపరాక్రమాలను, అతని జీవితనేపథ్యాన్ని గూర్చి వివరించారు. కళారూపాలను గురించి వాటి సమస్యలను గురించి, పన్నెండు మంది ఆళ్వారుల్లో ఒకరైన కులశేఖరాళ్వారు మధురభక్తితత్త్వాన్ని ఎంతో మధురంగా చెప్పారు. ఆముక్తమాల్యదలోని మాలదాసరికథలో సామాజిక తాత్త్వికాంశాలను కళ్ళకు కట్టినట్టు వివరించారు. మాలదాసరిలోని భక్త్యావేశాన్ని, నవవిధభక్తిమార్గాల్లోని ముగ్ధభక్తి మాలదాసరి పాత్రలో ఎలా ప్రతిఫలించి ప్రసరించిందో సహేతుకంగా తెలిపారు.

కాళోజి అనువదించిన ఖలీల్ జీబ్రాన్ కావ్యమైన జీవనగీతలోని కర్మయోగాన్ని, జీవనతత్త్వాన్ని, జీవనసత్యాన్ని మనం ఎలా మన జీవితాలకు అన్వయించుకుని ప్రవర్తించుకోవాలో తెలియజేశారు. జీవనగీత కావ్యంలోని ఆధ్యాత్మిక చింతనామృతాన్ని మనకందరికి పంచిపెట్టే ప్రయత్నం చేశారు.

**శ్రీరంగస్వామి విమర్శనాప్రతిభను చాటి చెప్పే మరో గ్రంథం 'విష్ణుపద'.**

విష్ణుపద అంటే గంగానది అని, ప్రవహించే గుణం కలిగినదని అర్థాలున్నాయి. ఇందులో మొత్తం 12 వ్యాసాలున్నాయి. తెలంగాణ మాండలిక సాహిత్యాన్ని గురించి, తెలంగాణ మాండలికంలో నిత్యం మన మాటల్లో దొర్లిపడే అచ్చింది, ఆన, అడ్లు, వత్తాన్న, పోతాన్న, గీడు, గట్ల, గిట్ల, గాడు, పెద్దీర్కము మొ. పదాలసొబగును, వాటి తాలూకు మూలాలను, వ్యవహారికపదాలకు, తెలంగాణపదాలకు ఉన్న సన్నిహితత్వాన్ని గూర్చి అద్భుతంగా వివరించారు.

ఓరుగల్లు ముద్దుబిడ్డలైన ఒద్దిరాజు సోదరుల గురించి, వారి ముద్రిత, అముద్రిత రచనల గురించి, సంస్కృతాంధ్ర ఆంగ్ల మొ.భాషల్లో వారికున్న ప్రావీణ్యాన్ని గురించి వారు రాసిన శాస్త్ర గ్రంథాలు, నిఘంటువులే సాక్ష్యంగా నిలుస్తున్నాయన్న సంగతుల్ని పట్టి చూపించారు.

ఉత్తర గోదావరీ పరీవాహిక సాహిత్యాన్ని గూర్చి ఎన్నో విషయాలు తెలియజేశారు. బాసర నుంచి భద్రాచలం వరకు ప్రవహించిన సాహితీగోదావరి పరవళ్ళను మనకు చూపించారు. నరసింహ శతకకర్త శేషప్పకవి, తెలంగాణలోనే తొలి శతావధాని కోరుట్ల కృష్ణమాచార్య, అభినవపోతన వానమామలై వరదాచార్య, శతావధాని శ్రీ అష్టకాల నరసింహ రామశర్మ, గీట్లజనార్ధనరెడ్డి మొ. కవుల సాహిత్యకృషిని గూర్చి వివరిస్తూ, ఉత్తర గోదావరి ప్రాంత దేవాలయాల, గ్రామాల చరిత్రను గూర్చి, వాటికి ఆ పేర్లు ఎలా వచ్చాయో సహేతుకంగా చర్చించి తెలిపారు. మరుగునపడి ఉన్న ఎన్నో విషయాలను మనకు ఉదాహరణలతో సహా అందించారు. ఆశ్చర్యపరిచే విశేషాంశాలను పరిశీలనాత్మకంగా వ్యాసాలరూపంలో పొందుపరిచారు శ్రీరంగస్వామి. ఇంకా..తెలంగాణ కవిత్వంలో అస్తిత్వవాదాన్ని గురించి వివరిస్తూ రాసిన వ్యాసాలు ఈ సంపుటి నిండా పదిలపరుచుకుని ఉన్నాయి. ఇవే కాకుండా విపంచి, సాహితీగవాక్షం, శ్రీవ్యాసం, మంచిమాట, సమూహ, విశ్వనాథ రామకృష్ణ లాంటి వ్యాససంపుటాలన్నీ ఆయనలోని విమర్శనాకోణాన్ని ఆవిష్కరిస్తాయి.

**సాహితీపోషకుడిగా – సంపాదకుడిగా :**

శ్రీరంగస్వామికి ఎన్నెన్నో సాహిత్యసంస్థలతో విడదీయరాని అనుబంధముంది. అంతే కాదు 1977 సం. లో 'శ్రీలేఖసాహితి' అనే సాహిత్యసంస్థను నెలకొల్పి దాదాపు 46 సం. లనుండి ఎన్నెన్నో సాహిత్య కార్యక్రమాలు, రాష్ట్రస్థాయి శతాధిక కవి సమ్మేళనాలను, సదస్సులను నిర్వహించారు. 'ఏకశిల వైతాళికులు', 'వరంగల్

సాహితీమూర్తులు', 'భాగవతదర్శనం', 'తెలంగాణ సాహిత్య స్వరూపాలు', 'రామాయణ దర్శనం', 'సాహిత్యంలో మధురభక్తి', 'వరంగల్ జిల్లా కథాసర్వస్వము' వంటి వ్యాససంకలనాలకు, తెలుగు సంవత్సరాల పేర్లతో ముద్రించిన 'శుక్ల' , 'ప్రమోదుత', 'ఈశ్వర', 'చిత్రభాను'వంటి కవితాసంకలనాలకు, 'శ్రీలేఖ', 'తెమ్మెర', 'సౌరభం' వంటి కథాసంకలనాలకు మొ. 50 పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. శ్రీలేఖసాహితి నుంచి దాదాపు 120 వరకు పుస్తకాలు ప్రచురించారు..ఇటీవల 'వెలుగులగుత్తి', 'మనకాంతిపుంజాలు' అనే సాహిత్యవ్యాససంపుటులను కూడా ప్రచురించారు.

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, ఆలేరు వారి తేజసాహిత్య పురస్కారం, విజయనగరం వారి సాహిత్య పురస్కారం, కళాజ్యోతి ధర్మవరం వారి సీరిపి ఆంజనేయులు సాహిత్య పురస్కారం మొ. ఎన్నో గౌరవ పురస్కారాలను, సత్కారాలను, ఒంగోలు వారి 'సాహిత్యరత్న', కళాజ్యోతి గోదావరిఖని వారి 'దశాబ్ది ఉత్తమ విమర్శకుడు' మొ. బిరుదులెన్నో అందుకున్నారు..

అంతేకాకుండా..ఆయన రాసిన 'నీలమోహనాష్టకం' ప్రొఫెసర్ వరదాచారి, ప్రొ.జి.దామోదర్, ప్రొ.వి.వి.బి.రామారావు గార్లు ఆంగ్లంలోకి, ప్రొ.సి.హెచ్.రాములు, ప్రొ.ఆర్.మాధవరావు, శ్రీమతి వడ్డాది లక్ష్మీసుభద్ర గార్లు హిందీలోకి, శంకరగంటి రంగాచార్యులు కన్నడంలోకి, డి.శ్రీనివాసదీక్షితులు సంస్కృతంలోకి అనువదించారు. శ్రీకృష్ణశ్శరణం మమ పేరుతో కంపెల్ల రవిచంద్రన్, నీలమోహనాష్టకము – ఒక పరిశీలన పేరుతో దాస్యం లక్ష్మయ్య వ్యాఖ్యానాలు కూడా రాశారు.

'టి.శ్రీరంగస్వామి జీవితం–సాహిత్యం' అనే అంశంపై మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఫిల్ పరిశోధన జరిగింది. 'శ్రీరంగస్వామి జీవితం–సాహిత్యం' అనే అంశంపై అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి కూడా వచ్చింది. 'శ్రీలేఖసాహితి కథాసంకలనాల'పై అదే విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి వచ్చింది..ఎన్నెన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్రసమర్పణ చేయడంతోపాటు వారే ఎన్నో సదస్సులను నిర్వహించారు కూడా.

సాహిత్యమే పరమావధిగా, సాహిత్యమే జీవితంగా, జీవితమే సాహిత్యంగా, చైతన్య ప్రవాహంలా నేటికీ నిరంతర సాహిత్య ప్రస్థానం కొనసాగిస్తున్నారు శ్రీరంగస్వామి.

## నానీలు

**పిప్పి శ్రీలత, ఫోన్ : 912 151 2082**

ఇళ్ళంతా
మెషిన్‌ల మయం
అయినా మనిషి సమయం
ఎలా మాయం

ఆఖరి మజిలీ
ఆస్తులతో కాదు
ఆప్తులతో
అంతం అవ్వాలి

సంపద రాగానే
సంస్కారం ఏమవుతుంది
అహంకారం
అడ్డుకట్ట వేస్తుందా?

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం
జీతం దండిగా ఉన్నా
జీవితం దండగే
అనిపిస్తుంది.

లోకంలో
ఆదరణ కరువై
ఆశ్రమాల ఆగమనం
అధికమైంది

నవమాసాల
వేదనలు నేడు
నడి రోడ్లో
వేడుకలయ్యాయి

పక్క వారితో
పలకరింపులు లేవు కాని
విదేశాలకు
వీడియో కాల్స్

వేగంలో
రాకెట్‌ని మించాలనా
రహదారిని
రక్తంలో ముంచుతున్నారు

నేటి తరానిక్కావల్సింది
తరగని సంపద కాదు
చెరగని
సంస్కారం

ఆరోగ్యానికై
అధిక శ్రద్ధ
కాని, రసాయనాల రాకతో
ఎదురు దెబ్బ

పంచభూతాలకు
పన్ను చెల్లింపులంటే
అయినా, వృథా మాని
ఆదా చేస్తారు


ఒకే గర్భం
ఒకే పెంపకం
ఆస్తి, అంతస్తులతో
రెండుగా విడిపోతుంది

ఋణబంధాల
ధ్యాసలో
అనుబంధాలకు
తీరని అన్యాయం



# భారత రత్నం – మన పీ.వీ.

**డా. టంగుటూరి సైదులు,** తెలుగు అధ్యాపకులు, ఫోన్ : 991 267 6 267



మంచి పంచ కట్టులో తెలుగుదనానికి నిలువెత్తు రూపం రాజకీయాలను అవపోసణ పట్టిన దౌత్యచతురుడు, సాహిత్యంలో సహస్రపణి, తరగని విజ్ఞానఖనీ, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆర్థిక సంస్కరణలకు ఆధ్యుడు, రాజనీతిలో అపర కౌటిల్యుడు, సకల భాషా సంపన్నుడు, అనేక సంస్కరణలతో ఈ దేశాన్ని ఉన్నత స్థాయికి చేర్చిన సాహిత్య శిఖరం పీవీ నరసింహారావు గారికి భారతరత్న రావడం భారతజాతికి గర్వకారణం.

పీవీ నరసింహారావు గారు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28న రుక్మాబాయి, సీతారామరావు దంపతులకు జన్మించారు. అయితే కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ దంపతులు దత్తత తీసుకున్నారు. ప్రాథమిక , కళాశాల విద్య హనుమకొండలో సాగింది. ఆ తర్వాత పై చదువుల కోసం హైదరాబాదులోని ఉ స్మానియా విశ్వవిద్యాలయంలో చేరారు. 1938లో రాష్ట్ర కాంగ్రెస్ లో చేరి నిజాం ప్రభుత్వం నిషేధించిన వందేమాతర గీతాన్ని పాడి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బహిష్కరణకు గురైనాడు. ఈ కారణంగా నాగపూర్ యూనివర్సిటీ కి వెళ్లి లా పూర్తి చేశారు.

సుభాష్ చంద్రబోస్ వంటి దిగ్గజాల ప్రసంగాలతో ఉత్తేజం పొందారు. కాంగ్రెస్ నాయకులు స్వామి రామానంద తీర్థ అనుచరుడిగా బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ లాయర్ గా చేరాడు. హైదరాబాద్ విముక్తి పోరాటంలో పాల్గొని క్రమంగా కాంగ్రెస్ లో క్రియాశీల పాత్ర పోషించి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలలో చాలాకాలం మంత్రిగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగానూ, భారత ప్రధానిగాను విశిష్ట సేవలందించి భారత రాజకీయాలలో ఒక వెలుగు వెలిగిన రాజనీతిజ్ఞుడు.

పీ.వీ.కి చిన్నతనం నుండి సాహిత్యం పై మక్కువ. వివిధ సాహిత్యలపై అధ్యయనం చేసి పరిపూర్ణ సాహితీవేత్తగా, సారస్వతమూర్తిగా, సంగీతజ్ఞుడుగా, చిత్రకారుడుగా, 17భాషలలో అనర్గళంగా మాట్లాడగలిగిన బహు భాషావేత్తగా ప్రసిద్ధిగాంచారు. 1948లో తెలంగాణ సమాజం అత్యంత క్లిష్ట పరిస్థితులలో అగ్నిగుండం అవుతున్నప్పుడు నర్సింగరావుగారు, పాములపర్తి సదాశివరావు ఓరుగల్లు పట్టణం నుండి "కాకతీయ సామాజిక రాజకీయ పత్రికను" నడిపించి తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారు. ఆ సమయంలో ఇది ఒక పెద్ద సాహసం.

విశ్వనాథ వేయి పడగలు నవలను హిందీలోకి సహస్ర ఫణ అనే పేరుతో అనువాదం చేయడం వల్లనే మన నవల భారతీయ హృదయాలకు చేరువయ్యింది. అందుకే దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అలాగే హరి నారాయణ ఆప్టే రాసిన 'ఫన్ లక్షత్ కోన్ ఘతో 'అనే మరాఠీ నవలను "అబల జీవితము" గా అనువదించడం వలన మరాఠీ భాషను మనం గౌరవిస్తామనే విషయం వారికి తెలిసింది. వీరి ఆత్మకథగా ప్రసిద్ధికెక్కిన " ది ఇన్ సైడర్" అనేక భాషలలోకి అనువదించబడింది.

పీవీ సృజనాత్మక కథా రచయిత అని చెప్పడానికి ఒక్క గొల్ల రామవ్వ కథ చాలు. ఈ కథలో నాటి సంక్షోభిత తెలంగాణ సామాజిక చిత్రణ అద్భుతంగా చిత్రించబడింది. నిజానికి ఇది కేవలం కథ కాదు. నిజాం కాలం నాటి అణచివేతకు, అరాచకత్వానికి, రాచరికనికి, మతోన్మాదానికి గురైై ఒక అగ్నిగుండంగా మారిన తెలంగాణ విషాదగాథ. రక్తచరిత్ర. ఇందులో మానవత్వపు మణిదీపాలున్నాయి. కథ కథన ప్రావీణ్యం ఉంది. ఉత్కంఠ, ఉద్వేగం, సాహసం, త్యాగశీలత ఉంది. పాత్రలు సజీవంగా మన ముందు ప్రత్యక్షమైనట్లు గొల్ల రామవ్వ పాత్రలో నవరసాలు తొణికిసలాడే విధంగా సృష్టించారు. రామవ్వ, మల్లితో సంభాషణ హాస్యాన్ని మరియు ఆసక్తిని రేకెత్తిస్తుంది. అలనాటి నిజాం సైన్యాలు సృష్టించిన విధ్వంసాన్ని, మారణకాండను చెప్పకనే చెప్పారు.

**ఆ నిద్రాణ నిశీధిని మానిపి మేలాంచి నాడు**
**ఒళ్ళు విరిచి కళ్ళు తెరచి ఓహో అని లేచినాడు**
**కాటుక చీకటులు చిమ్మేడు కారడివిని పయనించు**
**నిజం జటరాగ్ని జ్వాలలు నింగినంత లేపినాడు**

1972 ఆగస్టు 15న స్వాతంత్ర రజతోత్సవాల సందర్భంగా అర్ధరాత్రి అసెంబ్లీలో పీవీ నరసింహారావు చేసిన కవితా గానం ఇది. అర్ధరాత్రి స్వాతంత్రం వచ్చినప్పుడు లేచిన భారతీయుడి హృదయ గానాన్ని కవితగా వ్రాశారు. కాకతీయ కళా సమితి పేరిట ప్రతి సంవత్సరం సంగీత సాహిత్య సభలు నిర్వహించేవారు. ప్రపంచవ్యాప్తంగా ఏ టెక్నాలజీ వచ్చిన దానిని అందిపుచ్చుకోవడంలో ముందుండే వారు. 75 ఏళ్ల వయసులో కంప్యూటర్ నేర్చుకుని తెలుగు టైపింగ్ కూడా నేర్చుకుని తన రచనలను స్వయంగా కంపోజ్ చేసుకునేవారట.

సీ. పాముల పర్తిలో పావన నింగిలో
అందాల జాబిలిపై అవతరించే
భాషలెన్నో నేర్చి బహుభాషావేత్తగా
ఘన కీర్తి సాధించి గగనమెక్కె
భారతదేశాన్ని ధరపైన వెలిగింప
రాజకీయమ్ములో రాణకెక్కె
రాష్ట్ర కేంద్రాల్లో రాజిల్లు రీతిలో
మంత్రి పదవులంది మాన్యుడాయే

తే.గీ. పీవీ అద్భుత నేర్పుతో దివి పెంచే
తెలుగు వెలుగును కురిపించే తేనె జల్లు
అపర చాణక్య పేరుతో అవని నిండే
కీర్తి చంద్రికల్ వెదజల్లె ఊర్వీలోన

పద్య రచన: అద్దంకి లక్ష్మయ్య

**పీఠాధిపతి అవతారనుకుంటే ప్రధాని అయ్యారు:**

నరసింహారావు గారు 1990లో అమెరికాలో గుండె శాస్త్ర చికిత్స చేయించుకుని తిరిగి వచ్చారు. రాగానే ఆయనకు తమిళనాడులోని కుర్తాలంలో గల సిద్ధేశ్వర పీఠం నుండి పిలుపు వచ్చింది.. ఆ ఆశ్రమాన్ని పీవీ తరచుగా సందర్శిస్తుండేవారు. అనుకోకుండా ఆ పీఠాధిపతి శివ సాయుజ్యం పొందాక ఆయన వారసుడి కోసం ఆశ్రమం అన్వేషించింది. అందుకు నరసింహారావు తగిన యోగ్యుడని ఆశ్రమం భావించి సందేశం పంపింది. మరోపక్క 1991 సార్వత్రిక ఎన్నికల్లో వారు పోటీ చేయదలచుకోలేదు. కుర్తాలం పీఠం బాధ్యత స్వీకరించడానికి దాదాపు సిద్ధమయ్యారు. అదే సమయంలో రాజీవ్ గాంధీ హత్యకు గురవడం, పీవీకి పార్టీ పగ్గాలు అప్పజెప్పడానికి సోనియాగాంధీ మొగ్గు చూపడం, ఆ తర్వాత ప్రధాని పదవికి వారిని ఎన్నుకోవడంతో పీవీకి పీఠాధిపతి యోగం తప్పి రాజయోగం వచ్చింది.

**రాజకీయరంగంలో :**

పీవీ తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా 1957లో మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత కూడా వరుసగా గెలిచి మంత్రి పదవి పొందారు. 9సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా విద్య, న్యాయ, సమాచార, వైద్య, దేవాదాయ, శాఖలను చక్కగా నిర్వర్తించారు. 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. రాష్ట్రంలో అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారు. అందరికీ విద్య అందించాలన్న ఆశయంతో సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్‌లో మొట్టమొదటి గురుకులాన్ని ప్రారంభించారు. ఇక్కడ నుండి గురుకుల వ్యవస్థకు నాంది పలికి, తర్వాత కాలంలో దేశవ్యాప్తంగా నవోదయ పాఠశాలలకు శ్రీకారం చుట్టారు. తర్వాత 1977లో హనుమకొండ లోక్‌సభ నుండి గెలుపొందారు. తర్వాత కేంద్రమంత్రిగా, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వంలో హోం, రక్షణ, విదేశీ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలను అద్భుతంగా నిర్వర్తించి ఇందిరాగాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగా వారి అభిమానాన్ని చూరగొన్నాడు. రాజీవ్‌గాంధీ హత్య తర్వాత అనూహ్యంగా వీరి పేరు తెరపైకి వచ్చింది. వివాదరహితుడుగా అందరికీ ఆమోదయోగ్యుడిగా 1991 జూన్ 21న ప్రధాని బాధ్యతలు స్వీకరించారు.

**ఆర్థిక సంస్కరణలు :**

పీవీ ప్రధాని బాధ్యతలు తీసుకునే సమయానికి దేశ ఆర్థిక పరిస్థితి ఘోరంగా ఉంది. దేశం దివాలా ముప్పు అంచున ఉంది. వెంటనే ఆర్థికస్థితిపై దృష్టి పెట్టి మన్మోహన్‌సింగ్ కు బాధ్యతలు అప్పగించారు. ఆర్థిక వ్యవస్థ క్షీణ దశలో ఉంది. విదేశీ మారకద్రవ నిల్వలు స్వల్పం. వీటిని పెంచేందుకు దేశ చరిత్రలో తొలిసారి రూపాయి విలువను 9% తగ్గించారు. మార్కెట్ పోటీని తట్టుకోని నిలదొక్కుకునే పరిస్థితిని కల్పించారు. రిజర్వు బ్యాంకులో ఉన్న బంగారు నిల్వలను తాకట్టుపెట్టి 400 మిలియన్ డాలర్ల రుణం ద్వారా విదేశీ మార్గద్రవ్యాన్ని తీసుకువచ్చారు. విదేశీ పరిశ్రమలు భారత్‌కు వచ్చేలా ఏర్పాటు చేశారు. దీనివలన ఉత్పత్తి రంగానికి ఊపు వచ్చింది. పరిశ్రమలు తప్ప మిగిలిన వాటికి పెట్టుబడితో సంబంధం లేకుండా లైసెన్స్ అవసరాన్ని తొలగించారు. వ్యవసాయ రంగంలో కూడా సంస్కరణలు చేపట్టి ఆహార ధాన్యాల రవాణా పై ఆంక్షలు ఎత్తివేశారు. ఈ విధంగా ఆర్థిక సంస్కరణల విషయంలో ఆయన చేసిన కృషి అమోఘం. వీరి దార్శనిక నాయకత్వం వలన దేశం ఆర్థికంగా ముందడుగు వేసి భారత పురోగతికి, వృద్ధికి పటిష్ట పునాది వేయడంలో వారి ఆలోచన విధానం వారిని మహోన్నత వ్యక్తిగా చరిత్రలో నిలిపింది.

తన పదవికి ఇబ్బంది వస్తుందని తెలిసిన ల్యాండ్ సీలింగ్ చట్టం (భూసంస్కరణలు) తీసుకువచ్చి అబ్బురపరిచి స్వయంగా తన భూమిని ప్రజలకు పంచిపెట్టాడు. నిజానికి పీవీ నడిపింది మైనారిటీ ప్రభుత్వం అప్పట్లో దేశ ఆర్థిక పరిస్థితుల వల్ల ప్రతిపక్షాల పరోక్ష సహకారం వల్ల మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం నడపగలిగరు. వీరి హయాంలోనే పృథ్వి, అగ్నిక్షిపణి పరీక్షలు జరిగాయి. 1995లో అణుపరీక్షలకు రంగం సిద్ధం చేశారని ఇస్లామాబాద్, అమెరికాలకు జంకు పుట్టించారని, తర్వాత ఆ బాధ్యత తనకు అప్పగించారని వాజ్‌పాయి ఒక సందర్భంలో చెప్పారు. నిరంతరం దేశ కీర్తి ప్రతిష్టల కోసం శ్రమించిన వ్యక్తి ఇన్ని ఒత్తిడులలో ఉన్నా సాహిత్యంపై అభిమానాన్ని వదులుకోలేదు. 1996లో హైదరాబాద్ లలిత కళాతోరణంలో జరిగే అవధాన కార్యక్రమంలో పాల్గొని మాడుగుల నాగఫణిశర్మ గారి అవధానాన్ని ఆస్వాదించారు. ఆ సందర్భంలో శర్మగారు పీవీ గురించి ఇలా చెప్పారు.

జయ భారత ప్రతిభామయి ప్రధానమంత్రి

సరస్వతి చేతిలోని వీణా తంత్రి
పదునెరిగిన పసదిలిసిన పరిపాలన మేధావి
పలుభాసలు రసనదిరుగు చదువులమ్మకి మోవి
పీవీ పీవీ పీవీ భారతదేశం ఠీవీ

పీవీ రాజకీయ చతురతతో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని అసాధ్యాలను సుసాధ్యం చేసిన గొప్ప మేధావి. ఒక వ్యక్తి ఇన్ని రంగాలలో ప్రతిభ సాధించడం అరుదు. సాహిత్యానికి, రాజకీయానికి సమపాళ్లలో కీర్తిని తెచ్చి, సంస్కరణల పేరుతో భారత గతిని మార్చి , అను శక్తి నుండి ఆర్థికంగా పాలనపై చెరగని ముద్ర వేసిన అరుదైన నేత, ప్రజ్ఞాశీలి, ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరేసిన తెలుగు తేజంకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం తెలంగాణ సగర్వంగా సంబరపడుతున్నది.

పీ.వీ. జయంతి సందర్భంగా వారి యాదిలో...

**ఆధార గ్రంధాలు :**

1. డా. లింగయ్య కర్నాటి – నవభారత నిర్మాత పివి... దేశానికి ఠీవి. నందనవనం(సాహితీ సమితి) ప్రచురణ. హైదరాబాద్. 2020.


2. వివిధ వార్త పత్రికలు

# చిక్కటి నవల 'అక్రమ సంతానం'

ఎం. విప్లవ కుమార్, ఫోన్ : 951522 5658

మరాఠి భాషలో మరుగుతున్న కన్నీటిని తెలుగు సాహిత్య కాల్వల్లోకి మళ్ళించి మనకు అందుబాటులోకి తెచ్చిన జనసాహితికి జేజేలు. ధారావాహికంగా ప్రచురించడంతోనే తన బాధ్యతను వదిలించుకోకుండా నవల రూపంలోకి తీసుకురావడం అభినందనీయం. ఇది జనసాహితీ బాధ్యతను సమాజంలో మరింత పెంపొందించడంతోపాటు, నవయువ పుస్తక ప్రియుల్లోకి వెళ్ళడమే కాకుండా వారిని జనసాహితీ చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకునేలా చేసింది ఈ నవలా ముద్రణ. భూస్వామ్య సమాజపు బుద్ధికి ఎన్ని విషపు కోరలు పొడుచుకు రాగలవో వాటన్నింటినీ సజీవంగా వివరించగలగడం అనుభవించిన వారికే సాధ్యమేమో. శరణుకుమార్ లింబాళె మూలాల్లో అణువణువునా ఆగ్రహ జ్వాలలే నిక్షిప్తమైనట్లు తెలుస్తుంది. అంతటి ఆగ్రహం, ఆవేశం వున్నప్పటికీ తన వైవిధ్యమైన పదజాల ప్రయోగంతో నవలీకరించిన తీరు ఆకట్టుకుంటుంది. లింబాళె చేదు జీవితానికి పుట్టిన సక్రమాయుధమే ఈ 'అక్రమ సంతానం' నవల. మరాఠిలో 'అక్కరమాశి'గా వచ్చిన ఈ నవలను రంగనాథ రామచంద్రరావు తెలుగులోకి చాలా బాగా అనువదించారు. తలొంచుకొనో, తలదాచుకునో బ్రతకాల్సిన పరిస్థితికి భూస్వామ్య సమాజం నెట్టివేసినా తనని చూసి ఆ సమాజమే తలదించుకునేలా శరణు కసితో ఎదిగాడు. దేశభక్తి, సంస్కృతీ, సంప్రదాయాలు అని ఉత్తిగనే శిగం ఊగేవారు భారత భూస్వామ్య సమాజం యొక్క నిజస్వరూపాన్ని 'అక్రమసంతానం' చదివితే చూడగలుగుతారు.

కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట ఊచకోతలు, గుజరాత్ గాయపు దుర్మార్గాలు నెత్తురు చిమ్మితే, నెత్తురే కన్పించకుండా కూడా ఫ్యూడలిజం యావత్ శూద్రజాతి గుండెల్ని కోసి ముక్కలుచేస్తూ వ్యవస్థీకృతమై ఎలాంటి వికృతరూపం దాల్చిందనే దానికి 'అక్రమసంతానం' నవల నిలువెత్తు సాక్ష్యంగా నిలబడుతుంది. చదివిన వారిని నీడలా వెంటాడి, భూస్వామ్య సమాజాన్ని చీల్చి




చెండాడమని పురిగొల్పే ఈ నవల కథలోకి వెళ్ళి చూద్దాం. ఏడాదికి వంద రూపాయలిచ్చి మౌల్యా అనే పసిపోరని జీవితాన్ని బాల్యానికి ఎడబాపి జీతం చేయించుకున్న భూస్వామ్య వ్యవస్థ లక్షణాన్ని బాల్యజీవితం నుండి వచ్చిన ఏ ఒక్కరూ క్షమించరు. బడిలో అగ్రకుల పిల్లలకు దూరంగా, వారు విడిచిన చెప్పుల దగ్గర అంటరాని పిల్లలను కూర్చోబెట్టడం, పాఠశాల వనభోజన కార్యక్రమంలో కూడా అగ్రవర్ణాల పిల్లలకు దూరంగా ఉంచి అణగారిన పిల్లల్ని భోజనం చేయించడంతోపాటు సవర్ణ పిల్లలు తినగా మిగిలినవి వారి అంటు తాకకుండా ఇవ్వడంలాంటి సంఘటనలు చదివితే ఏ భావజాలాన్ని రంగరించి స్వతంత్ర భారతాన్ని నిర్మించారో అర్థమౌతుంది. భగవంతుడి చేత సృజించబడ్డ పువ్వులు అని పాఠాలు చెప్తూనే ఆ భగవంతుడి గుడిలోకెళ్ళనియ్యని ద్వందనీతివలన గ్రామం బయట పడేసిన చెత్తలా మిగిలామంటూ పోల్చినతీరు శరణు గుండెలోతుల్లోని గాయాల తీవ్రతను తెలియజేస్తుంది. కోతల కాలంలో జొన్నకంకులు తిన్న పశువుల పేడ పోగుచేసి ఆ పేడలోనుండి జొన్న గింజల్ని వేరుచేసి, కడిగి, ఎండబెట్టి, పిండిగొట్టి, రొట్టెచేసి తినే ప్రక్రియ తినాల్సిన అనివార్యత కన్నీటికే కనీళ్ళు తెప్పించకమానదు. ఈ దుస్థితి దళిత కులాలపై ఆకలి గెలుపు అనడంకన్నా భూస్వామ్య

సమాజంలోని అగ్రకుల దోపిడీదార్ల కుట్ర అనడమే సముచితం. ధనప్ప తన టీ స్టాల్లో వాడీవాడీ టీస్టాల్ వెనుక వడబోసిన చాయపత్తే వారింటిలో టీ పొడి అవడం, ఒక రకమైన గడ్డితో రొట్టెలు, మరో రకమైన గడ్డితో చెట్నీ చేసుకుని తిన్న స్థితి ఒక్క శరణు కుటుంబానిదే కాదు, యావద్భారత దేశంలోని దళితుల, పేదల ఆర్థిక స్థితిని అద్దంలా మన ముందుంచుతుంది 'అక్రమసంతానం' నవల. ఇలాంటి దౌర్భాగ్యమైన రోజులు ఎవరికీ రావొద్దనిపిస్తుంది.

బడిలో మహర్... మహర్... అనీ, అస్పృశ్యజాతి అనీ అగ్రకులాల పిల్లలు రాళ్ళతో కొట్టే గొప్ప సంప్రదాయం పాఠశాల పసివయస్సులోనే వాళ్ళ మెదళ్ళలో కూర్చిన వారిని అదే పని చేస్తే తప్పు ఆ కసి పోదన్నట్లు అవమానభారంతో కుంగిపోతున్నప్పుడు 'శోభిని' రొట్టెల మూటెత్తుకుని పొలానికెళ్తుంటే శరణు, పరాశ్యలు శోభిని చెయ్యిపట్టి అడ్డగించి, వేసిన ప్రశ్నలకు వర్ణ వ్యవస్థ దొంతరలు పాటించే ప్రతివారు సమాధానం చెప్పి తీరాల్సిందే. మేము అంటరానివారమైతే మా స్పర్శతో నీళ్ళు అపవిత్రమైతే నది ఎందుకు అపవిత్రమవదు? మా స్పర్శ అపవిత్రమైతే తెల్లగా వున్న నువ్వు నల్లగా ఎందుకవడం లేదు? నీ తలమీద మూటలో ఉన్న రొట్టెలెందుకు పాచిపోవడం లేదు? అని అగ్రకుల శోభినికి వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది భూస్వామ్య, కుల సమాజమే. శరణుకు ఈ ప్రశ్నా చైతన్యం అనుభవించిన అవమానానికి తోడైన చదువునుంచే వచ్చిందనేది సుస్పష్టం. ఈ బాధలన్నీ ఏ దేవుడికైనా చెప్పుకోవాలను కున్నా మాకు గుడిలోకి ప్రవేశం లేదు. గుడిమెట్ల బయటినుండే మొక్కుకోవాలి. గుడిలోకి ప్రవేశిస్తే దేవుడు అపవిత్రమైపోతాడు. అదేంటో అందరూ దేవుని బిడ్డలే ఐనప్పుడు మేము మాత్రమే అస్పృశ్యులమెలా అయ్యాము? అని శరణు వేసిన ప్రశ్న అమాయకమైనది కాదు. ఆలోచనతో కూడిన ఆగ్రహజ్వాల అని తన కొనసాగింపును చూస్తే అర్థమవుతుంది. మమ్మల్ని ఊరి బయటకు పారద్రోలే దేవుడ్ని, మతాన్ని, రాజ్యాన్ని ఎలా ఆమోదించాలని ప్రశ్నిస్తాడు. ఈ ప్రశ్నలను నేటి దళిత, బహుజన విద్యార్థిలోకం ఫేస్బుక్, వాట్సప్ కన్నా ఎక్కువగా స్వంతం చేసుకుని కొనసాగిస్తేనే వారికి భవిష్యత్తు వుంటుందని గోచరిస్తుంది.

శరణు స్నేహితుడు చంద్యా వాళ్ళ అమ్మమ్మ ఇంటిదగ్గర ఉన్న జానాబాయి తన చెల్లెలి కూతురిని శరణుకి ఇవ్వాలనుకుని పెళ్ళిచూపుల సమయంచెప్పి వాళ్ళింటికి ఆహ్వానిస్తుంది. ఆరోజు వచ్చేసరికి శరణు 'అక్రమసంతానం' అని తెలిసి వారు శరణుని అవమానిస్తారు. అక్కడేవున్న చంద్యా చిన్నాన్న మాయప్ప వెంటనే స్పందించి మా బౌద్ధధర్మంలో హెచ్చుతగ్గులు లేవు. ఉత్తమ జన్మ, అథఃజన్మ అనేది లేదు. నా కూతురిని శరణుకిచ్చి పెళ్ళి చేస్తానంటాడు. ఆ సందర్భంలో మాయప్ప మాటలు బుద్ధుడి ఉపదేశాల కంటే అత్యధిక సార్థకంగా, విలువైనవిగా తోచాయి శరణుకుమార్ లింబాలెకు. 'బలహీన లక్షణాలపై బలమైన సిద్ధాంతం' వలె బౌద్ధమతం ఆనాటికీ ప్రభావశీలంగానే ఉందనిపిస్తుంది. బలహీనుల బతుకులకు బలమైన మార్గం చూపి మనుషులుగా నడిపించాలనిపిస్తుంది. ఆచారాల కంటే మనుషులనే ఎక్కువగా ప్రేమించాలని బౌద్ధం నేర్పిస్తుందని, చదువురాని మాయప్ప చైతన్యాన్ని చూస్తే అర్థమైతుంది. పెండ్లి పత్రిక మీద అంబేద్కర్ ఫోటో వేయించడం పెండ్లి హాల్లో బుద్ధుడు, ఫూలే, అంబేద్కర్ ఫోటోలు అలంకరించిన మాయప్ప ఆచరణ నేటి ప్రగతిశీల, అభ్యుదయ సమాజానికి మార్గదర్శకం.

రిజర్వేషన్లు వ్యతిరేకించేవారి కళ్ళు తెరిపించే శస్త్రచికిత్సే శరణు జీవిత చరిత్ర. రిజర్వేషన్లు లేకపోతే మాకు చదువు లేదు అంటాడు. రిజర్వేషన్ ఫలాల మూలంగానే చదువుకోగలిగామంటాడు. 1978లో బి.ఏ., 1990 ఎం.ఏ., 1996లో పీహెచ్.డి చేసిన శరణు నాసిక్ వైసీఎం యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టరుగా, ప్రొఫెసర్‌గా ఉండడం మామూలు విషయం కాదు. నిజానికి ప్యూడలిజం పురులు విప్పి బుసలు కొడుతున్న వేళ అస్పృశ్యులు అంతటి ఉన్నత చదువులు చదివేందుకు యూనివర్సిటీ మెట్లు ఎక్కే అవకాశం కూడా ఉండేది కాదు. అందుకే ఈ నవలద్వారా రిజర్వేషన్లు వ్యతిరేకించేవారికి ఒక విజ్ఞప్తి చేస్తాడు. రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు కుల వివక్షను ఎదుర్కోవాలి. వారు స్వయంగా దళితుల ఇండ్లలో గడపాలి. తాగుబోతు తండ్రి పాదాల దగ్గర ఆకలితో నకనకలాడుతూ చదువుకోవడం ఎలా వుంటుందో అనుభవించి, ఆ తర్వాత మాట్లాడాలి అంటాడు. రిజర్వేషన్లు రద్దు చేస్తే దళితిస్థాన్ కావాలంటాడు. రిజర్వేషన్లు దళితులకు ఆసరా కాదు, ఆయువు. అవసరం కాదు అనివార్యత. రిజర్వేషన్లు సౌకర్యాల కోసం కాదు సమాజంలో సాటి మనిషిగా బతకాలనే జీవితాశయం కోసం అనిపిస్తుంది. జీవత్వం ఉట్టిపడే బ్రతుకు బతకాలంటే ఆక్సిజన్ లాంటి రిజర్వేషన్లు అవసరం. వాటిని దూరం చేయాలనుకుంటే ప్రత్యేక దేశమే కావాలనేంత లావా, అగ్నిపర్వతం లాంటి తమ శరీరాల్లో దాగి వుందన్నట్లు శరణు వెలుబుచ్చిన అభిప్రాయాల్ని సానుకూలం గానే తీసుకోవాలి. వారి సమస్యల పరిష్కారానికి తరతరాలుగా దళిత జాతి గుండెల్లో సల్పుతున్న గాయాన్ని మాన్పడానికి సహచర పౌరసమాజం, ప్రభుత్వం మరింత తోడ్పాటునివ్వాల్సిన అవసరం, బాధ్యత ఉందని 'అక్రమసంతానం' గొంతెత్తింది.

శరణు ఎం.ఎ., పూర్తవగానే టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగం మహమదాపురంలో వచ్చింది. అక్కడ మహర్లకు ఇండ్లు అద్దెకు దొరకని పరిస్థితి. లింబాళె అనే పేరువల్ల లింగాయత్లు అనుకుని ఇల్లిచ్చినా మాంసాహారం తెచ్చుకున్న రోజు దాచుకుని తినడం, బొక్కలు కనబడకుండా బయటేయడం లాంటివి, మన తిండి తినడానికి మనల్ని దొంగలుగా మలిచే దుర్మార్గకర ఆచారాలు మన శరీరంలో మనమే చొరబాటుదారుల్లా తల దాచుకొని నివసించే

దారుణాలు, సాంప్రదాయాల సందుల్లో ఊపిరికూడా స్వేచ్ఛగా పీల్చుకోలేని ఘోరాలు. ఇలాంటి విపరీత అనుభవాలు నేటికీ చూస్తూనే వున్నాం. రాజధాని నడిబొడ్డున కూడా మీరు ఏమిటోళ్ళు అని అడిగి ఇండ్లివ్వని సందర్భాలు అనేకం. అంతకుమించి "టూ లెట్ శాఖాహారులకు మాత్రమే" అనే ముఖంమీద కొట్టినట్టుండే బోర్డులు ఈ డిజిటల్ యుగంలోకూడా దర్శనమిస్తుండటం సవర్ణ మతతత్వమే. ఈ మతం అనే భారాన్ని మేము కూలీల్లా మోస్తున్నాం. కృత్రిమ కట్టుబాట్లతో మనిషి తనని తానే కోల్పోతున్నాడు. మానవత్వాన్ని పోగొట్టుకున్నాడు. వ్యవస్థ యొక్క చక్రవ్యూహంలో ఎందుకు కొట్టుమిట్టాడాలి? నా పుట్టుకే అనైతికంగా ఘోషింపబడిన తరువాత నేను ఏ నియమాల్ని పాటించాలి అంటూ ఈ వ్యవస్థను ప్రశ్నిస్తాడు శరణుకుమార్ లింబాళె.

లాతూరు వెళ్ళడానికి బార్శి బస్టాండ్లో ఉండగానే శరణు భార్య కుసుమ్ మగబిడ్డకు జన్మనించిందని తెలుసుకుని ఆ పిల్లవాడికి పెట్టాలనుకున్న పేరే ఈ భూమికి విముక్తి పద్యమయ్యే అవకాశం ఉంది. ఆ పదాన్ని అర్థం చేసుకునే వివేచన ఆచరణై విరబూస్తుంది. ఆ పేరు అక్షరాక్షరంలో ఉన్న ఆశయాలను 128 పేజీలున్న 'అక్రమసంతానం' అర్థం చేయిస్తుంది. ఎ నుండి జెడ్ దాకా, అ నుండి అ దాకా, నా నుండి నీ దాకా అంతా స్వార్థమే నిండుకుంటున్న ఈ లోకంలో దాదా అనే మహ్మద్ దస్తగిర్ జమీర్ శరణు స్వీయ చరిత్రలో నిలువెత్తు మానవత్వమై ప్రవహిస్తాడు. నవల చదువుతున్న వారందరినీ నిస్వార్థమై ఆవహిస్తాడు. మతంలేని, కులంలేని, అంతరాలు లేని అత్తరులాంటి మనిషి తత్వాన్ని మన మెదళ్ళలోకి ధారబోస్తాడు. కులమత తత్వాలతో కుళ్ళి కంపు కొడుతున్నప్పుడు మానవత్వపు అవశేషమే కనిపించడం లేదని వాపోతున్న మనిషి జీవితంలో మనిషి తనానికి చిరునామాగా బ్రతికి నిలిచి సాగిపోతూ శరణుని తన వారసుడిగా మనముందు నిలబెట్టిన ప్రకృతీతత్వ పాత్రధారి దాదా. సరళమైన పదజాలంలో 'అక్రమసంతానం' ఆవిష్కరించబడినప్పటికీ నవల చదువుతున్నట్టు కాకుండా పాత్రలన్నీ కళ్లముందే కదలాడుతూ సినిమా చూస్తున్నట్టు వుంటుంది. ఇండియా నలుమూలలా వ్యాపించిన సమాజపు భావజాలపు మగాడి చేత వాడుకోబడ్డ, విసిరేయబడ్డ, విడాకులిచ్చి వదిలించుకోబడ్డ, పీడించబడ్డ కోట్లమంది తల్లుల జీవితాల్లో ఏదో ఓ కోణం శరణు తల్లి మాసామాయిలో కనిపిస్తుంది. భూస్వామ్య వ్యవస్థ కామమై కాటేసి, కులమై కుంగదీసి, మతమై మసి చేసే దుర్మార్గ సమాజంగా ఎన్ని రూపాల్లో అవతరించిందో 'అక్రమసంతానం' కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. శరణ్ని తల్లి సరిగా చూసినా, చూడకున్నా అమ్మమ్మ సంతామాయి అన్నీ తానై చూసుకుంది. దళిత స్త్రీ మాసామాయి లింగాయత కులస్థుడైన హనుమంత లింబాళెలకు అక్రమసంతానమై పుట్టిన శరణుకుమార్ లింబాళెను ముసల్మాను కుటుంబం నుండి వచ్చిన దాదా దళితజాతని వెలివేయబడి పుట్టిన సాంతామాయి, సాది పెద్దజేసినారు. కాబట్టి తన కులమేమిటన్న శరణు ప్రశ్నకు సమాధానం మానవత్వంలోనే దొరుకుతుంది. భూస్వామ్య సమాజాన్ని బట్టలూడదీసి బజారులో నిలబెట్టి ప్రశ్నిస్తున్న చిక్కటి నవల అక్రమసంతానాన్ని అస్పృశ్యులతోపాటు అగ్రకులాలవారే ఎక్కువగా చదవాల్సిన అవసరం నేడున్నది.


## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**
**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**
**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే
ఉత్తమ గ్రంథం 'కదంబం'.
**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# వైభవంగా ఆవిష్కృతమైన ‘శాసన పర్వం’

డా. మంత్రి శ్రీనివాస్, ఫోన్ : 8328333720



చరిత్ర చిత్తరువుకు భాష్యాన్ని చెప్పి అలనాటి వైభవానికి హస్తాక్షర సాక్ష్యాలుగా నిలుస్తున్నవి శాసనాలు. రూపం కోల్పోయిన నిన్నటి పరిపాలన ఆనవాళ్లకు, ఆనాటి సామాజిక, రాజకీయ, మత, సాంస్కృతిక వైభవానికి, సంస్కరణలకు శిలాక్షర రూపాలు శాసనాలు. ఇటువంటి శత శాసనాల హృదయపాఠాన్ని ‘శాసనపర్వం’ అనే వైవిధ్యమైన శీర్షికతో గ్రంథంగా తీసుకొచ్చారు డా. భిన్నూరి మనోహరి. అరుదైన ఈ గ్రంథం మూసీ సాహిత్య ధార మరియు ధ్రువ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యవంలో ఘనంగా ఆవిష్కరణ జరుపుకుంది.

ఈ అపురూప కార్యక్రమానికి తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు, ఉపన్యాస కేసరి, జాతీయ సాహిత్య రథ సారథి, కవి, రచయిత, అనువాదకులు ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమ గరిమను పెంచుతూ ముఖ్య అతిథి, ఆవిష్కర్తగా కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి సంచాలకులు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి హాజరయ్యారు. ఆత్మీయ అతిథులుగా నిత్యపరిశోధకులు, నిత్యాన్వేషి, రచయిత, సాహితీ విమర్శకులు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సమన్వయ, జీవనలిపి వంటి గ్రంథాలతో సాహితీ జగత్తులో తమకంటూ ఒక ప్రత్యేకత నిలుపుకున్న రచయిత, విమర్శకులు, సంపాదకులు, పరిశోధకుల దారిదీపం ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సహాయాచార్యులు డా.ఎస్. రఘు, ధ్రువ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీ దుండె మల్లేశం హాజరుకాగా గ్రంథ హృదయావిష్కర్తగా ప్రముఖ శాసన పరిశోధకులు, ‘ఆచంద్ర తారార్కం’గా చరిత్ర పరిశోధనను నిలిపిన డా. డి.సూర్య కుమార్ పాల్గొన్నారు.


సురభారతి ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా సాగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం చిరంజీవులు సాగి కావ్యశ్రీ,తేజశ్రీలు సుమధుర ప్రార్థన గీతం ఆలపించగా జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైంది. ముందుగా ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి అధ్యక్ష ప్రసంగం చేస్తూ తెలుగు సాహిత్య, చరిత్ర, పురావస్తు గ్రంథాల నిర్మాణానికి శాసనాలు తొలి ఆధారాలుగా నిలిచాయని, నిలుస్తూ వస్తున్నాయని, తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించడం వెనక పురాతన శాసనాలు, అందునా తెలంగాణలో ఉన్న బొమ్మలమ్మ గుట్ట శాసనం ప్రముఖ పాత్ర పోషించిందని అటువంటి శాసన సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన బి.ఎన్. శాస్త్రిగారి వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి పుత్రిక డా.బి.మనోహరి ఈ అపురూప శత శాసన ‘శాసన పర్వాన్ని’ గ్రంథంగా తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అధ్యక్షాభినందనం అనంతరం అశేష రచయితలు, పరిశోధకులు, అతిథులు, అభిమానుల మధ్య మంగళమయంగా ఈ గ్రంథావిష్కరణం, లోకార్పణం జరిగింది. ఆవిష్కర్త డా.ఏనుగు నరసింహారెడ్డి తన కరకమలాలతో పుస్తకావిష్కరణ చేయగా భవన నిర్మాణ నిపుణులు శ్రీమతి లక్ష్మీ అనురాధ, మనోహరి కుటుంబ సభ్యురాలు శ్రీమతి మంజుల కరతాళ ధ్వనుల మధ్య అంకితం తీసుకున్నారు.

అనంతరం ముఖ్య అతిథి డా.ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ శాసనాలను చదివి, అందలి విషయాలను పరిష్కరించి ఆయా కాలాల చరిత్ర చెప్పడం ఎంతో కష్టంతో కూడుకున్న పని అని, గ్రామాలలో, దేవాలయాల వద్ద, కోటలలో, నదీ నదాల వద్ద పర్యటించి అక్కడి చరిత్రకు ప్రాణం పోయడం అంటే సులువైన విషయం కాదన్నారు. ఈ పని సందర్భంగా అక్కడి స్థానికులతో ఎంతో సంఘర్షణ ఎదుర్కొనాల్సి వస్తుందని, వారి విశ్వాసాలకు విఘాతం కలిగించకుండా నొప్పించక, నొయ్యక తాను అనుకున్న పనిని చేసుకొని రావడం అంటే సాధారణం కాదన్నారు. తుమ్మలగూడెం, కీసర వంటి శాసనాలు విష్ణుకుండినుల రాజ్యపు ఆనవాళ్లుగా నిలిచిన వైనం, తెలంగాణ వైభవాన్ని అజరామరం చేసిన చాళుక్యులు, కాకతీయుల ప్రాభవాన్ని తెలియజేసే మనకు తెలియని ఎన్నో శాసనాలను రచయిత్రి ఈ గ్రంథంలో పొందుపరచడం ముదావహం అన్నారు. ఈ రచన తర్వాతి తరాలకు ఒక మార్గదర్శనం లాంటిదని, శాసన అంశాలను విశదపరుచుకొని పాఠంగా ఎలా రాయాలో ఈ గ్రంథం తెలుపుతుంది అన్నారు. అందరూ కొనుక్కొని మరీ చదవవలసిన గ్రంథంగా అభివర్ణించారు. తర్వాత ఆత్మీయ అతిథి ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ డా. బి. మనోహరి చేస్తున్న సాహిత్య కృషికి మరోవైపు కొనసాగింపుగా ఈ గ్రంథం నిలుస్తుందని, తెలంగాణ వ్యాప్తంగా ఎంతో చరిత్ర రాళ్ళ గర్భాన

దాగి ఉన్నదని, ఎన్నో శాసనాలు ఇంకా పరిష్కృతికి నోచుకోక ఉన్నాయని వాటిని పరిష్కరించి జాతి చరిత్రను పదిలంగా ఉంచే బాధ్యత రచయిత లాంటివారిపై ఉన్నదన్నారు. మహబూబ్ నగర్ జిల్లా సర్వస్వం, నల్లగొండ జిల్లా సర్వస్వం లాంటి గ్రంథాలు ఎన్నో శాసనాల ఆనవాళ్లను అందించాయని, తన తండ్రి కృషిని వారసత్వంగా అందుకొని రచయిత్రి ముందుకు నడవడం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.


గ్రంథ అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ డా. డి. సూర్యకుమార్ 'శాసనపర్వం' గ్రంథంలో పేర్కొనబడ్డ శత శాసనాల అస్తిత్వాన్ని వినిపించారు. విక్రమేంద్ర వర్మ, గోవిందవర్మలు వేయించిన ఇంద్రపాల నగర తామ్ర శాసనాలలో సామ్రాజ్యపు ఆనవాళ్లను, హైదరాబాద్ కేంద్రంగా చైతన్యపురి రాతిగుండు శాసనం, ప్రాణాచార్యుడు, మహా వైద్యుడు అగ్గలయ్య కీర్తి శాసనం, కుర్క్యాల శాసనం, వేములవాడ చాళుక్యుల వంశక్రమాన్ని తెలుపు వేములవాడ శాసనం,కందూరు చోడుల వంశక్రమం తెలుపు ఒల్లాల శాసనం, ఆలంపురం కేంద్రంగా త్రిభువన మల్ల బిరుదాంకితుడు ఆరవ విక్రమాదిత్యుని పట్టపురాణి మన్నాదేవి వేయించిన శాసనాలు, కాకతీయ వంశ ప్రతిష్టను నిలబెట్టిన విరియాల కామసాని ప్రస్తావన ఉన్న గూడూరు శాసనం, ఎరుక సానమ్మ పిల్లలమఱ్ఱి శాసనం, కాకతీయుల సూపర్ మార్కెట్ల చరిత్రను చెప్పే ఓరుగల్లు కోట శాసనం, కోటగిరి తామ్ర శాసనం, రుద్రమదేవి మరణ ధ్రువీకరణకు సాక్ష్యంగా నిలిచిన చందుపట్ల శాసనం ఇలా వంద శాసనాలు తమలో దాచుకుని భద్రపరిచిన తెలంగాణ చరిత్రను నిత్య నూతనం చేసి రచయిత్రి భావి తరాలకు అందించారన్నారు. ఈ గ్రంథంలోకి అడుగుపెట్టిన తర్వాత శాసన హృదయవీణ పలికే గీతాల్ని వింటూ కాలం మాటున దాగిన చరిత్రను, దానికి సాక్ష్యాలుగా రాసిన రాతలను పట్టుకొని మూలాల్లోకి జారుకుంటామన్నది సత్యమన్నారు. తెలుగు కన్నడలిపుల కలబోతగా ఉన్న పరగన్నడం/తెలుగన్నడంలో రాయబడ్డ శాసనాలు ఇరు రాష్ట్రాల అలనాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాహిత్య సంబంధాలకు చెందిన అంశాలపై పాఠకుడికి పట్టు కల్పిస్తాయన్నారు. ఈ శతాబ్దంలో వెలుగులీనిన గొప్పగ్రంథంగా ఈ గ్రంథాన్ని కొనియాడారు. రొమాంచితంగా ఈ సుదీర్ఘ ప్రసంగం కొనసాగింది.

అనంతరం మరో ఆత్మీయ అతిథి డా. ఎస్. రఘు తన ఆత్మీయ సందేశాన్ని వినిపిస్తూ శాసన సాహిత్యంలో ఈ గ్రంథం ఒక మైలురాయి అని, తెలంగాణలోని వరంగల్, నల్గొండ, హైదరాబాద్, మంచిర్యాల, రంగారెడ్డి, పాలమూరు, కరీంనగర్, భువనగిరి, సిద్ధిపేట మొత్తంగా పెద్దసగం శాసనాలు ఈ గ్రంథంలోనే ఉన్నాయన్నారు. చదువుతుంటే ఎంతో ఆసక్తిని కలిగించే విధంగా ఉండి చరిత్ర గర్భంలో దాగున్న కొత్త కొత్త విషయాలు మనల్ని










అబ్బురపరుస్తాయన్నారు. ఆద్యంతం ఈ సభ ప్రసంగాలు క్రొంగొత్త జిజ్ఞాసను మేల్కొలుపుతున్నాయని, ఇదే స్ఫూర్తితో మన గ్రామాల్లో మనతోనే జీవిస్తూ కనుచూపు సోకని శిలలవైపు మన కన్నులను సారిద్దామన్నారు.

ధ్రువ ఫౌండేషన్ అధ్యక్షులు, గ్రంథ ప్రకాశకులు శ్రీ దుండె మల్లేశం మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ప్రచురించే అవకాశం వారి సంస్థకు ఒక అరుదైన అవకాశంగా భావిస్తున్నామని, చీకట్లోంచి చరిత్రను వెలుగు వాకిట్లోకి రచయిత్రి తీసుకురావడం ఒక అపురూప కార్యమన్నారు.

అంతిమంగా రచయిత్రి డా.బి.మనోహరి తన అమూల్యమైన స్పందనను తెలియజేస్తూ పూజ్యులు, గౌరవనీయులు తమ తండ్రి శ్రీ బి.ఎన్. శాస్త్రి గారి వద్ద శాసన ఓనమాలను దిద్దుకొని వారి సారథ్యంలో పరిష్కార పాఠాలను నేర్చుకొని వారి ఆశయాల సాధనలో కొనసాగుతున్న క్రమంలో ఈ గ్రంథం తనకు ఒక మైలురాయి అని, తన తండ్రి నేర్పిన నైపుణ్యానికి ఇదొక ప్రతిరూపమని అన్నారు. ఈగ్రంథంలోని శిలాక్షరాలు తెలంగాణ చరిత్రకు పట్టుగొమ్మల వంటివని, బహుమూల్య ఆధారాలని అన్నారు. ఈ పరిశ్రమలో తనకు సహాయంగా నిలిచిన అందరికి ధన్యవాదాలు తెలియజేశారు.

కార్యక్రమ రూపశిల్పి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య కమలాకర శర్మ గారి ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సన్మానించుకుంది సభ. ఈ విశిష్ట సభలో పెద్దలు శ్రీ మోతుకూరి నరహరి, శ్రీ మడిపల్లి దక్షిణామూర్తి వంటి ప్రముఖులు, పరిశోధకులు, స్నాతకోత్తర విద్యార్థులు, సాహితీ అభిమానులు, పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ధ్రువ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ బోళ్ల ప్రవీణ్ స్వాగతం పలుకగా, మూసీ సాహిత్య ధార ప్రధాన కార్యదర్శి డా.అట్టెం దత్తయ్య ముగింపు వాక్యాలు పలికారు. మేఘుని చల్లని చినుకులు పలకరిస్తుండగా కమ్మని తేనేటి విందు మధ్య కార్యక్రమం ఆసాంతం ఆహ్లాదకరంగా సాగింది.

## కొద్దిసేపు మరణాన్ని భరించు

**జానీ తక్కెడశిల,** ఫోన్ : 725 951 1956

నిన్ను నీవు రెండుగా పంచాలి
రెండు భూగోళాలను
భుజాలపై లేదా ఛాతిపై ఎత్తుకొని ఆకాశంగా మారిపోవాలి
నీతో పాటు భూగోళాలను దాచిపెట్టుకోడానికి
ఖాళీ శూన్యం కావాలి
కడవ రెండుగా ముక్కలైంది

ఏదైనా దశలు దశలుగా మారుతుంది
నిన్నటి జ్ఞాపకాలు
శిలాఫలకాలై మోడు బారిపోతాయి
తాజా నవ్వుల తీగలు
కంచెలాంటి ముఖంపై వాలినప్పుడు
ఒకపక్క ఉదయపు శ్వాస
మరోపక్క నిన్నటి గదిలో
పసుపు కొమ్మ పరిమళం వాడిపోతుంది.

గాలిలో తడిని పిండుకొని
మునివేళ్ళ కన్నుల నుండి శరీరంలోకి ప్రసరించుకోవాలి
వంగిపోయిన శూన్య కొమ్మకు వేలాడుతున్న వెలుగులను
రెక్కల కింద అదుముకోవాలి.

ఒక పక్క నిండు పున్నమి
మరో పక్క మొదటి రేఖ
కాలానికి న్యాయం తెలియదు.


శరీరానికి, మనసుకు సమన్వయం ఉండదు
సమాజం ఒకరికి రాజముద్ర వేస్తుంది
మరొకరికి పతిత అని నామకరణం చేస్తుంది
ఆలోచనలతో సంబంధం లేకుండా
నీలో పేనుకుపోయిన దారులను ఒక్కొక్కటిగా వేరు చేస్తుంది
అది దాని నైజం
అంగీకారం బలహీనతగా మారడం
అలవాటుగా మారుతుంది.

పక్కా మోసమే కానీ
ఎవరిని ఎవరు మోసం చేస్తున్నారో చెప్పలేము
సుదీర్ఘమైన లేదా ఇటుగా వలస వచ్చిన కాలం
విడతలుగా నిన్ను వాడుకుంటుంది
లేదా నువ్వే వాడుకుంటావు.


కొద్దిసేపు మరణాన్ని భరించు
తన పని తాను చేసుకుపోతుంది.

❖ ❖ ❖ ❖ ❖


## స్వీకృతి





**శ్రీరామాయణ భానువు (పద్యకావ్యం)**
అవుసుల భానుప్రకాశ్
వెల : 150/-
**ప్రతులకు :** 11-10/జి2, సెవెన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్, కె.ఎస్.నగర్, పోతిరెడ్డి పల్లి, సంగారెడ్డి - 502295
ఫోన్: 960 320 450 7





**గొంగడి (గొర్ల కాపరుల కథలు)**
సంపా : డా. మహేందర్ బర్ల, డా. సంగిశెట్టి శ్రీనివాస్
వెల : 150/-
**ప్రతులకు :** డా. సంగిశెట్టి శ్రీనివాస్, ఫ్లాట్ నెం. 212, నందనవనం అపార్ట్‌మెంట్, అత్తాపూర్, హైదరాబాద్ - 500 048.
ఫోన్ : 98492 20321




**మహాభారత ప్రణవము (మహాభారతావతారిక)**
అనువక్త : ఆచార్య శలాక రఘునాథ శర్మ
వెల : 140/-
**ప్రతులకు :** శ్రీమతి సూరి లలిత, 302 - ప్రైమ్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్, అలకాపురి రోడ్ నెం. 3, సరూర్‌నగర్ మం. రంగారెడ్డి జిల్లా. హైదరాబాద్ - 500 003.
ఫోన్ : 98480 60579




**రామం భజే శ్యామలం**
రచయిత : కోవెల సంతోష్ కుమార్
వెల : 300/-
**ప్రతులకు :** రచయిత, 4-48/12, బాబా నగర్, నారపల్లి, ఘట్‌కేసర్ మండల్, పోచారం మునిసిపాలిటీ, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా. హైదరాబాద్ - 500088
ఫోన్ : 905 211 6463





**సాహితీ చంద్రిక**
డా. పులిగడ్డ విజయ లక్ష్మి
వెల : 200/-
**ప్రతులకు :** రచయిత్రి, ఇం.నెం. సి-1, విజయప్రతాప్ అపార్ట్‌మెంట్స్, విద్యానగర్, హైదరాబాద్ - 500 044.
ఫోన్ : 99890 63761, 98490 26107


### చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,**
**బతుకమ్మకుంట, బాగ్‌అంబర్‌పేట,**
**హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**




**శాసన పర్వం**
(తెలంగాణ శతశాసనాల పరిచయం)
డా. భిన్నూరి మనోహరి
వెల : 300/-
మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె/ ఎల్ఐజి 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 934 797 1133




**కోటి లింగాలు (తెలంగాణ ప్రాచీన చారిత్రక వ్యాసాలు)**
డా. సంగనభట్ల నరసయ్య
వెల : 500/-
**ప్రతులకు :** రచయిత, ఫ్లాట్ నెం. 7, ఇం. నెం. 11-7-18/ఎ/1, గాయత్రినగర్, పంజాల్ అనిల్ కాలనీ, సరూర్ నగర్, హైదరాబాద్ -500 035.
ఫోన్ : 9440073124, 998 583 3533




ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 8 (62) UGC CARE List Approved Journal
హైదరాబాద్ జూన్ : 2024

# ప్రాణ ప్రస్తారం

డా. జ్యోత్స్న ఫోన్ : 90002 15466

ఎందుకో ఈ వేళ ఈ గాలి నాకు ఏదో రహస్యం చెప్తున్నట్లుంది
కుక్కర్ ఈలలకే చెవులప్పగించే నాకు ఈ చల్లని గాలి
ఏదో కొత్త భాష నేర్పుతుంది
మొక్కల పక్కన నడుస్తుంటే ఏవో గుసగుసలు చెప్తుంది
వైశాఖంలో తొలి వేకువ వైగైనదిలో ఈదుతున్నంత హాయిగా ఉంది
ఈ చిరుగాలికేదో రాగరసవిద్య తెలిసినట్లుంది
లతలకు షడ్జమం ఇచ్చి వృక్షతతులతో రిషభం పలికించి
గువ్వలకు గాంధర్వం పంచి మనుషులతో మధ్యమం పలికించి
పర్జన్యాలకు పంచమం పంచి దేవాలయాలలో దైవతం పలికించి
నీటి అలలకు నిషాదం ఇచ్చి గలగలల సంగీతం పలికిస్తుంది
ఎన్నెన్ని గమకాలతో గానకచేరి
ఉదయమవుతూనే వెదురు పొదలలో దూరి మోహనరాగం వినిపిస్తుంది





సిందూరవర్ణంతో మెరిసే సూర్యుణ్ని
సింధు భైరవి తో మేల్కొల్పుతుంది
మంద్రసప్తకం అందంగా వీనుల విందుగా..
దూరంగా నెమలి క్రేంకారం
దగ్గరగా కోయిల కుహూరాగం
కోరస్‌గా గానం చేస్తూ పేర్లు తెలియని పిట్టల కిలకిలలు
సప్తమరుత్తులు సప్త స్వరాలు పలికిస్తున్నాయి
సుప్త హృదయంలో కొత్త కాంతులు ప్రసరిస్తున్నాయి



అదృశ్యంగా నాలో నిండిన సమీరం
రూపమేదో ధరించి కనిపిస్తుంది
తోడి రాగమై తోడు వస్తుంది
మలయమారుతరాగమై ఈ మలయ పవనం
మనసును పట్టి ఊపేస్తుంది
మైమరిపిస్తుంది మందమందానిలం .



శ్వాసలో చేరి కంఠంలో కదిలి
మూలాధారం నుంచి సహస్రారం వరకు సంచరిస్తున్న ప్రాణవాయువు
పరమయోగ విద్యను నాకు నేర్పుతున్నట్లుంది
స్వరరాగ యాగమే కాదు అపర ధ్యానయోగం
అభ్యాసం చేయమని ఆనతిస్తున్నట్లున్నది.






Scanned with OKEN Scanner